జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | శుక్రవారం 28 ఆగస్టు 2026 | సంపుటి: 19 | సంచిక: 174 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , శ్రావణ మాసము , తిథి: చతుర్దశి - 09:10:51 వరకు నక్షత్రంధనిశ్ఠ - 26:16:19 వరకు కరణంవణిజ - 09:10:51 వరకు, విష్టి - 21:34:15 వరకు పక్షంశుక్ల యోగంశోభన - 07:55:29 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

పాఠకులకు,
ప్రకటనకర్తలకు ,
శ్రేయోభిలాషులకు
రాఖీ పౌర్ణమి
శుభాకాంక్షలు

## ఖేలో ఇండియా సంవాద్

**దేశాభివృద్ధిలో యువత, క్రీడాశక్తి ఎంతో ముఖ్యం**
**క్రీడాకారులకు ప్రధాని మోడీ శుభాకాంక్షలు**

న్యూఢిల్లీ,ఆగస్ట్27(ప్రజాజ్యోతి): దేశ యువత, క్రీడాకారులకు ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారంనిర్వహించిన ఖేలో ఇండియా సంవాద్ కార్యక్రమంలో ఆయన వర్చువల్‌గా పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న యువ

మిగతా 2లో..

యధావిధిగా లోక్‌సభ
# నియోజకవర్గాలు

**మరో 25 ఏళ్లపాటు ఇలాగే కొనసాగాలి**

**ప్రస్తుత సీట్లకు అనుగుణంగా 33శాతం మహిళా రిజర్వేషన్లు**

**ప్రధాని మోడీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖ**

**తక్షణం అఖిలపక్షం ఏర్పాటు చేసి చర్చించాలని డిమాండ్**



న్యూఢిల్లీ,ఆగస్ట్27(ప్రజాజ్యోతి): లోక్‌సభ నియోజకవర్గాలను యధావిధిగా కొనసాగిస్తూ, మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. అలాగే డిలిమిటేషన్‌పై వెంటనే అఖిలపక్షం ఏర్పాటు చేసి, మీరు ఏమనుకుంటున్నారో చర్చించాలని కూడా అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య 543 మరో 25 ఏళ్లపాటు ఇలాగే ఉండాలని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో డీలిమిటేషన్‌కు సంబంధించిన సవరించిన బిల్లును మళ్లీ ప్రవేశపెట్టనున్నారనే వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. రాష్ట్రాల వారీగా ఉన్న లోక్‌సభ స్థానాల్లోనూ ఎలాంటి మార్పులు చేయొద్దని సూచించారు. డీలిమిటేషన్

మిగతా 2లో..

# రాఖీ పౌర్ణమి వేళ ఆధ్యాత్మిక శోభ

**నేడే రాఖీ పౌర్ణమి ,యజ్ఞోపవీత ధారణ ,హయగ్రీవ జయంతి**

**అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీ..**

**జ్ఞానప్రదాత హయగ్రీవుని ఆరాధన. పవిత్ర యజ్ఞోపవీత ధారణతో వేద సంప్రదాయానికి పునరంకితం**



రాఖీ పౌర్ణమి భారతీయ సంస్కృతిలో సోదరసోదరీమణుల మధ్య ప్రేమానురాగాలు, ఆత్మీయత, పరస్పర రక్షణకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన పర్వదినం. శ్రావణ మాస పౌర్ణమి రోజున దేశవ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో రక్షాబంధన్‌ను జరుపుకుంటారు. సోదరీమణులు తమ సోదరులకు రాఖీ కట్టి, వారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని భగవంతుడిని ప్రార్థిస్తారు. సోదరులు తమ సోదరీమణులకు అండగా నిలిచి, వారి రక్షణకు కట్టుబడి ఉంటామని హామీ ఇవ్వడం ఈ పర్వదినం యొక్క ప్రధాన సందేశం.

12 లో



# మీరాలం చెరువుకు మహర్దశ

**పర్యాటక కేంద్రంగా అభివృద్ధి.. ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణం**

## పనులను పరిశీలించిన సిఎం రేవంత్

హైదరాబాద్,ఆగస్ట్27(ప్రజాజ్యోతి): హైదరాబాద్ నగరంలోని చారిత్రక ప్రాధాన్యం కలిగిన మిర్ ఆలం చెరువుకు తెలంగాణ ప్రభుత్వం సరికొత్త హంగులు అద్దబోతోంది. కుటుంబ సమేతంగా వచ్చి రోజంతా ప్రకృతి అందాలు, జలక్రీడలు , వినోదాన్ని ఆస్వాదించేలా దీనిని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం మిర్ ఆలం చెరువును అకస్మికంగా పరిశీలించారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సుందరీకరణ పనులు , సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణ పురోగతిని అధికారులతో సమీక్షించిన సీఎం, పనులన్నింటినీ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. చెరువుపై నిర్మిస్తున్న ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి పనులు శరవేగంగా సాగుతున్నాయి. లక్ష్యంగా పెట్టుకున్న 544 పైల్స్‌లో 273 (50.18 శాతం) పైల్స్ పూర్తి కాగా, 62 పైల్ క్యాప్స్‌లో 28 (45.16 శాతం) పనులు పూర్తయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. చెరువు పునరుజ్జీవనం, చెరువు పరిసర ప్రాంతాలు , ఐలాండ్ల

మిగతా 2లో..

## భార్యపై భర్త ఆధిపత్యం చెలాయించడం కుదరదు

**పెళ్లి చేసుకున్నంత మాత్రాన భార్య బానిస కాదు**

**పెళ్లంటే పరస్పర గౌరవంతో బతికే బంధం**

**పనిమానిషిగా చూడాలనుకునే తీరు క్షమార్హం కాదు**

**కర్నాటక హైకోర్టు సంచలన వ్యాఖ్యలు**

బెంగళూరు,ఆగస్ట్27(ప్రజాజ్యోతి): వివాహ బంధంలో భార్యపై భర్త ఆధిపత్యం చెలాయించకూడదని కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది. పెళ్లి చేసుకున్నంత మాత్రాన భార్య ఇంటి పనులు చేయాలి, అత్తమామలను తప్పనిసరిగా చూసుకోవాలి, పుట్టింటికి వెళ్లాలంటే భర్త అనుమతి తీసుకోవాలనే

మిగతా 2లో..

# రద్దు చేయాల్సిందే

- జీవో 97 రద్దుకు హరీష్ రావు డిమాండ్
- హక్కుల కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి
- ద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళన
- అయినా ప్రభుత్వం స్పందించడం లేదు
- విద్యను స్కిల్ యూనివర్సిటీతో కలుపొద్దు
- దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలి
- సిఎం రేవంత్‌రెడ్డి బేషజాలకు పోవద్దు
- మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్
- హనుమకొండలో మాజీమంత్రి హరీశ్‌రావు అరెస్టు
- సుబేదారి పోలీస్ స్టేషన్‌కు హరీశ్ రావు తరలింపు
- అరెస్టు చేయడంపై బీఆర్ఎస్ శ్రేణుల ఆగ్రహం
- కలెక్టరేట్ వద్ద నెలకొన్న ఉద్రిక్త వాతావరణం

వరంగల్,ఆగస్ట్27(ప్రజాజ్యోతి): జీవో 97ను రద్దు చేయాలన్న డిమాండ్‌తో వరంగల్‌లో రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించేందుకు వెళ్లారు. అయితే కళాశాలకు చేరుకోకముందే పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో స్టేషన్ వద్దకు చేరుకుని హరీష్‌రావు అరెస్టును నిరసిస్తూ

మిగతా 2లో..



# ఇంకా తెలియని ఆచూకి

**నేపాల్ వరదల్లో 300 మంది భారతీయుల గల్లంతు**

**విషాదంలో 175కు పెరిగిన మృతుల సంఖ్య**

- సహాయక చర్యలకు అనుమతి కోరిన జగ్గీవాసుదేవ్
- ఈషా ఫౌండేషన్‌లో విషాద ఛాయలు
- 80 మంది సంస్థ యాత్రికులు వరదల్లో గల్లంతు
- కన్నీటి పర్యంతం అయిన జగ్గీవాసుదేవ్



ఖాట్మండ్,ఆగస్ట్27(ప్రజాజ్యోతి): నేపాల్ ప్రకృతి విలయంలో గల్లంతైనవారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఈ జలప్రళయంలో 300 మంది వరకు భారతీయులు కొట్టుకుపోయినట్లు నేపాల్ విదేశాంగ శాఖ మంత్రి శిశిర్ ఖనాల్ గురువారం వెల్లడించారు. ఈ విషాదంలో మృతుల సంఖ్య 175కు పెరిగింది.నేపాల్ లోని విపత్తు నిర్వహణ సంస్థ ప్రకటన ప్రకారం.. ఈ ఆకస్మిక వరదల కారణంగా 826 మంది ఆచూకీ గల్లంతయ్యింది. వారిలో 85 మంది భద్రతా సిబ్బంది కాగా.. 162 మంది వివిధ హైడ్రోపవర్ కేంద్రాల్లో పనిచేస్తోన్న ఉద్యోగులు ఉన్నారు. 579 పర్యాటకులు ఉన్నారని ఆ సంస్థ పేర్కొంది. వేలమంది నిరాశ్రయులయ్యారు. ఈ భారీ విపత్తు తీవ్రతను అంచనా వేస్తున్నాం అని ఖనాల్ పేర్కొన్నారు. అటు టిబెట్ వైపు 588 మంది గల్లంతయ్యారు. వారిలో 260 మంది విదేశీయులే. హిమాలయాల్లో కరిగిన మంచు జలవనరుల్లో నీటి మట్టాలను పెంచుతుందని,

మిగతా 2లో..

## మైనింగ్ ఏడీ జయరాజు ఇళ్లపై ఏసీబీ దాడులు

**భారీగా నగదు, నగలు స్వాధీనం**

హైదరాబాద్,ఆగస్ట్27(ప్రజాజ్యోతి): భాగ్యనగరంలో మరోసారి ఏసీబీ సోదాలు కలకలం రేపుతున్నాయి. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూగర్భ గనుల శాఖ ఏడీ జయరాజు ఇళ్లలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. గురువారం తెల్లవారుజాము నుంచే సోదాలు మొదలయ్యాయి. భూపాలపల్లితో పాటు హైదరాబాద్, సూర్యాపేట, తాండూరు ప్రాంతాల్లోని 8 చోట్ల అవినీతి నిరోధక శాఖ అధికారులు తనిఖీలు చేస్తున్నారు.

మిగతా 2లో..

## ఈవి పథకం కింద ఆటో డ్రైవర్లకు సాయం

**200కోట్లు కేటాయిస్తూ జివో జారీచేసిన తెలంగాణ**

హైదరాబాద్,ఆగస్ట్27(ప్రజాజ్యోతి): ఆటో డ్రైవర్లకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఆటోరిక్షా డ్రైవర్లకు ప్రయోజనం కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, డీజిల్‌తో నడిచే ఆటోరిక్షాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు 'తెలంగాణ ఆటోరిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్-2026'ను అమలు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ఈ పథకం అమలుకు సిఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలను

మిగతా 2లో..



# సంపాదకీయం

## మంచుకొండల్లో మహా విలయం

నేపాల్‌లో సంభవించిన భారీ వరదలు తీవ్ర విధ్వంసాన్ని సృష్టించాయి. భారీ ప్రాణ, ఆస్తి నష్టాన్ని మిగిల్చాయి. భోటే కోషి, త్రిశూలి నదుల వెంట ఉన్న గ్రామాలు, పట్టణాలు వరద ప్రవాహానికి తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇళ్లు, రహదారులు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులు వరద నీటిలో కొట్టుకుపోయాయి.ప్రకృతి విలయానికి ఇది సజీవ సాక్ష్యంగా నిలిచింది. గతంలో భారత్‌లో జరిగిన హిమానీ నదాలు ఉప్పొంగి న దానికి మించి అన్నట్లుగా ఈ విలయం ఉంది. ఊళ్లకు ఊళ్లే ధ్వంసం అయ్యాయి. కొండ ప్రాంతాలను కబళించి..కట్టడాలతో ప్రకృతిని దెబ్బతీసారు. దీంతో విలయం తీవ్రంగా ఉంది. ఊళ్లకు ఊళ్లు కొట్టుకు పోవడంతో ప్రజలు నీటి ప్రవాహంలో కొట్టుకు పోయారు. పర్యాటకులు కూడా కొట్టుకు పోయారు. ఎంతమంది ఎక్కడెక్కడ పోయారో లెక్కకట్టడం ఇప్పట్లో అయ్యే పనికాదు. ఇది మనకు హెచ్చరికలాంటిది. ప్రకృతి విలయాలకు పరిష్కారం కనుగొనడం లేదు. రెస్క్యూ ఆపరేషన్‌లో భాగంగా తీసిన ఏరియల్ వీడియోల్లో వరద విధ్వంసం భయానకంగా కనిపిస్తోంది. ఇళ్లు, మార్కెట్లతో కళకళలాడిన ప్రాంతాలు వరద తర్వాత బురద, శిథిలాలతో నిండిపోయాయి. కొన్ని చోట్ల గ్రామాలు ఉన్న ఆనవాళ్లు కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. వరద ఉధృతికి అనేక ప్రాంతాల్లో ఇళ్ల కింది అంతస్తులు పూర్తిగా బురదలో కూరుకు పోయాయి. రహదారులు, వంతెనలు కొట్టుకుపోవడంతో సహాయక బృందాలు ప్రభావిత ప్రాంతాలకు చేరుకోవడం కూడా కష్టంగా మారింది. హిమాలయ దేశం నేపాల్‌లో సంభవించిన మెరుపు వరదలు వందల కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపాయి. భోటే కోషి నది ఉప్పొంగడంతో అనేక జిల్లాలను వరద, బురద కలిసి ముంచెత్తింది. ఈ జలప్రళయానికి మంచుకొండల్లో భూకంపమే కారణమని తొలుత వార్తలు వచ్చాయి. అయితే, హిమనీ సరస్సు బద్దలవడం వల్లే ఈ విపత్తు సంభవించినట్లు తాజాగా అమెరికా జియాలాజికల్ సర్వే తాజాగా వెల్లడించింది. అంతర్జాతీయ రెడ్‌క్రాస్ ప్రతినిధి డేవిడ్ ఫిషర్ మాట్లాడుతూ.. మొత్తం గ్రామాలు, మార్కెట్ ప్రాంతాలు తుడిచిపెట్టుకుపోయాయని తెలిపారు. బుధవారం ఉదయం 8.37 గంటల సమయంలో టిబెట్‌లోని గోసాయిన్‌కుండ ప్రాంతంలో 4.4 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు తొలుత అమెరికా అధ్యయన సంస్థ అంచనా వేసింది. దాని ప్రభావంతో టిబెట్, నేపాల్ (సరిహద్దులోని పర్వత సమూహం నుంచి భారీ కొండ చరియ విరిగిపడినట్లు పేర్కొంది. అయితే, తాజాగా దీనిపై వివరణ ఇచ్చింది. కొండచరియలు విరిగిపడటం వల్లే ప్రకంపనలు సంభవించినట్లు తేలింది. హిమనీ సరస్సు బద్దలై భారీ మంచు చరియలు, రాళ్లు పడ్డాయి. దీంతో లిండే నది ఉప్పొంగి.. బోటే కోషి నదిలోకి వరద ఒక్కసారిగా దూసుకొచ్చిందని అమెరికా జియాలాజికల్ సర్వే స్పష్టం చేసింది. పర్వత ప్రాంతాల నుంచి భారీ పరిమాణంలో ఉన్న మంచు, రాళ్ల చరియలు విరిగిపడుతున్నట్లు శాటిలైట్ దృశ్యాల ద్వారా తెలిసిందని నిపుణులు పేర్కొన్నారు. మరోవైపు, ఈ వరదలను జర్మన్ రీసర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ విశ్లేషించింది. జల ప్రళయానికి దాదాపు 7 నిమిషాల ముందు 4.4 తీవ్రతతో ప్రకంపనలు సంభవించినట్లు తాము గుర్తించామని తెలిపింది. ఆ వెంటనే భీకర వరద నేపాల్ జిల్లాలను ముంచెత్తినట్లు పేర్కొంది. ఈ విపత్తులో ఇప్పటివరకు 157 మంది ప్రాణాలు కోల్పోయారు. వందల మంది గల్లంతయ్యారు. వీరిలో అత్యధికులు విదేశీయులే. భారత్ నుంచి 140 మందికి పైగా వరదల్లో కొట్టుకుపోయినట్లు తెలుస్తోంది. అటు టిబెట్ వైపు కూడా వరద తీవ్రత ఎక్కువగానే ఉంది. ఆ దేశంలో ముగ్గురు మరణించగా.. 553 మందికి పైగా గల్లంత య్యారు. హిమాలయ దేశం నేపాల్‌లో జలప్రళయం వెనుక సమాచార లోపం కూడా ఓ బలమైన కారణంగా కన్పిస్తోంది. మంచు చరియలు విరగడంతో టిబెట్ వైపు వరద సంభవించినట్లు చైనాకు ముందే తెలిసినా తమను హెచ్చరించలేదని నేపాల్ గగ్గోలు పెడుతోంది. ఇరు దేశాల మధ్య ఈ సమాచారమార్పిడికి అధికారిక ఒప్పందం లేకపోవడంతో నేపాల్‌ను బీజింగ్ ముందస్తుగా అప్రమత్తం చేయలేదనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే, చైనా విషయంలో ఇప్పుడు భారత్‌ను కూడా ఇలాంటి సమస్యే వేధిస్తోంది. బ్రహ్మపుత్ర నదిపై చైనా నిర్మిస్తోన్న భారీ డ్యామ్‌తో మన ఈశాన్య రాష్ట్రాలకు కూడా నేపాల్ లాంటి ముప్పు పొంచి ఉందని మరోసారి నిపుణులు హెచ్చరిస్తున్నారు. నేపాల్ కాలమానం ప్రకారం ఉదయం 8.15 గంటలకు టిబెట్‌లోని కెరుంగీ కౌంటీలో మెరుపు వరదలు సంభవించాయి. ఈ ఘటన జరిగిన దాదాపు 45 నిమిషాల తర్వాత నేపాల్‌కు వరదల విషయం తెలిసిందే. అంత సమయం ఉన్నా కూడా చైనా అధికారులు నేపాల్‌ను అప్రమత్తం చేయలేదట. కెరుంగీ నుంచి భారీగా వరదల నేపాల్ దిశగా పోటెత్తినట్లు కొంతమంది స్థానికుల నుంచి చివరకు విపత్తు నిర్వహణ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో వీరు హుటాహుటిన చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతుండగా.. అప్పటికే వరద నేపాల్ జిల్లాలను ముంచెత్తింది. మధ్యాహ్నం ఒంటిగంటకు చైనా నుంచి నేపాల్‌కు సమాచారం అందింది. టిబెట్ వైపు నదిలో కొండచరియలు విరిగి పడటంతో.. భోటేకోషీ, త్రిశూలి నదులకు ముప్పు ఏర్పడిందనేది దాని సారాంశం. టిబెట్‌లో వరదల గురించి బీజింగ్ ముందుగానే తెలుసుకున్నా.. ఆ విషయాన్ని చేరవేయకపోవడంతో పెను నష్టం వాటిల్లినట్లు నేపాల్ ఆరోపిస్తోంది. అయితే, ఈ విపత్తును చైనాను బాధ్యులను చేయలేమని, ఇరు దేశాల మధ్య ఆ ఒప్పందం లేదని నిపుణులు పేర్కొంటున్నారు.

## భార్యపై భర్త ఆధిపత్యం చెలాయించడం కుదరదు

మొదటిపేజీ తరువాయి..

నిబంధన ఏదీ లేదని పేర్కొంది. వివాహం అంటే పరస్పర గౌరవం, నమ్మకం, సమానత్వంతో కొనసాగాల్సిన బంధమని కోర్టు వ్యాఖ్యానించింది. జస్టిస్ చిల్లకూరు సుమలత ధర్మాసనం ఈ అంశంపై కీలక వ్యాఖ్యలు చేసింది. మహిళల వ్యక్తిగత స్వేచ్ఛ, ఆత్మగౌరవాన్ని కాపాడాల్సిన అవసరాన్ని కోర్టు తన తీర్పులో ప్రస్తావించింది. బెంగళూరు రూరల్ జిల్లాకు చెందిన సతీష్ అనే వ్యక్తి తన భార్య, కుమార్తెకు కుటుంబ న్యాయస్థానం నెలకు రూ.9,000 చొప్పున భరణం చెల్లించాలని ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించాడు.




తన భార్య ఇంటి పనులు చేయడం లేదని, తన తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదని, తన అనుమతి తీసుకోకుండానే తరచూ పుట్టింటికి వెళ్తోందని అతడు పిటిషన్‌లో పేర్కొన్నాడు. ఈ వాదనలపై కోర్టు తీవ్రంగా స్పందించింది. భర్త చేసిన ఆరోపణలను పరిశీలిస్తే భార్యను కుటుంబ సభ్యురాలిగా కాకుండా ఇంటి పనుల కోసం ఉంచుకున్న వ్యక్తిగా భావిస్తున్నట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. భార్య తన తల్లిదండ్రులను కలవడానికి పుట్టింటికి వెళ్లాలంటే భర్త లేదా అత్తమామల అనుమతి తీసుకోవాలనే ఆలోచనను కోర్టు ప్రశ్నించింది. ఒక మహిళ తన తల్లిదండ్రులను కలవడానికి ఎవరి అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. భార్య ఎక్కడికి వెళ్లాలి, ఎవరిని కలవాలి అనే విషయాలను పూర్తిగా భర్త నియంత్రించడం సరైన పద్ధతి కాదని కోర్టు పేర్కొంది. ఇలాంటి ఆంక్షలు మహిళ వ్యక్తిగత స్వేచ్ఛను దెబ్బతీసే అవకాశం ఉందని అభిప్రాయపడింది. ఇంటి పనులన్నీ భార్యే చేయాలనే భావన సరికాదని హైకోర్టు స్పష్టం చేసింది. కుటుంబ జీవితంలో భార్యాభర్తలు ఇద్దరూ బాధ్యతలను పరస్పరం పంచుకోవాలని పేర్కొంది. అలాగే వృద్ధ తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత ప్రధానంగా వారి సొంత పిల్లలపై ఉంటుందని కోర్టు తెలిపింది. అత్తమామలను చూసుకోవడాన్ని కోడలిపై తప్పనిసరి బాధ్యతగా మోపడం సమంజసం కాదని స్పష్టం చేసింది. కోడలు అత్తమామలకు సేవ చేయడం ఆమె ఇష్టంతో జరగాలి తప్ప, బలవంతం చేయడం సరికాదని పేర్కొంది. వివాహ బంధం కేవలం కొన్ని ఆచారాలు, సంప్రదాయాలతో ఏర్పడే సంబంధం కాదని కోర్టు పేర్కొంది. భార్యాభర్తల మధ్య ప్రేమ, నమ్మకం, పరస్పర గౌరవం, సహకారం ఉండాలని తెలిపింది. లింగం ఆధారంగా మహిళల స్వేచ్ఛను పరిమితం చేయడం రాజ్యాంగం అందించే సమానత్వ సూత్రాలకు విరుద్ధమని కోర్టు అభిప్రాయపడింది. భార్య, కుమార్తెకు రోజుకు రూ.150 చొప్పున కూడా భరణం చెల్లించలేనని భర్త చేసిన అభ్యర్థనను కోర్టు కొట్టివేసింది.

# మీరాలం చెరువుకు మహర్దశ

మొదటిపేజీ తరువాయి..

అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా చెరువులోకి ఎలాంటి మురుగు నీరు చేరకుండా



పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, వర్షపు నీరు మూసీ నదిలోకి సాఫీగా వెళ్లేలా నాలాలను విస్తరించి నీటి నాణ్యతను పెంచాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. యువతతో పాటు కుటుంబాలను ఆకట్టుకునేలా మిర్ ఆలం చెరువులో బోటింగ్, వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ కార్యకలాపాలను అందుబాటులోకి తేనున్నారు. పర్యావరణ భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా చెరువు చుట్టూ ఫుడ్‌కోర్టులు, పచ్చని పార్కులు, చిన్నారుల కోసం ప్రత్యేక ఆట స్థలాలు , వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు కానున్నాయి. అంతేకాకుండా, చెరువులో ఉన్న ఐలాండ్లను ప్రకృతి ఆధారిత విశ్రాంతి కేంద్రాలుగా, టెంట్లు వేసుకునే గ్లాంపింగ్ స్పాట్లుగా , డెస్టినేషన్ వెడ్డింగ్స్, ఈవెంట్లకు అనుకూలమైన వేదికలుగా రూపుదిద్దనున్నారు. ఈ నాణ్యమైన సౌకర్యాల కోసం పిపిపి విధానంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించి స్థానికులకు ఉపాధి కల్పిస్తారు. సమీపంలోనే ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కుతో మిర్ ఆలం ట్యాంక్ అభివృద్ధిని సమగ్రంగా అనుసంధానించాలని సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశర చేశారు. దీనివల్ల జూ పార్క్ సందర్శనకు వచ్చే పర్యాటకులు ఒకే పర్యటనలో చెరువు అందాలు, జలక్రీడలు , కుటుంబ వినోదాన్ని పొందగలుగుతారు. విమానాశ్రయానికి సమీపంలో ఉండే ఈ చారిత్రక ప్రాంతం అభివృద్ధి చెందితే, హైదరాబాద్ నగరవాసులతో పాటు దేశ, విదేశీ పర్యాటకులకు మిర్ ఆలం ట్యాంక్ ఒక ప్రధాన పర్యాటక గమ్యస్థానంగా మారనుంది.

# ఇంకా తెలియని ఆచూకి

మొదటిపేజీ తరువాయి..

ఇప్పుడు మనందరం చూసింది అదేనని నేపాల్ మంత్రి అన్నారు. ఈ వరద మరింత దిగువకు ప్రవహించి ఉంటే.. భారత రాష్ట్రాలపైనా ప్రభావం పడేందని తెలిపారు. గతంలోనూ ఇలా జరిగిన సందర్భాలున్నాయని గుర్తుచేశారు. భారత్, చైనా, నేపాల్, భూటాన్ పర్యావరణపరంగా అనుసంధానమై ఉన్నాయని, ఈ దేశాలు తమ విభేదాలను పక్కనపెట్టి కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. మంచు చరియలు విరగడంతో టిబెట్ వైపు సంభవించిన వరద గురించి చైనాకు ముందే తెలిసినా నేపాల్‌ను అప్రమత్తం చేయలేదని తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి స్పందన వచ్చింది. ఈ వరదల్లో ఈశా ఫౌండేషన్‌కు చెందిన దాదాపు 80 మంది గల్లంతైన సంగతి తెలిసిందే. దీనిపై సద్గురు జగ్గీ వాసుదేవ్ స్పందించారు. సహాయక చర్యల్లో సహకరించేందుకు తనతోపాటు మరికొంతమంది వాలంటీర్లను అనుమతించాలని చైనా అధికారులను కోరారు. ప్రకృతి విపత్తుతో అల్లకల్లోమైన హిమాలయ దేశానికి భారత్ ఆపన్న హస్తం అందించింది. రెండు విమానాల్లో 47.5 టన్నుల సహాయక సామగ్రితో పాటు రెస్క్యూ బృందాలను ఖాట్మాండూకు పంపింది.
ఈశా ఫౌండేషన్‌కు చెందిన 80 మంది యాత్రికులు నేపాల్ వరదల్లో గల్లంతైన నేపథ్యంలో సంస్థలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సద్గురు అనుచరులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. సాధారణంగా నవ్వుతూ కనిపించే సద్గురు జగ్గీ వాసుదేవ్ కూడా దుఃఖాన్ని అణుచుకోలేక పోయారు. కైలాశ్ యాత్ర అనంతరం ఈశా ఫౌండేషన్ యాత్రికులు టిబెట్‌లోని గ్యిరాంగ్ ఇమిగ్రేషన్ సెంటర్ వద్ద ఉన్న సమయంలో వరద ముంచెత్తినట్టు తెలుస్తోంది. టిబెట్‌లో జరిగిందని చెబుతూ సద్గురు కన్నీటిపర్యంతమయ్యారు. గురువారం అక్కడికి వెళదామనుకున్నా కుదరలేదని చెప్పారు. గల్లంతైన వారి గురించి ఇప్పటివరకూ తమకు అధికారికంగా ఎలాంటి సమాచారం అందలేదని అన్నారు. పరిస్థితి చాలా దారుణంగా కనిపిస్తోందని భావోద్వేగానికి లోనయ్యారు. గ్యిరాంగ్ ఇమిగ్రేషన్ సెంటర్‌లో ఈశా యాత్రికుల బృందం ఉన్న సమయంలో ఆ ప్రాంతాన్ని వరద ముంచెత్తిందని చెప్పారు. తాము ఇమిగ్రేషన్ సెంటర్‌కు వచ్చినట్టు ఈశా గ్రూప్ లీడర్ ప్రవీణ్ నుంచి తనకు ఉదయం 9.05 గంటలకు మెసేజీ వచ్చిందని సద్గురు చెప్పారు. ఆ తరువాత 9.14కు ఆ భవన సముదాయాన్ని వరద ముంచెత్తిందని అన్నారు. గ్రూప్ లీడర్ ప్రవీణ్‌తో ఈశా ఫౌండేషన్ రెండు దశాబ్దాలకు పైగా అనుబంధం ఉందని చెబుతూ కన్నీటిపర్యంత మయ్యారు. కొన్ని క్షణాలకు తేరుకున్న ఆయన మళ్లీ మాట్లాడుతూ ప్రవీణ్ వద్ద ఉన్న నేపాల్ ఫోన్ నెంబర్ ఆ రోజంతా యాక్టివ్‌గా లేదని చెప్పారు. 'ఆయన దాటి వచ్చి ఉంటే నేపాల్ ఫోన్ యాక్టివ్ అయ్యి ఉండేది. కానీ అలా జరగలేదు. అంటే, గ్రూప్ మొత్తం ఇమిగ్రేషన్ సెంటర్‌లోనే ఉండి ఉంటుంది' అని తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. తాను మరికొంత మందితో కలిసి అక్కడికి వెళ్లేందుకు భారత్, చైనాల అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పారు. టిబెట్‌లో మంచుచరియలు విరిగిపడటంతో అక్కడి నదిలో పోటెత్తిన వరద దిగువ ఉన్న నేపాల్‌లో జలప్రయళం సృష్టించినట్టు తెలుస్తోంది. ఈ ఘటనలో 170 మంది మరణించగా, 1500 మంది గల్లంతయ్యారు. ఈ ఘటనలో గల్లంతైన భారతీయుల్లో 100 మంది ఆచూకీ తెలిసినట్టు సమాచారం.

# రద్దు చేయాల్సిందే

మొదటిపేజీ తరువాయి..

జబైఠాయించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన హరీష్‌రావు.. తెలంగాణలో తమ హక్కుల కోసం రైతులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రభుత్వంపై విమర్శలు చేశారు. పాలిటెక్నిక్ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో



ఆందోళన నెలకొన్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీతో అనుసంధానం చేసే విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బేషజాలకు పోకుండా జీవో 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా స్పందించాలని హరీష్‌రావు కోరారు. గతంలో తెలంగాణలోని పలు విశ్వవిద్యాలయాలను రాహుల్ గాంధీ సందర్శించిన విషయాన్ని ప్రస్తావించిన ఆయన.. ప్రస్తుతం పాలిటెక్నిక్ విద్యార్థులు ఆందోళన చేస్తున్న సమయంలో వారి వద్దకు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. విద్యార్థుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు వారికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే వేలాది మంది పాలిటెక్నిక్ విద్యార్థులతో కలిసి ఢిల్లీకి వెళ్లే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసే అంశంపై ప్రభుత్వం మళ్లీ కమిటీ ఏర్పాటు చేయడాన్ని కూడా హరీష్‌రావు తప్పుబట్టారు. ఏపీలోనూ ఇలాంటి నిర్ణయంపై ప్రభుత్వం వెనక్కి తగ్గిందని, ఢిల్లీలోనూ ఈ విధానం విఫలమైందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరచూ తనకు ఆదర్శంగా పేర్కొనే చంద్రబాబు ప్రభుత్వమే పాలిటెక్నిక్ కాలేజీలను స్కిల్ యూనివర్సిటీలో కలపడం సరైన నిర్ణయం కాదని భావించి వెనక్కి తగ్గిందని హరీష్‌రావు వ్యాఖ్యానించారు. అదే విధంగా తెలంగాణలోనూ జీవో 97ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.పాలిటెక్నిక్ విద్యార్థుల్లో నెలకొన్న ఆందోళనకు తాజా పరిణామాలను ఉదాహరణగా చూపిన హరీష్‌రావు.. వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోనే పది మంది విద్యార్థులు టీసీలు తీసుకున్నారని తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో తమ పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. పాలిటెక్నిక్ చదివితే తమ పిల్లల భవిష్యత్తు ఏమవుతుందోనని వారు ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. అయితే ఈ విషయాలపై ప్రభుత్వ వైపు నుంచి అధికారిక వివరణ రావాల్సి ఉంది. జీవో 97ను రద్దు చేసి పాలిటెక్నిక్ కళాశాలలను ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కొనసాగించాలని హరీష్‌రావు మరోసారి డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి తక్షణమే నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఇదే అంశంపై బీఆర్ఎస్ శ్రేణులు కూడా ఆందోళనలను ఉధృతం చేసే సంకేతాలు ఇచ్చాయి. దీంతో పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్య.. ప్రభుత్వం, ప్రతిపక్షం మధ్య మరో రాజకీయ వివాదంగా మారింది.
మాజీ మంత్రి హరీశ్‌రావును హనుమకొండలో పోలీసులు అరెస్టు చేయడంతో కలెక్టరేట్ వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో రోడ్డుపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది. అంతకుముందు టీఎన్జీవోల ధర్నాలో పాల్గొని హరీశ్‌రావు మద్దతు తెలిపారు. దీంతో హరీశ్‌రావును అరెస్టు చేయడంపై బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ కార్యకర్తలకు, పోలీసులకు మధ్య స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. పోలీసులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ నేతలు దాస్యం వినయ్ భాస్కర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఖేలో ఇండియా సంవాద్

మొదటిపేజీ తరువాయి..

అ÷-లథెట్స్‌తో ప్రధాని మోదీ వర్చువల్‌గా సంభాషించారు. అనంతరం యువతను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీడలంటే కేవలం మెడల్స్ కాదని.. యువతలో ఉన్న చైతన్యాన్ని మేల్కొలిపే సాధనాలనీ మోదీ చెప్పుకొచ్చారు. ఆటలు యువశక్తిని వెలికితీస్తాయన్నారు. దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోవడానికి యువశక్తితో పాటు క్రీడాశక్తి కూడా ఎంతో అవసరమని మోదీ పేర్కొన్నారు. భారత్ ఒలింపిక్స్‌లో తగిన ప్రాతినిథ్యం వహించట్లేదని ప్రధాని విచారం వ్యక్తం చేశారు. దేశం క్రీడలపై ఎక్కువగా



ఆసక్తి చూపడంలేదన్నారు. 2012లో ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత్.. 12 ఆటల్లో మాత్రమే మెడల్స్ సాధించిందని తెలిపారు. సర్ఫింగ్ వంటి ఆటల్లో మన క్రీడాకారులు ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నించారు. దేశంలో ప్రతిభకు లోటు లేదని, మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తలపెట్టిందని తెలిపారు. ముఖ్యంగా 5 నుంచి 15 ఏళ్ల వారిలో టాలెంట్‌ను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. వచ్చే ఒలింపిక్స్‌లో భారత్ చెప్పుకోదగ్గ స్థాయిలో పథకాలను సాధించాలని ఆయన కోరారు. ఇందుకోసం ప్రభుత్వం.. క్రీడాకారులు, అలథెట్లకు సహాయ సహకారాలు అందిస్తుందని ప్రధాని హామి ఇచ్చారు. డిసెంబర్‌లో జరిగే 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సందర్భంగా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ పోటీలను నిర్వహించనున్నారు.

## మైనింగ్ ఏడీ జయరాజు ఇళ్లపై ఏసీబీ దాడులు

మొదటిపేజీ తరువాయి..

వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో దాడులు కొనసాగుతున్నాయి. సోదాల్లో జయరాజ్ ఇంట్లో లక్షన్నర నగదు, బంగారు ఆభరణాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బోడుప్పల్‌లో జీ ప్లస్ వన్ బిల్డింగ్, ల్యాండ్ డాక్యుమెంట్లను గుర్తించి.. పరిశీలిస్తున్నారు. బ్యాంకులో రూ.60 లక్షల నగదు ఏసీబీ అధికారులు గుర్తించారు. అలాగే రెండు కార్లు, రెండు బైక్‌లు, జనగామలో ఐదు ఎకరాల భూమి ఏసీబీ అధికారుల తనిఖీల్లో బయటపడింది. సోదాలపై ఏబీసీ జాయింట్ డైరెక్టర్ సాయి మనోహర్ మాట్లాడుతూ.. భూగర్భ జల గనుల శాఖ ఏడీ జయరాజు నివాసంలో పాటు మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో సోదాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఉదయం నుంచి జరుగుతున్న సోదాల్లో నలభై తులాల బంగారాన్ని గుర్తించామన్నారు. జయరాజ్ ఇంట్లో లక్షన్నర నగదుతో పాటు ఆయన బ్యాంకు ఖాతాలో నగదును కూడా గుర్తించామని చెప్పారు. జనగామలో జయరాజుకు ఐదు ఎకరాల వ్యవసాయ భూమి ఉందని.. ఆయనపై ఏసీబీకి అనేక ఫిర్యాదులు వచ్చాయన్నారు. హైదరాబాద్‌లోనే నాలుగు చోట్ల సోదాలు కొనసాగుతున్నాయని సాయి మనోహర్ తెలిపారు. తాండూరు, వరంగల్‌లోని జయరాజ్ సన్నిహితులు, బంధువుల ఇళ్లల్లో కూడా సోదాలు జరుగుతున్నాయని అన్నారు. బోడుప్పల్‌లో జీ ప్లస్ వన్ బిల్డింగ్‌తో పాటు రెండు కార్లు, రెండు బైక్‌లను కూడా గుర్తించామన్నారు. సాయంత్రం వరకు సోదాలు కొనసాగుతాయని.. సోదాల అనంతరం ఆయన అక్రమాస్తులపై క్లారిటీ వస్తుందని వెల్లడించారు. జయరాజ్ ఇటీవలే స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్నారు. ములుగు, భూపాలపల్లి జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతు న్న కొందరితో జయరాజ్ కుమ్మక్కయ్యారన్న ఆరోపణలు గతంలో అనేకసార్లు వెల్లువెత్తాయి. ఈ వ్యవహారంలో అక్రమంగా ఆస్తులు కూడబెట్టరా..? అనే కోణంలో ఏసీబీ అధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింద్.

## యధావిధిగా లోక్‌సభ నియోజకవర్గాలు



మొదటిపేజీ తరువాయి..

దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపే అత్యంత కీలకమైన విషయమని తెలిపారు. దీనిపై నిర్ణయం తీసుకునే ముందు అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాల అభిప్రాయాలకూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమల్లోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జనాభా నియంత్రణకు కృషి చేసిన రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా రాజ్యాంగపరమైన రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. డీలిమిటేషన్‌పై ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా విస్తృత రాజకీయ సంప్రదింపులు జరపాలన్నారు. డీలిమిటేషన్ ప్రతిపాదనలపై చర్చించేందుకు సర్వపక్ష సమావేశం నిర్వహించాలని, రాజకీయ పార్టీలు ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించేందుకు తగిన సమయం ఇవ్వాలని ఆయన కోరారు. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 ఏప్రిల్ 17వ తేదీన లోక్‌సభలో అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీని సాధించలేక పోయిందని పేర్కొన్నారు. అటువంటి విధానాన్ని మళ్లీ పునరావృతం చేయవద్దని కోరారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచే ఎలాంటి నిర్ణయానికైనా కాంగ్రెస్, విపక్ష కూటమి మద్దతు ఇవ్వబోదని ఖర్గే తేల్చి చెప్పారు. లోక్‌సభ స్థానాలను పెంచేందుకు కేంద్రం ప్రయత్ని స్తోందని, ఇది కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు. మహిళలకు చట్టసభల్లో కల్పించే 33 శాతం రిజర్వేషన్లను డీలిమిటేషన్ పక్రియతో ముడిపెట్టడాన్ని ఖర్గే తప్పుపట్టారు. ఈ అంశంపై తాను గతంలో జులై 16న కూడా లేఖ రాశానని, కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడంతో తాజా పరిణామాల నేపథ్యంలో మోదీకి మళ్లీ లేఖ రాయాల్సి వచ్చిందని ఖర్గే పేర్కొన్నారు.

## ఈవి పథకం కింద ఆటో డ్రైవర్లకు సాయం

మొదటిపేజీ తరువాయి..

ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఇందుకోసం ఏకంగా రూ.200 కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఇంధన ధరలు,



వాహన నిర్వహణ ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆటో డ్రైవర్లకు ఈ పథకం కొంత ఉపశమనం కలిగించే అవకాశం ఉంది. ఈ పథకం ద్వారా సంప్రదాయ ఇంధన వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ ఆటోల వినియోగం పెరగనుంది. పెట్రోల్, డీజిల్ కోసం రోజూ అయ్యే ఖర్చుతో పోలిస్తే ఎలక్ట్రిక్ వాహనాల నిర్వహణ వ్యయం తగ్గే అవకాశం ఉండటంతో ఆటో డ్రైవర్లకు దీర్ఘకాలికంగా ప్రయోజనం చేకూరనుంది. రూ.200 కోట్ల నిధులతో 18,766 ఆటోలను ఇవిలుగా మార్చే పక్రియను ప్రభుత్వం ఎలా అమలు చేస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

**బహిరంగ ప్రకటన: దస్తావేజు మిస్సింగ్**

నా క్లయింట్ శ్రీ M. రాజు తండ్రి: M. బుచ్చన్న, హమాలీ కాలనీ, గద్వాల, Ph: 9848970308) యాజమాన్యంలోని క్రింది షెడ్యూలు ఆస్తికి చెందిన అసలు (Original) రిజిస్టర్డ్ సేల్ డీడ్ నెం. 3438/1987 (తేది: 03/12/1987, SRO గద్వాల) పోయినది. గద్వాల పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ రిపోర్ట్ (రసీదు నెం: 1580210826 1274187953, తేది: 21/08/2026) నమోదు చేసి, SRO నకలు (CC) పొందడమైనది.
సదరు ఆస్తిపై బ్యాంక్ రుణం/తనఖా కొరకు ప్రతిపాదిస్తున్నందున, ఈ ఆస్తిపై లేదా పోయిన అసలు దస్తావేజుపై ఎవరికైనా క్లెయిమ్‌లు/ అభ్యంతరాలు ఉంటే ఈ ప్రకటన వచ్చిన 14 రోజులలోపు తగిన ఆధారాలతో క్రింది అడ్వకేట్‌ను సంప్రదించగలరు. లేనిచో టైటిల్ నిర్దోషమైనదిగా పరిగణించబడును.

**షెడ్యూలు ఆస్తి వివరాలు:**
వివరము: గద్వాల శివారు, Sy.No. 780/Aలోని ప్లాట్ నెం. 49 (25'×40') & ప్లాట్ నెం. 48 లో (5'×40'), మొత్తం: 30'×40' (133.33 చ.గ.).
హద్దులు:తూర్పు: ప్లాట్ 46 & 47 । పడమర: 23' రోడ్డు । ఉత్తరం: ప్లాట్ 48 మిగిలిన భాగం । దక్షిణం: ప్లాట్ 50.
**తేది: 27/08/2026 । స్థలం: గద్వాల**
**M. ప్రియాంక, అడ్వకేట్** (TS/300/2019)
**Ph: 9398420938**

## వాగ్దారి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం




**నేరడిగొండ ఆగస్టు 27 (ప్రజాజ్యోతి) :** హార్వెస్ట్ మినిస్ట్రీస్, ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ సంయుక్త ఆధ్వర్యంలో వాగ్దారి గ్రామంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వాగ్దారి గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు నిపుణులైన వైద్యులు ఉచితంగా వైద్య సేవలు అందించారు.

ఈ సందర్భంగా రక్త పరీక్షలు, బీపీ, షుగర్, కంటి పరీక్షలు, ఎక్స్‌రే, దంత వైద్య పరీక్షలు, మహిళల ఆరోగ్య పరీక్షలు, ఈసీజీ తదితర పరీక్షలను నిర్వహించారు. వైద్యుల సూచనల మేరకు అర్హులైన రోగులకు ఉచితంగా మందులు, కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ శిబిరానికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జాదవ్ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. వాగ్దారి గ్రామంలో ఇంత పెద్ద స్థాయిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం ఇదే తొలిసారి అని తెలిపారు. గ్రామీణ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

హార్వెస్ట్ మినిస్ట్రీస్ కోఆర్డినేటర్ శ్రీధర్ మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా అందించడమే తమ డైరెక్టర్ రాయపాటి కాలేబ్ లక్ష్యమని తెలిపారు. ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ మెడికల్ ఇన్‌చార్జి జయరాజ్ శిబిరంలో నిర్వహించిన వివిధ వైద్య పరీక్షల వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సోయాం లక్ష్మణ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, పాస్టర్ పిడుగు సునీల్, హార్వెస్ట్ మినిస్ట్రీస్, ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ వైద్య, పారామెడికల్ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ఏ ఒక్కరి ఓటు హక్కు తొలగిపోకూడదు

**రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ఎస్ఐఆర్**
**నిర్మల్ నియోజకవర్గం కోఆర్డినేటర్ తాహెర్ బీన్**



**సోన్, ఆగష్టు 27(ప్రజా జ్యోతి) :** అర్హులైన ఏ ఒక్కరి ఓటు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్, ఎస్ఐఆర్ నిర్మల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ తాహెర్ బీన్ ఆమ్దాన్ అన్నారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)లో భాగంగా సోన్ మండలం కడ్తాల్ గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ లో భాగంగా విడుదలైన ముసాయిదా ఓటరు జాబితాలో ఎవరి పేర్లలోనైనా తప్పులు ఉన్నా, ఇతర సమస్యలు ఉన్నా సంబంధిత ఆధారాలతో అధికారులను సంప్రదించిసరిచేసుకోవచ్చన్నారు. దీనిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండే యువతీ యువకులు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలో అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి మిస్ కాకుండా బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రజలకు అందుబాటులో ఉండి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుర్రం రాము, నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమా భీంరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు గాజుల రవికుమార్, శ్రీ గండి రామన్న దత్త సాయి ఆలయ చైర్మన్ కొట్టే శేఖర్, కాంగ్రెస్ పార్టీ సోన్ మండల అధ్యక్షులు మోహినొద్దీన్, గ్రామ కార్యదర్శి సుమయ తస్కిన్, ఆర్ఐ జ్ఞానేశ్వర్, జీపీఓ గంగాధర్, బీఎల్ఓలు పద్మావతి, గోదావరి, వార్డు సభ్యులు, బీఎల్ఏలు పాల్గొన్నారు.

## ప్రభుత్వం వెంటనే రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



**జన్నారం, ఆగస్ట్ 27 (ప్రజాజ్యోతి) :** రెడ్డి కులంలో ఉన్న పేదవారిని ఆదుకోవడానికి ప్రభుత్వం వెంటనే రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుర్రం మోహన్ రెడ్డి కోరారు. గురువారం రోజు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెడ్డి సామాజిక వర్గంలో ఉన్న పేద రెడ్డి లకు ఉపాధి ఆర్థికంగా మరియు వ్యవసాయ రంగంలో వారిని ఆదుకోవడానికి రెడ్డి కార్పొరేషన్ ఎంతగానో ఉపయోగపడుతుందని, కావున ప్రభుత్వం వెంటనే స్పందించి రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రెడ్డి కులస్తులలో కూడా చాలామంది పేదరికంలో ఉన్నారని, రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్లయితే పేద రెడ్డి కులస్తులందరికీ న్యాయం జరుగుతుందని, రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం వలన రెడ్డి కులస్తుడు అభివృద్ధి చెందే అవకాశం ఉందని కావున ప్రభుత్వం వెంటనే రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం మండల గౌరవ అధ్యక్షుడు ఏనుగు సుభాష్ రెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు సామ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలి: కలెక్టర్

**- కలెక్టరేట్‌లో మొక్కలు నాటిన అధికారులు**
**- మొక్కలు నాటి సంరక్షించాలి: కలెక్టర్ హరిత**

**ఆసిఫాబాద్ ఆగష్టు 27 ప్రజా జ్యోతి :** వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేసి త్వరగా పూర్తి చేయాలని కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలోని ఖాళీ ప్రదేశాల్లో జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం. డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు మరియు ఇతర జిల్లా అధికారులతో కలిసి ఆమె మొక్కలు నాటారు.

?ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, నాటిన మొక్కలను సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ భూములు, కార్యాలయాలు, పాఠశాలలు, కాలువలు, చెరువు గట్లు మరియు రహదారులకు ఇరువైపులా విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు. నాటిన ప్రతి మొక్క రక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వన మహోత్సవంలో ప్రజలు, అధికారులు స్వచ్ఛందంగా భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# అర్హులందరికీ రేషన్ కార్డులు..
# ఇల్లు లేని ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు

**పైరవీ కారులను నమ్మొద్దు  స్మార్ట్ కార్డుల పంపిణీలో ఎమ్మెల్యే బొజ్జు పటేల్**





**ఖానాపూర్ ఆగస్టు 27(ప్రజాజ్యోతి) :** బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని అరుపులైన వారికి రేషన్ కార్డులతో పాటు ఇందిరమ్మ ఇండ్లు నిర్మింప చేస్తామని ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తామని మధ్య దళారి పైరవి కార్లను నమ్మరాదని  ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ అన్నారు గురువారం ఖానాపూర్ నియోజకవర్గం ఉట్నూర్ మండలం లక్కారం గ్రామంలో నిర్వహించిన డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్  మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి అర్హుడికి రేషన్ కార్డు అందించాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి  నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని అదేవిధంగా రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన సన్నబియ్యం అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి  రేవంత్ రెడ్డి  సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు.

ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. గుడిసెలు లేని గ్రామాల ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఇళ్లు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసే వ్యక్తులను నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించారు.

ప్రతి అర్హుడికి దశలవారీగా ఇందిరమ్మ ఇల్లు అందించే బాధ్యత నాదే అని ఎమ్మెల్యే బొజ్జు పటేల్  స్పష్టం చేశారు.

లక్కారం గ్రామంలో ఇప్పటికే చాలా వరకు సీసీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా త్వరలో పూర్తి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే గ్రామంలో ఉన్న చెరువును మినీ ట్యాంక్‌బండ్ తరహాలో అభివృద్ధి చేసి, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

గ్రామంలో అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేస్తూ లక్కారం గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అధికారి ఆసనం అలంకారప్రాయమేనా?

**- జిల్లా డీపీఆర్వో తీరుపై విమర్శలు**
**- ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారంలో సమన్వయం ఏదీ  ?**

**వాంకిడి ఆగస్టు 27 ప్రజాజ్యోతి :** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ కార్యక్ర మాలు ప్రజా సంక్షేమ పథకాలు అధికారిక కార్యక్రమాల సమాచారాన్ని ప్రజలకు చేరవేయడం లో కీలక పాత్ర పోషిం చాల్సిన జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి (డీపీఆర్వో) కార్యాల యం పనితీరుపై పలు విమర్శలు వ్యక్తమవుతు న్నాయి. అధికారిక సమా చారం ప్రభుత్వ కార్యక్రమాల వివరాలు మీడియాకు అందాల్సిన సమాచారంలో సమయపాలన సమన్వయం లోపిస్తున్నదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి  సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సమాచార శాఖ వారధిగా పనిచేయాల్సి ఉంటుంది ముఖ్యంగా జిల్లాలో జరిగే అధికారిక కార్యక్రమాలు  ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు  వివిధ శాఖల కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని మీడియాకు అందుబాటులో ఉంచడం డీపీఆర్వో కార్యాలయం ప్రధాన బాధ్యతల్లో ఒకటి

అయితే జిల్లా స్థాయిలో సమాచార వ్యవస్థ ఆశించిన స్థాయిలో పనిచేస్తుందా ? మీడియా ప్రతినిధులకు అధికారిక సమాచారం అందుతున్న తీరుపై అధికారులు సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందా ? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి  కొన్ని సందర్భాల్లో కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం ఆలస్యంగా అందడం  సంబంధిత అధికారులతో సమన్వయం లోపించడం వంటి అంశాలపై మీడియా వర్గాల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది

అధికారి ఆసనం అలంకారప్రాయమేనా ?

ప్రజలకు ప్రభుత్వ పాలనకు సంబంధించిన సమాచారాన్ని చేరవేయాల్సిన బాధ్యత కలిగిన కీలక అధికారి పోస్టు కేవలం హోదాకే పరిమితమవుతోందా లేక బాధ్యతలను సమర్థవం తంగా నిర్వహిస్తున్నారా? అనే చర్చ జరుగుతోంది  ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారంలో సమాచార శాఖ పాత్ర మరింత చురుకుగా ఉండాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. జిల్లాలోని గ్రామీణ  ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో సమాచార శాఖకు మరింత బాధ్యత ఉంది ఈ నేపథ్యంలో జిల్లా డీపీఆర్వో కార్యాలయం మీడియా ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయాన్ని పెంచి అధికారిక సమాచారాన్ని పారదర్శకంగా  సమయానికి అందుబాటులోకి తీసుకురావాలని మీడియా వర్గాలు కోరుతున్నాయి.

**ఉన్నతాధికారులు స్పందించాలి :** జిల్లా సమాచార శాఖ పనితీరుపై ఉన్న సందేహాలను నివృత్తి చేయడంతో పాటు మీడియాకు అధికారిక సమాచారం అందించే విధానాన్ని మరింత పటిష్టం చేయాలని పలువురు కోరుతున్నారు సంబంధిత ఉన్నతాధికారులు డీపీఆర్వో కార్యాలయ పనితీరును సమీక్షించి లోపాలు ఉంటే సరిదిద్దే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజలకు ప్రభుత్వ సమాచారాన్ని చేరవేయాల్సిన బాధ్యత ఉన్న శాఖలో జవాబుదారీతనం పారదర్శకత సమన్వయం మరింత పెరగాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# దాస్ సేవా సమితి సేవలు అభినందనీయం

**- బంబార ఆశ్రమ పాఠశాలలో నూతన - మరుగుదొడ్లు ప్రారంభం**
**- బాలికల పరిశుభ్రత, ఆరోగ్యానికే మొదటి ప్రాధాన్యం: సర్పంచ్ కృష్ణాజీ**

**ఆసిఫాబాద్ ఆగష్టు 27 ప్రజా జ్యోతి :** కొమురంభీం ఆసిఫాబాద్ వాంకిడి బంబార గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల సౌకర్యార్థం 'దాస్ సేవా సమితి' ఆధ్వర్యంలో నిర్మించిన నూతన టాయిలెట్లు, బాత్రూమ్‌లను గురువారం గ్రామ సర్పంచ్ బెండారే కృష్ణాజీ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినుల ఆరోగ్యం, పరిశుభ్రతకు మొదటి ప్రాధాన్యం ఇస్తూ మౌలిక వసతులు కల్పించడం అభినందనీయమన్నారు. ఆశ్రమ పాఠశాల బాలికల అవసరాలను గుర్తించి స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన దాస్ సేవా సమితి చైర్మన్ గాయత్రి గుప్తాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా పాఠశాల అభివృద్ధికి, గ్రామంలోని ఇతర అవసరాలకు సేవా సమితి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్క యశస్వి, దాస్ సేవా సమితి చైర్మన్ గాయత్రి గుప్తా, ఉప సర్పంచ్ జాడి సంతోష్, నాయకులు డీకొండ మహేష్, సుచిత్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# మాదక ద్రవ్యాల నియంత్రణ,
# రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

**- మాదక ద్రవ్య రహిత మంచిర్యాల జిల్లా సాధనకు కృషి - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**
**- విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలతో నిరంతర అవగాహన - రోడ్డు భద్రత నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**






**మంచిర్యాల, 27, ఆగష్టు (ప్రజాజ్యోతి) :** జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణ దిశగా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. గురువారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో డీసీపీ ఎ. భాస్కర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ఞతో కలిసి మాదక ద్రవ్యాల నియంత్రణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్య రహిత మంచిర్యాల జిల్లా సాధనలో భాగంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు 49 కేసులు నమోదు చేసి, 103 మందిని గుర్తించినట్లు వెల్లడించారు. మాదక ద్రవ్యాల వినియోగదారులను గుర్తించి, కోర్టు ద్వారా 30 మందిని డ్రగ్ డీ-అడిక్షన్ కేంద్రాలకు తరలించి కౌన్సెలింగ్ అందిస్తున్నట్లు తెలిపారు. విద్యాసంస్థల్లో విద్యార్థులతో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేశామని, వాటి ఆధ్వర్యంలో ప్రతి నెల అవగాహన కార్యక్రమాలతో పాటు మాదక ద్రవ్యాల నియంత్రణపై క్విజ్, డ్రాయింగ్ తదితర పోటీలు నిర్వహించాలని సూచించారు. విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో బెల్ట్ షాపులు నిర్వహించడం, పొగాకు ఉత్పత్తులు విక్రయించడాన్ని నియంత్రించాలని అధికారులను ఆదేశించారు. మెడికల్, ఐటీఐ, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో విద్యార్థుల ప్రవర్తనను నిరంతరం గమనిస్తూ మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో మద్యం దుకాణాలు నిర్ణీత సమయానికి మూసివేసేలా చర్యలు తీసుకోవాలని, బెల్ట్ షాపులను నియంత్రించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గంజాయి తదితర మాదక మొక్కల సాగును గుర్తించి చర్యలు చేపట్టాలని సూచించారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో మెడికల్ షాపులను నిత్యం పర్యవేక్షిస్తూ, సరైన ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించే దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నంతరం పోలీస్, రవాణా, జాతీయ రహదారులు, రోడ్లు భవనాలు, ఆర్టీసీ, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులతో రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలను పటిష్టంగా అమలు చేయాలని, వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మున్సిపల్ పరిధిలో అవసరమైన చోట్ల స్పీడ్ బ్రేకర్లు, రోడ్డు భద్రత సూచికలు ఏర్పాటు చేయాలని, రోడ్లపై చెత్త, ఇతర ఆటంకాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అనధికార వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తక్కువ విజిబిలిటీ ఉన్న ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు జాతీయ రహదారులపై రంబుల్ స్ట్రిప్స్, లైటింగ్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఓవర్‌లోడింగ్, అతివేగం, డ్రంక్ అండ్ డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో అదుపు తప్పిన, ఓవర్‌లోడెడ్, పరిమితికి మించి వేగంగా నడిచే వాహనాలపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు 95 డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేసినట్లు వెల్లడించారు. ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులపై కూడా చర్యలు తీసుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించేలా ట్రాఫిక్ పోలీసులు కఠినంగా వ్యవహరించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా వేగ పరిమితి, హెచ్చరిక, జాగ్రత్త సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, గ్రామీణ, అంతర్గత రహదారుల్లోనూ ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు. రోడ్లపై సంచరించే పశువులను అందుబాటులో ఉన్న గోశాలలకు తరలించాలని, నూతన గోశాల ఏర్పాటుకు భూమి కేటాయించినందున పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రహదారి ప్రమాదాలు, మరణాలను తగ్గించేలా అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు.

ఈ సమావేశంలో మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, మంచిర్యాల, బెల్లంపల్లి, జైపూర్ ఏసీపీలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లక్కంపూర్‌లో ఓటర్ల జాబితా సవరణపై ప్రత్యేక గ్రామ సభ



**నేరడిగొండ, ఆగస్టు 27 (ప్రజాజ్యోతి) :** ఓటర్ల జాబితా సవరణలో భాగంగా మండలంలోని లక్కంపూర్ గ్రామపంచాయతీలో గురువారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల ఎంపీడీఓ గంగాసాగర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆర్ఐ సాయిరాం, జీపీఓ పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన ఓటర్ల జాబితాలో ఉన్న తప్పులను సవరించడంతో పాటు, ఓటర్లకు అందిన నోటీసులపై అధికారులు వివరించారు.

సంబంధిత ఓటర్ల నుంచి సరైన ధ్రువపత్రాలను సేకరించారు. లక్కంపూర్ జీ, ఆర్ గ్రామాల్లో మొత్తం 90 మంది ఓటర్లకు నోటీసులు జారీ కాగా, 45 మంది ఓటర్లు తమ నోటీసు లతో పాటు అందుబాటులో ఉన్న సరైన పత్రాలను బీఎల్ ఓలకు అందజేశారు. అనంతరం ఎంపీడీఓ గంగాసాగర్ రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. కార్యక్రమంలో బీఎల్ఓ జైతు, పంచాయతీ కార్యదర్శి సునీల్ కుమార్, సర్పంచ్ షెడ్మకి సుజాత గంగాధర్, ఉపసర్పంచ్ పూజ సిద్దేశ్వర్‌తో పాటు ఓటర్లు పాల్గొన్నారు.

## నీట్ స్టేట్ 26వ ర్యాంకర్ వైష్ణవికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఘన సన్మానం



**నేరడిగొండ, ఆగస్టు 27 (ప్రజాజ్యోతి) :** మండలంలోని ఇస్పూర్ గ్రామానికి చెందిన పెల్ప గణేష్ కుమార్తె పెల్ప వైష్ణవి నీట్ (స్టేట్)లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో 26వ ర్యాంక్ సాధించిన సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆమెను ఘనంగా సన్మానించి అభినందించారు. గురువారం వైష్ణవి నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆమెను శాలువాతో సత్కరించి, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్న గ్రామాల నుంచి విద్యలో ప్రతిభ కనబరుస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించడం అభినందనీయమన్నారు. వైష్ణవి సాధించిన విజయం ఇస్పూర్ గ్రామానికే కాకుండా నేరడిగొండ మండలానికి గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థులు వైష్ణవిని ఆదర్శంగా తీసుకుని పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ నానక్ సింగ్, సర్పంచ్ రమేష్, నాయకులు అనిల్ యాదవ్, దేవేందర్ రెడ్డి, సర్పంచ్ జీవన్, కృష్ణ యాదవ్, నజీర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.


## ప్రజల చెంతకు కార్పొరేట్ వైద్యం




**మంచిర్యాలరూరల్ ఆగష్టు 27 (ప్రజాజ్యోతి) :** పేద,మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం చేరువ చేయాలనే ఉద్దేశంతో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వేంపల్లిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం 15వ డివిజన్‌లో జరిగిన ఈ శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. డివిజన్ కార్పొరేటర్ చింతపండు శ్రీనివాస్ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ సీఎస్ఆర్‌లో భాగంగా మెడికవర్ ఆసుపత్రి ప్రజల వద్దకే వైద్య సేవలను తీసుకురావడం అభినందనీయమన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఇటువంటి శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు.

శిబిరానికి సుమారు 150 మంది హాజరయ్యారు. వైద్యులు వారికి బీపీ, షుగర్,ఈసీజీతో పాటు రక్త పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి వైద్య సూచనలు అందించడంతో పాటు మందులను ఉచితంగా పంపిణీ చేశారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ సర్పంచులు గోనె సంజయ్‌కుమార్,వోలపు శారదా రమేష్,15వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నార్ల మహేందర్, మాజీ ఉపసర్పంచ్ మొగిలి తిరుపతి,మెడికవర్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్,అబ్దుల్ వకీల్, విద్యాసాగర్, మల్లికార్జున్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఖిరిడి గ్రామపంచాయతీలో ప్రత్యేక కార్యక్రమం



**వాంకిడి ఆగస్టు 27 ప్రజా జ్యోతి :** వాంకిడి మండలం ఖిరిడి గ్రామపంచాయతీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని నిర్వహించారు  సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు ప్రజలు  మహిళలు పాల్గొని తమకు సంబంధించిన వివరాలు  అవసరమైన పత్రాలను అధికారులకు అందజేశారు.

ఓటర్ల జాబితాలో పేర్లు చిరునామా తదితర వివరాలను పరిశీలించడంతో పాటు  అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు వివరాల్లో ఏవైనా తప్పులు ఉన్నట్లయితే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి సరిచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు మహిళలు స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పాలమూరు ఖ్యాతిని వెండితెరపై చాటుతున్న నటుడు సుధాకర్ రెడ్డి

మహబూబ్‌నగర్ ఆగస్టు 27 ( ప్రజా జ్యోతి బ్యూరో ): పాలమూరు ముద్దుబిడ్డ, ధర్మపూర్ వాసి ఎదిరేపల్లి సుధాకర్ రెడ్డి తెలుగు సినీ రంగంలో అంచెలంచెలుగా ఎదుగుతూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటున్నారు. ఇప్పటివరకు సుమారు 25 చిత్రాల్లో నటించడంతో పాటు, 50కిపైగా టీవీ సీరియల్స్, వెబ్ సిరీస్‌లలో తన నటనా




ప్రతిభను చాటుతూ విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు. సుధాకర్ రెడ్డి తన కళా ప్రస్థానం ద్వారా పాలమూరు ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువస్తున్నారని పలువురు అభినందించారు. ఈ సందర్భంగా ఆయనను జయప్రకాష్ నారాయణ ఇంజినీరింగ్ కళాశాలకు ఆహ్వానించి విద్యార్థినీ, విద్యార్థులకు పరిచయం చేశారు. అనంతరం ఆయన సినీ ప్రయాణం, ఎదుర్కొన్న సవాళ్లు, కష్టపడి సాధించిన విజయాల గురించి విద్యార్థులతో పంచుకున్నారు.
సుధాకర్ రెడ్డి అనుభవాలను విద్యార్థులు ఆసక్తిగా విని, ఆయన ప్రయాణం తమకు ఎంతో ప్రేరణనిచ్చిందని తెలిపారు. ప్రతిభతో పాటు పట్టుదల, కృషి ఉంటే ఏ రంగంలోనైనా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చనే సందేశాన్ని ఆయన తన అనుభవాల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జేపీఎన్సీ చైర్మన్ కె.ఎస్. రవికుమార్ మాట్లాడుతూ.. పాలమూరు గర్వించదగిన కళాకారుడిగా ఎదుగుతున్న సుధాకర్ రెడ్డిని ప్రతి ఒక్కరూ అభినందించి ప్రోత్సహించాలని కోరారు. ఆయనకు తమ వంతు సహకారం అందిస్తూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ముంపు బాధితులకు న్యాయమే తొలి ప్రాధాన్యత

**- బండరావిపాకుల నిర్వాసితులకు రూ.8.33 కోట్ల పరిహారం**
**- ముంపు నిర్వాసితుల కోసం రూ.67 కోట్లు విడుదల**
**- 125 మంది బాధితులకు పరిహారం చెక్కుల పంపిణీ**

వనపర్తి, ఆగస్టు 27 (ప్రజాజ్యోతి): నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేయడమే ప్రజా ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో బండరావిపాకుల ముంపు బాధితులకు పరిహారం చెక్కుల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 125 మంది లబ్ధిదారులకు రూ.8.33 కోట్ల





పరిహారం చెక్కులను అందజేశారు. బండరావిపాకుల, కొంకలపల్లి ముంపు నిర్వాసితుల కోసం ప్రభుత్వం మొత్తం రూ.67 కోట్ల పరిహారం విడుదల చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. బ్యాంకు ఖాతాల సమస్యలు, ఇతర కారణాలతో మిగిలిన వారికి కూడా త్వరలో పరిహారం అందిస్తామన్నారు. ముంపు పునరావాస గ్రామాల్లో అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరినట్లు తెలిపారు. స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు పర్యాటక శాఖ ద్వారా సుమారు రూ.2 కోట్ల నిధులు తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న నీటి ట్యాంకుల నిర్మాణం తదితర సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ.. ముంపు బాధితులకు పరిహారం అందించేందుకు ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటోందన్నారు. పరిహారాన్ని సద్వినియోగం చేసుకుని జీవనోపాధిని మెరుగుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేష్, అధికారులు, ప్రజాప్రతినిధులు, ముంపు బాధితులు పాల్గొన్నారు.

## అత్యవసర మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి

మహబూబ్‌నగర్, ఆగస్టు 27 ( ప్రజా జ్యోతి బ్యూరో ):
దేవరకద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో (పీహెచ్‌సీ) ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్




నాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన దేవరకద్ర పీహెచ్‌సీని తనిఖీ చేసి వైద్య సేవలు, రోగులకు అందుతున్న సౌకర్యాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన రోగులతో అదనపు కలెక్టర్ నేరుగా మాట్లాడి మందుల లభ్యత, ల్యాబొరేటరీ సేవలు, చికిత్సా సదుపాయాలు, సిబ్బంది అందిస్తున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. వైద్య సేవలు పొందడంలో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీహెచ్‌సీలోని ల్యాబొరేటరీని పరిశీలించిన ఆయన రక్త పరీక్షలు, ఇతర ముఖ్యమైన నిర్ధారణ పరీక్షలకు అవసరమైన పరికరాలు, సౌకర్యాల లభ్యతను తనిఖీ చేశారు. ముఖ్యంగా పాముకాటు వంటి అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు తక్షణ వైద్యం అందించేందుకు అవసరమైన యాంటీ స్నేక్ వెనం మందుల నిల్వలను పరిశీలించారు. అత్యవసర సమయాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యాంటీ స్నేక్ వెనం మందులు తగినంత పరిమాణంలో ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన మందులు, వైద్య పరీక్షలు, చికిత్సా సదుపాయాలు నిరంతరం అందుబాటులో ఉండేలా అధికారులు, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.

# దళితుల సంక్షేమ గోడకూ వివక్ష' నీడనేనా..?!

- సమానత్వం కోసం రాజ్యాంగం బాట.. సంక్షేమ భవనాల నిర్మాణంలో మాత్రం నాణ్యతకు 'నో ఎంట్రీ'!
- నాసిరకం మెటీరియల్ ఆరోపణలపై అధికారుల మౌనం.. 'వెల్ఫేర్' అంటే ఇంతేనా..?- సమానత్వం కోసం రాజ్యాంగం బాట.. సంక్షేమ భవనాల నిర్మాణంలో మాత్రం నాణ్యతకు 'నో ఎంట్రీ'!
- నాసిరకం మెటీరియల్ ఆరోపణలపై అధికారుల మౌనం.. 'వెల్ఫేర్' అంటే ఇంతేనా..?



**దళితులపై వివక్ష చూపకూడదు. వారికి సమాన హక్కులు కల్పించాలి. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలను ముందుకు తీసుకురావాలి. ఇవన్నీ రాజ్యాంగం చెప్పిన మాటలు. ప్రభుత్వాలు చెప్పే మాటలు. పాలకులు ఇచ్చే హామీలు. కానీ... దళితుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన సంస్థకు చెందిన భూమిలో నిర్మించే గోడకే నాణ్యత విషయంలో అనుమానాలు తలెత్తితే..? అప్పుడు ప్రశ్న ఒక్కటే...వివక్షత సమాజంలోనే ఉందా? లేక అధికారుల ఫైళ్ల నుంచి నిర్మాణాల గోడల వరకు కూడా పాకిందా..? అనే అనుమానాలు తలెత్తుతాయి.**

మహబూబ్ నగర్
ఆగస్టు 27 ( ప్రజా జ్యోతి బ్యూరో ):
మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్ కాలనీలో ఎస్సీ వెల్ఫేర్ కార్పొరేషన్‌కు చెందిన భూమిలో నిర్మిస్తున్న ప్రహరీ గోడ పనులపై నాణ్యతకు సంబంధించి ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్మాణంలో ఫిల్టర్ ఇసుక, స్టోన్ డస్ట్



వంటి మెటీరియల్‌ను వినియోగిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

**ఆరోపణలు నిజమా? కాదా?:**

అని తేల్చాల్సింది అధికారులే కానీ తేల్చాల్సిన అధికారులు మౌనం వహిస్తే మాత్రం అనుమానాలకు రెక్కలు రావడం సహజం.

**'వెల్ఫేర్' కాబట్టి ఏదైనా చెల్లుతుందా..?**

ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు, సాంకేతిక తనిఖీలు, మెటీరియల్ టెస్టులు, కొలతలు అంటూ ఎన్నో నిబంధనలు ఉంటాయి. మరి ఎస్సీ వెల్ఫేర్‌కు సంబంధించిన నిర్మాణం విషయంలో కూడా అవే ప్రమాణాలు అమలు కావాలి కదా! లేకపోతే 'వెల్ఫేర్' అనే పేరుకే నాణ్యతా ప్రమాణాల్లో డిస్కౌంట్ ఏమైనా ఇస్తున్నారా..?

అని ప్రజల్లో తలెత్తుతున్న అనుమానం మాత్రం ఇదే.

దళితుల కోసం కట్టే గోడ బలంగా ఉండాలి. వారికి కేటాయించే భవనం నాణ్యంగా ఉండాలి. వారి సంక్షేమానికి ఖర్చు చేసే ప్రతి రూపాయి సక్రమంగా వినియోగించాలి.

ఇది దయ కాదు. ఇది హక్కు. వివక్ష ఇటుకల్లో కనిపించకూడదు సమాజంలో వివక్షతను రూపుమాపాలని ఒకవైపు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. మరోవైపు ప్రభుత్వ సంక్షేమ ఆస్తుల నిర్మాణంలో నాణ్యతపై అనుమానాలు తలెత్తే పరిస్థితులు వస్తే.. అది వ్యవస్థపై ప్రజలకు ప్రశ్నలు కలిగించకుండా ఉంటుందా? దళితుల కోసం కట్టే గోడకు కూడా అదే సిమెంట్.. అదే ఇసుక.. అదే నాణ్యత.. అదే ఇంజినీరింగ్ ప్రమాణాలు ఉండాలి.
'వాళ్ల కోసమే కదా..' అనే నిర్లక్ష్యపు ఒక్క ఆలోచన కూడా ఉంటే అది గోడలో కనిపించకపోయినా.. వ్యవస్థ మనస్తత్వంలో మాత్రం స్పష్టంగా కనిపిస్తుంది. అందుకే ఈ వ్యవహారాన్ని కేవలం 'ఒక ప్రహరీ గోడ నిర్మాణం'గా చూడకూడదు. ఇది సామాజిక బాధ్యతకు సంబంధించిన విషయం.

**అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?**

నిర్మాణ పనులు జరుగుతున్నప్పుడు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. మెటీరియల్ నాణ్యతను పరీక్షించాలి. పనులు అంచనాలు, సాంకేతిక నిబంధనల ప్రకారం జరుగుతున్నాయా లేదా చూడాలి. ఇవి జరగక పోతే ఒక రోజు గోడలో పగుళ్లు రావచ్చు. కానీ అంతకంటే ముందే... ప్రజల నమ్మకంలో పగుళ్లు వస్తాయి. అధికారులు ఈ చిన్న విషయాన్ని గుర్తించాలి. 'నాణ్యత'కు కూడా కులం ఉంటుందా..? అనేదే అసలు ప్రశ్న.
నాణ్యతకు కులం ఉండదు.



సిమెంట్‌కు కులం ఉండదు.
ఇసుకకు కులం ఉండదు.
ప్రభుత్వ నిధులకు కులం ఉండదు.
అయితే నిర్మాణం మాత్రం దళితుల సంక్షేమానికి సంబంధించినదని చెప్పి నాణ్యత విషయంలో రాజీ పడితే...
అది కేవలం నిర్మాణ లోపం కాదు.. సామాజిక బాధ్యతలో లోపం. అందుకే లక్ష్మీనగర్‌లో జరుగుతున్న ప్రహరీ గోడ నిర్మాణంపై వస్తున్న ఆరోపణలపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలి. ఉపయోగిస్తున్న ఇసుక, స్టోన్ డస్ట్, సిమెంట్ తదితర సామగ్రిని సాంకేతికంగా పరీక్షించాలి. పనుల అంచనా, టెండర్ నిబంధనలు, కొలతలు, నాణ్యతా పరీక్షల వివరాలను పరిశీలించాలి.

ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ఆరోపణలు నిరాధారమైతే... 'ఇదిగో మా నాణ్యత' అంటూ నివేదికతో ప్రజల ముందుకు రావాలి. గోడ కట్టేది ఇటుకలతో.. నమ్మకం కట్టేది నాణ్యతతో! దళితుల సంక్షేమం అంటే కేవలం ఫైళ్లలో పథకాలు, సభల్లో ప్రసంగాలు, ప్రకటనల్లో హామీలు కాదు. వారి కోసం నిర్మించే ప్రతి ఇటుకలో ప్రభుత్వ నిబద్ధత కనిపించాలి. సమాజంలో వివక్షతను నిర్మూలిస్తామని చెప్పే పాలన.. తన ఆధీనంలోని సంక్షేమ ఆస్తుల నిర్మాణంలో మాత్రం నిర్లక్ష్యానికి తావిస్తే అది చెప్పేదొకటి.. చేసేదొకటి అవుతుంది.
అందుకే ఇప్పుడు అవసరం మరో ప్రసంగం కాదు.
నాణ్యతపై స్పష్టమైన తనిఖీ.
ఆరోపణలపై సమగ్ర విచారణ.
తప్పు ఉంటే కఠిన చర్య. ఎందుకంటే...
దళితుల సంక్షేమం కోసం కట్టే గోడ బలహీనంగా ఉండకూడదు. అది కూలితే కేవలం ప్రహరీ గోడ మాత్రమే కూలదు.. 'సామాజిక న్యాయం' అనే ప్రభుత్వ నినాదంపై ప్రజల నమ్మకం కూడా కూలుతుంది!

## పాఠశాలల పర్యవేక్షణలో నిర్లక్ష్యం వద్దు

★ ఉపాధ్యాయుల పనితీరు మెరుగుపడకుంటే చర్యలు–విద్యార్థుల నమోదు పెంపుపై ప్రత్యేక దృష్టి

గద్వాల ఆగస్టు 27 ప్రజా జ్యోతి ప్రతినిధి):
విద్యాశాఖ అధికారులు తమ పరిధిలోని పాఠశాలలను తరచూ సందర్శిస్తూ విద్యా కార్యక్రమాలు సజావుగా జరిగేలా పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు.ఉపాధ్యాయుల పనితీరు రాబోయే రోజుల్లో గణనీయంగా మెరుగుపడాలని,లేకుంటే తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.జిల్లాలో విద్యాశాఖ పనితీరుపై గురువారం కలెక్టర్ తన ఛాంబర్ నుంచి అన్ని మండలాల ఎంఈఓలు,కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు,ఇతర అధికారులతో వెబ్ఎక్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.పదేపదే సమీక్షలు,సమావేశాలు నిర్వహిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు కనిపించడం లేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.ఎఫ్ఎల్ఎన్,ఏఎక్స్ఎల్ ఆన్‌బోర్డింగ్,విద్యార్థుల నమోదు, డ్రాప్‌బాక్స్ పెండింగ్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.జిల్లాలోని 87 ఎఫ్ఎల్ఎన్ కాంపొనెంట్ పాఠశాలల్లో విద్యార్థుల వారీగా అభ్యసన ఫలితాలను నమోదు చేసి నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.ఇటీవల నిర్వహించిన బేస్‌లైన్ అసెస్‌మెంట్ ఫలితాలను సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయుల సమావేశాల్లో చర్చించి, వెనుకబడిన విద్యార్థులను గుర్తించాలని తెలిపారు.ప్రతి విద్యార్థి ఏ సబ్జెక్టులో,ఏ సామర్థ్యంలో వెనుకబడి ఉన్నాడో గుర్తించి మూడు నెలల కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు.అవసరమైన విద్యార్థులకు రెమిడియల్,అదనపు తరగతులు నిర్వహించి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు.జిల్లాలో విద్యార్థుల నమోదు ఆశించిన స్థాయిలో లేదని కలెక్టర్ పేర్కొన్నారు.సుమారు 6 వేల మంది విద్యార్థులను ఇంకా పాఠశాలల్లో చేర్పించాల్సి ఉందని తెలిపారు.ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు మండల స్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి విద్యార్థుల నమోదును పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఎంఈఓలు,కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల పాఠశాల సందర్శనలు,క్షేత్రస్థాయి పర్యవేక్షణ తక్కువగా ఉండటంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.ప్రతి మండలంలో పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించి విద్యార్థుల అభ్యసన స్థాయి,ఎఫ్ఎల్ఎన్ నమోదు,హాజరు తదితర అంశాలను పరిశీలించాలని సూచించారు.ఉపాధ్యాయుల పేరు,హోదా, బోధిస్తున్న సబ్జెక్టు,విద్యార్హతలు,బీఈడీ,డీఈడీ వంటి వృత్తిపరమైన అర్హతలు,అదనపు డిగ్రీలు,ప్రత్యేక శిక్షణలు,ఇతర నైపుణ్యాల వివరాలను సేకరించాలని తెలిపారు. పాఠశాలల వారీగా ఉన్న ఉపాధ్యాయుల సంఖ్య,గూగుల్ ఫారంలో నమోదైన వివరాల సంఖ్య సరిపోలేలా చూసి ఏ ఒక్క ఉపాధ్యాయుడి వివరాలు మిస్ కాకుండా డేటాను సిద్ధం చేయాలని ఆదేశించారు.పూర్తయిన యూనిఫాంలను ఆగస్టు 31లోగా విద్యార్థులందరికీ అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు.మిగిలిన యూనిఫాంలను కూడా త్వరగా అందుబాటులోకి తీసుకువచ్చి పంపిణీ పూర్తి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు,డీఈఓ విజయలక్ష్మి , సెక్టోరియల్ అధికారులు ప్రసాద్, మైఖేల్, క ్రెప ్ర, ఎ ంఈ ఓ లు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు,సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.



## విపత్తుల సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

విపత్తు నిర్వహణకు పక్కా ప్రణాళిక అవసరం

గద్వాల ఆగస్టు 27(ప్రజా జ్యోతి ప్రతినిధి):
వరదలు,అగ్ని ప్రమాదాలు తదితర విపత్తులు సంభవించినప్పుడు అధికారులు అప్రమత్తంగా ఉండేందుకు ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు.గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా డిజాస్టర్ మేనేజ్‌మెంట్ యాక్షన్



ప్లాన్‌పై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,బీచుపల్లి,అలంపూర్,నది అగ్రహారం తదితర నదీ పరివాహక ప్రాంతాల్లో అత్యవసర సమయాల్లో రక్షణ చర్యలు చేపట్టేందుకు పక్కా ప్రణాళిక రూపొందించుకోవాలని అన్నారు.ముఖ్యంగా నదుల్లో ప్రమాదవశాత్తు ఎవరైనా మునిగిపోతే వెంటనే రక్షించేలా గజ ఈతగాళ్లు,మత్స్యకారులకు బోట్లు,లైఫ్ జాకెట్లు, తాళ్లు తదితర రక్షణ పరికరాలను అందుబాటులో ఉంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.ఎవరైనా వ్యక్తులు గల్లంతైన సందర్భాల్లో గాలింపు చర్యలు చేపట్టేందుకు,ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించేందుకు డ్రోన్ కెమెరాలు వంటి పరికరాలను కొనుగోలు చేయాలని తెలిపారు.గద్వాల,అలంపూర్ అగ్నిమాపక కేంద్రాల్లో ఫ్లోటింగ్ పోర్టబుల్ పంప్స్,రిమోట్ లైఫ్ బాయ్ తదితర రెస్క్యూ పరికరాలను అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లు,మున్సిపాలిటీలు ,గ్రామపంచాయతీలతో పాటు కలెక్టరేట్‌లోనూ ఫైర్ సేఫ్టీకి అవసరమైన పరికరాలను సమకూర్చుకునేందుకు ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు,డీపీఓ శ్రీకాంత్,అగ్నిమాపక కేంద్రం ఎస్ఐ రాకేష్,డి–సెక్షన్ పర్యవేక్షకులు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటోఇటో డ్రైవర్ల బతుకులు...

**కాటారం, ఆగస్టు 27, ప్రజా జ్యోతి :** ఉదయాన్నే స్టీరింగ్ పట్టి, లీటర్ పెట్రోల్, డీజిల్ పోయించి సాయంత్రానికి నాలుగు పైసలు ఇంటికి తీసుకెళ్లే ఆటోడ్రైవర్ల బతుకులు నేడు ప్రశ్నార్థకంగా మారాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో వారికి ఎదురవుతున్న సవాళ్లు కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయి.

తాము అధికారంలోకి వస్తే ఆటోడ్రై వర్లకు ఏటా రూ.12 వేలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ వారికి మొండిచేయి చూపించింది. ఇదేగాక మహిళలకు ఉచిత బస్సు పథకం పెట్టడంతో ఆ ప్రభావం ఆటోల మీద పడి వారి జీవనం దుర్భరంగా మారి రోజంతా కష్టపడినా కనీసం కుటుంబాన్ని పోషించుకో లేని స్థితిలో బతుకీడుస్తున్నారు.

------------------



పేట బక్కయ్య, ఆటో యూనియన్ మండల అధ్యక్షుడు, కాటారం

**సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి..**
**- పేట బక్కయ్య, కాటారం, ఆటో యూనియన్ మండలాధ్యక్షుడు...**

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి. ఉచిత బస్సు వల్ల నష్ట పోయిన ఆటో కార్మికులకు ప్రత్యేక జీవనభృతి అందించాలి. నెలకు రూ.3 వేల భత్యం లేదా సంవత్సరానికి రూ.12 వేలు ఆర్థిక సాయం అందించాలి. ఆటో కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే భరోసా కల్పించాలి.

----------------

కాటారం మండల వ్యాప్తంగా సుమారు 399 మందికి పైగా ఆటో కార్మికులు తమ జీవనోపాధి కోసం ఆటోలపైనే ఆధార పడి జీవిస్తున్నారు. కుటుంబాల పోషణ, పిల్లల చదువులు, ఇంటి అద్దెలు అన్ని ఈ మూడంచెల బండి నడిస్తేనే గడిచే పరిస్థితి. ఆటో కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలని కాటారం అడ్డలో ఉన్న డ్రైవర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

---------------------

ప్రకటనలకే పరిమితమైన రూ.12 వేల సాయం

కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఎన్నికల మేని ఫెస్టోలో ఆటో, టాక్సీడ్రైవర్లకు ఏటా రూ.12 వేలు ఆర్థిక సహాయం అందిస్తా మని ప్రకటించింది. అయితే, అధికారంలోకి వచ్చి సంవత్సరాల సమయం గడు స్తున్నా ఈ పథకం అమలుకు స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల కాకపోవడం, ఖాతాల్లో డబ్బులు జమ కాకపోవడంతో కార్మికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు

--------------------------

దెబ్బ తీసిన ఉచిత బస్సు..

కాంగ్రెస్ ప్రభుత్వం మహిళ లకు ఉచిత బస్సు ప్రయాణం పథకం ప్రవేశపెట్టిన తర్వాత ఆటో కార్మికుల ఆదాయం సగా నికి పైగా పడిపోయింది. గతంలో కొంత దూరానికి వెళ్లాలంటే ఆటోలను ఆశ్రయించే మహిళ ప్రయాణికులు ప్రస్తుతం ఆర్టీసీ బస్సులకే ప్రాధాన్యమిస్తున్నారు. దీనివల్ల నిత్యం రూ.700 నుంచి రూ.1,000 వరకు వచ్చే పైసలు ప్రస్తుతం డీజిల్, పెట్రోల్ ఖర్చులు పోను రూ.200, రూ.300కి పడిపోయిందని కార్మికులు ఆవేదన చెందుతున్నారు.

-------------------------

ఫైనాన్స్ భారంతో ఆటోడ్రైవర్లు ఉక్కిరిబిక్కిరి

చాలామంది ఆటోడ్రైవర్లు ప్రైవేట్ ఫైనాన్షియర్లు, బ్యాంకుల ద్వారా రూ.2 లక్షల నుంచి రూ.3.5 లక్షల వరకు లోన్లు తీసుకుని ఆటోలు కొనుగోలు చేశారు. రోజు వారీ ఆదాయం పడిపోవడంతో ప్రతి నెలా ఈఎంఐ చెల్లించలేకపోతున్నారు. ఫైనాన్స్ ఏజెంట్ల వేధింపులు, ఫెనాల్టీల భయంతో అనేకమంది తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.

-------------------------



పిల్లమరి నానయ్య, ఆటో డ్రైవర్, కాటారం

**కుటుంబ పోషణ భారమైంది..**
**-పిల్లమరి నానయ్య, ఆటోడ్రైవర్, కాటారం**

మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం వల్ల ఆటో రంగం తీవ్రంగా దెబ్బతిన్నది. ఆటో ఎక్కే వారి సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. కుటుంబ పోషణ భారంగా మారింది. ఒకవైపు ఆదాయం లేక, మరోవైపు నెలవారీ వాయిదాలు చెల్లించలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రకారం ఆర్థిక సహాయాన్ని అందించి ఆటోడ్రైవర్లను ఆదుకోవాలి.

-------------------------



లంబు జీవన్ రెడ్డి, ఆటో డ్రైవర్, కాటారం

**కాంగ్రెస్ పార్టీ మాట తప్పింది..**
**- లంబు జీవన్ రెడ్డి, ఆటోడ్రైవర్, కాటారం**

ఆటో డ్రైవర్లకు రూ.12 వేలు ఇస్తానని చెప్పి కాంగ్రెస్ పార్టీ మాట తప్పింది. ఉచిత బస్సు ప్రయాణాల వల్ల ఆటోడ్రైవర్ల ఆదాయం పడిపోయింది. కనీసం వాహనాల ఈఎంఐలు, డీజిల్ ఖర్చులు కూడా వెల్లదీయలేని పరిస్థితి. నిత్యావసరాలు తీరక, పిల్లల స్కూల్ ఫీజులు కట్టలేక కుటుంబాల్లో గొడవలు జరుగుతున్నాయి.

## బీజేపీలో చేరిన యువ అడ్వకేట్ కూనమల్ల మధుసూదన్..



**పరకాల ఆగస్టు 27 (ప్రజాజ్యోతి) :** పరకాల నియోజకవర్గం 15వ డివిజన్ మొగిలిచర్ల గ్రామానికి చెందిన యువ అడ్వకేట్ కూనమల్ల మధుసూదన్ భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పరకాల నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డా. పగడాల కాళీ ప్రసాద్ రావు ఆధ్వర్యంలో మధుసూదన్ బీజేపీ కండువా కప్పుకుని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. యువత రాజకీయాల్లో చురుగ్గా పాల్గొని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ బిల్లా రమేష్, మాజీ ఓబీసీ మోర్చా కార్యదర్శి ఆడేపు రమేష్, బీజేవైఎం నాయకులు అప్పాని సాగర్, రవి వర్మ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్షయ నివారణ కేంద్రాన్ని సందర్శించిన ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత..



**హనుమకొండ జిల్లా ప్రతినిధి ఆగస్టు 27 (ప్రజాజ్యోతి) :** హనుమకొండ జిల్లా ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ టీ. రోహిత్ నేత గురువారం కాకతీయ మెడికల్ కాలేజీ (కేఎంసీ)లోని క్షయ నివారణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి టీబీ నివారణ అధికారి డా. ప్రదీప్ రెడ్డి కేంద్రంలో నిర్వహిస్తున్న ట్రునాట్ ల్యాబ్, ఓపీ సేవలు, కల్చర్ ల్యాబ్ నిర్వహణ తదితర అంశాలను రోహిత్ నేతకు వివరించారు. క్షయ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న స్క్రీనింగ్ పరీక్షలు, వ్యాధి నిర్ధారణ, చికిత్స విధానంపై కూడా అవగాహన కల్పించారు. టీబీ నియంత్రణ కార్యక్రమం అమలు తీరు, రోగులకు అందుతున్న వైద్య సేవలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీబీ స్టాఫ్, కల్చర్ ల్యాబ్ సిబ్బంది పాల్గొన్నారు.

# మలిదశ ఉద్యమ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి సేవలు చిరస్మరణీయం



**నర్సంపేట, ఆగస్టు 27 (ప్రజా జ్యోతి) :** నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధిలో పెద్ది సుదర్శన్ రెడ్డి పాత్ర,మరువలేనిది. రాజకీయాలకు అతీతంగా ప్రజాసేవ చేసిన గొప్ప మానవతావాది పెద్ది సుదర్శన్ రెడ్డి సంతాప సభలో పెద్ది సేవలను స్మరించుకున్న పలువురు వక్తలు.తెలంగాణ ఉద్యమకారుడు మాజీ శాసనసభ్యులు దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డి సంతాప సభ బిఆర్ఎస్ నర్సంపేట పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సిటిజన్ క్లబ్ లో పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా బిఆర్ఎస్ పట్టణ పార్టీ నాయకులు,వివిధ రాజకీయ పార్టీలు,ప్రజా,సంఘాలు,వ్యాపార, వాణిజ్య,వర్తక,కార్మిక విద్యార్థి మహిళా సంఘాలు,ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ ప్రతినిధులు మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గం ప్రజల అభివృద్ధి కోసం పెద్ది సుదర్శన్ రెడ్డి అందించిన సేవలను స్మరించుకున్నారు.

పేద ప్రజల కోసం విద్యా,వైద్య కోసం జిల్లా ఆస్పత్రిని మెడికల్ కళాశాలను పల్లె దావకానలను,సైనిక పాఠశాల,డిగ్రీ కళాశాల,నర్సింగ్ కళాశాల,సంక్షేమ గురుకులాలు నెలకొల్పి నియోజకవర్గ అభివృద్ధికి పాల్పడ్డారు.వ్యవసారంగ అభివృద్ధి రైతుల కోసం శాశ్వత ప్రాజెక్టులు రామప్ప,రంగాయి,పాకాల చెరువులు తో శాశ్వత నీటి పరిష్కారాన్ని అందించి నర్సంపేట ను సాగునీటి రంగంలో సస్యశ్యామలంగా చేశాడని,కొనియాడారు.రాజకీయ కక్షలు లేకుండా నర్సంపేట నియోజకవర్గంలో శాంతిభద్రతలను కాపాడారు...

ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర రైతు డైరెక్టర్ రాయిడి రవీందర్ రెడ్డి,బిఆర్ఎస్ డివిజన్ కోఆర్డినేటర్ తక్కలపెల్లి రవీందర్రావు,మాజీ ఎంపీపీ నల్ల మనోహర్ రెడ్డి,బిఆర్ఎస్ డివిజన్ నాయకులు డా.లెక్కల విద్యా సాగర్ రెడ్డి,మండల పార్టీ మాజీ అధ్యక్షులు నామాల సత్యనారాయణ బిఆర్టియు జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, మాజీ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ డైరెక్టర్ నాడెం శాంతి కుమార్ పట్టణ కార్యదర్శి వేణుముద్దల శ్రీధర్ రెడ్డి,పట్టణ నాయకులు నాగిశెట్టి ప్రసాదు మండల శ్రీను,దోమ్మటి సంతోష్,బుస రాజు నవీన్ నాయక్ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు వాసం కరుణ,యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు రాయిడి దుశాంత్ రెడ్డి,సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల రమేష్ జనసేన డివిజన్ ఇంచార్జి మెరుగు శివకోటి తెలంగాణ రక్షణ సేన డివిజన్ బాధ్యులు తడిగొప్పుల మల్లేశం,ఎల్ హెచ్ పి ఎస్ జాతీయ నాయకులు వాసు నాయక్,బీసీ సంఘాల నాయకులు సోల్తి సారయ్య కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడు దాసరి నర్సింహారెడ్డి, ఐరన్ అండ్ హార్డ్వేర్ అసోసియేషన్ నాయకులు రాపర్తి అమర్నాథ్,అయ్యప్ప స్వామి దేవాలయ అధ్యక్షుడు సైఫా సురేష్,ఆర్తి అసోసియేషన్ అధ్యక్షుడు కాసరబాధ రవి,రజక సంఘం పట్టణ అధ్యక్షుడు కొల్లారి లక్ష్మీనారాయణ మేదర సంఘం డివిజన్ అధ్యక్షుడు షేర్ల శ్రీనివాస్, సీనియర్ సిటిజన్స్ వడ్లకొండ సాంబయ్య,మాజీ ఎంపిపి కళావతి పార్టీ కౌన్సిలర్లు మాజీ కౌన్సిలర్లు వార్డు బాధ్యులు క్లస్టర్ బాధ్యులు మహిళా సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా సర్ ఓటర్ జాబితా సవరణ ప్రక్రియ

**18వ వార్డు మాజీ కౌన్సిలర్ దేవోజు తిరుమల సదానంద**



**నర్సంపేట ఆగస్టు 27 (ప్రజా జ్యోతి) :** ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశానుసారం పారదర్శకంగా సార్ ఓటర్ జాబితా సవరణ ప్రక్రియ కే పారదర్శకంగా ఓటర్ జ18వ వార్డు మాజీ కౌన్సిలర్ దేవోజు తిరుమల సదానందం లిగత కొద్ది రోజుల క్రితం రాష్ట్రవ్యాప్తంగా జరిగిన సార్ నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో సార్ ప్రక్రియ ముగిసినందున.. వార్డు సభలో ఓటర్ జాబితాను ప్రజల ముందు చదివి వినిపించి వారి నుండి ఎలాంటి అభ్యంతరలను ఉన్నా తెలియజే యవలసిందిగా కోరడం జరిగింది.ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ దేవోజు తిరుమల సదానందం మాట్లాడుతూ నర్సంపేట అభివృద్ధి ప్రదాత, శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి ఆదేశానుసారం 18వ వార్డు లో ఓటర్ సవరణ ప్రక్రియ కార్యక్రమాన్ని పార్టీలకు అతీతంగా పకడ్బందీగా నిర్వహించడం జరిగింది అని అన్నారు. ఈ సవరణ కార్యక్రమంలో జీపీవో బిఎల్ఓ లు,కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏలతో ప్రతి ఇంటింటికి తిరిగి.. ఓటర్ ఫారం వారికి అందజేసి..ప్రతి యొక్క ఓటును పోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందని.ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి కేవలం మరణించిన వారి ఓట్లు డబుల్ ఓట్లు,షిఫటెడ్ ఓట్లు మాత్రమే తొలగించడం జరిగిందని అన్నారు.వార్డు సభలో ఓటర్ జాబితా ప్రచురించడం జరిగిందని. ఎలాంటి అభ్యంతరాలు రాలేదని తెలిపారు.18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఫారం 6 ద్వారా కొత్త ఓటు నమోదు చేసుకోవచ్చని అన్నారు. 18వ వార్డులో జరిగిన ఓటర్ సవరణ కార్యక్రమాన్ని దగ్గరుండి నడిపించిన జీపీవో యాకాంబరం బిఎల్ ఓ లు కొండి సునీత, రమాదేవి, కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏ లు బిట్ల మనోహర్, బత్తుల శివకృష్ణ గార్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారఓ.ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ డైరెక్టర్ లక్కర్స్ రమేష్, వార్డు అధ్యక్షులు బిట్ల మనోహర్, వార్డు ప్రధాన కార్యదర్శి దేవోజు హేమంత్, వార్డు ఉపాధ్యక్షులు నకినబోయిన మహేష్, యూత్ అధ్యక్షులు బత్తుల శివకృష్ణ, యూత్ నాయకులు బొల్ల నవీన్, వరికెల నాగరాజు, వార్డు ముఖ్యులు కుందూరు వెంకటరెడ్డి, గోపాల నరేందర్, పొగాకు, సాంబయ్య, మొగిలిచర్ల సాంబయ్య,ఆసం నాగన్న, చిలుముల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఓటర్ల జాబితా ఎస్ఐఆర్ సవరణ ప్రక్రియ







**- కొత్తూరులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ**
**- గ్రామ సర్పంచ్ కందికట్ల స్వప్న సంతోష్**

**రాయపర్తి ఆగస్టు 27 ప్రజా జ్యోతి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కొత్తూరు గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణంలో గురువారం ఎస్ఐఆర్‌బి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం కోసం స్వప్న- సంతోష్ కందికట్ల గ్రామ సర్పంచ్ కొత్తూరు అధ్యక్షతన గురువారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ 20 సంవత్సరాలకు ఒకసారి జరిగే ఎస్ ఐ ఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-2026) వన్ నేషన్ - వన్ ఓటు ఉండాలని సెంట్రల్ ఎలక్షన్ కమిషన్ ఈ ప్రక్రియ ను ప్రారంభించింది. దానిలో భాగంగా గ్రామంలో ఉన్న పూర్తి ఓటర్ జాబితాను చదివి వివరించడం జరిగింది. అందులో గ్రామంలో ఉన్న ఓటర్ జాబితా వివరములను చదివి వినిపించనైనది . అదేవిధంగా తొలగింపుల జాబితా అనగా మరణించిన, గ్రామంలో లేనివారు మరియు డబుల్ ఓటర్ల వివరములు గ్రామసభలో వివరించడం జరిగింది.ఓటర్ జాబితా నుండి ఎవరిదైనా పేరు తప్పిపోయి ఉంటే మళ్ళీ దరఖాస్తు కు అవకాశం ఉందని తెలియజేయడం జరిగింది. గ్రామంలో ఉన్న 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు నూతన ఓటుకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా తెలియజేయడం జరిగింది. అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వన్ నేషన్ - వన్ రేషన్ నూతన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ ప్రారంభించడం జరిగింది. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి ఎండి అస్మ గ్రామ జిపిఓ లు వీరేశం, విజేందర్ గ్రామ బి ఎల్ వోలు కందికట్ల సురేష్ కందికట్ల అమలాదేవిబూత్ నంబర్ 177 (బిఎల్ ఎచిర్రనాగరాజు వార్డు సభ్యులుభీమని అపర్ణ కృష్ణ నేలవల్లి సుబ్బారావు కొత్తూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అప్పడి నరసింహారావు గ్రామ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు తానికొండ రంగారావు గ్రామ కాంగ్రెస్ పార్టీ,కార్యదర్శులు. నాలం రవి జంపాల సురేష్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చెరుకూరి నాగేశ్వరరావు అంబటి కుమార్ మహిళా నాయకురాలు చెరుకూరి భద్రేశ్వరి మాద సరిత గుడ్ల యాకలక్ష్మి సోషల్ మీడియా ఇన్చార్జ్ గాదే రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారూ.

# భూభారతి, 22-ఏ, సమగ్ర రీ-సర్వేపై రెవెన్యూ కార్యదర్శి సమీక్ష..





**హనుమకొండ జిల్లా ప్రతినిధి ఆగస్టు 27 (ప్రజాజ్యోతి) :** రాష్ట్రంలోని భూభారతి, 22-ఏ, సమగ్ర రీ-సర్వేకు సంబంధించిన అంశాలపై రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్ గురువారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రెవెన్యూ కార్యదర్శి మాట్లాడుతూ.. భూభారతి డేటా ఆధారంగా 22-ఏ పరిధిలో ఎక్కడైనా భూమి విస్తీర్ణంలో తేడాలు గుర్తిస్తే వాటిని భూభారతి పోర్టల్‌లోనే పరిష్కరించాలని సూచించారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూములు 22-ఏ కింద నమోదై ఉన్న అంశాలను గుర్తించి, నిర్ణీత ప్రొఫార్మాలో తహసీల్దార్ల నుంచి వివరాలు సేకరించి నివేదిక సమర్పించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈ ప్రక్రియ కోసం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) అమలు చేయాలని సూచించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో (ఎస్ఆర్ఓ) అందుతున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

అదేవిధంగా ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఆ గ్రామంలో సమగ్ర భూ రీ-సర్వే నిర్వహించాలని సూచించారు. ఈ రీ-సర్వే ద్వారా వచ్చే సత్ఫలితాల ఆధారంగా దశలవారీగా అన్ని గ్రామాల్లో సమగ్ర రీ-సర్వే చేపట్టాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రవి తదితర అధికారులు పాల్గొన్నారు.

## కొత్తూరు ఎంపీపీ ఎస్ పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ

**సర్పంచ్ కందికట్ల స్వప్న సంతోష్**




**రాయపర్తి ఆగస్టు 27 ప్రజా జ్యోతి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం ఎం పీ పీ ఎస్ కొత్తూరు ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఏకరూప దుస్తుల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ స్వప్న - సంతోష్ కందికట్ల మరియు మండల విద్యాధికారి వెన్నంపల్లి శ్రీనివాస్ రాయపర్తి ఇంచార్జ్ ఏపిఎం యాదగిరి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిల్లా రాజేంద్రప్రసాద్ కొత్తూరు గ్రామపంచాయతీ సెక్రటరీ ఎండి అస్మా, ఏఐపిసి చైర్మన్ కొల్లా కల్పన వార్డ్ మెంబర్లు తాటికాయల నాగరాణి భాస్కర్ దొమ్మటి లలిత, భీమని అపర్ణ మహిళా సంఘాల లీడర్లు కొత్తూరు కాంప్లెక్స్ సిఆర్‌పి.రాజు సీఏవో యాకలక్ష్మి, స్వప్న, మహిళా సంఘం అధ్యక్షురాలు భద్రేశ్వరి, స్వప్న విద్యార్థులు ఉపాధ్యాయ బృందం గ్రామ పెద్దలు పాల్గొనడం జరిగింది.

## సేవా యోధులకు రాఖీలతో సత్కారం..

**ఆదర్శ హైస్కూల్‌లో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు**



**కాటారం, ఆగస్టు 27, ప్రజా జ్యోతి :** సమాజాన్ని కాపాడే ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులేననే సందేశంతో ఆదర్శ హైస్కూల్ విద్యార్థులు వినూత్నంగా రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. సమాజ రక్షణ, ఆరోగ్యం, పరిశుభ్రత, రవాణా, విద్యుత్ సరఫరా, వ్యవసాయం తదితర రంగాల్లో నిరంతరం సేవలందిస్తున్న సేవా యోధులకు విద్యార్థులు రాఖీలు కట్టి ఘనంగా సత్కరించారు. కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, ఎస్సైలు శ్రీనివాస్, మహేష్, వైద్యుడు తిరుపతిరెడ్డి, వైద్య సిబ్బంది, విద్యుత్ శాఖ సిబ్బంది, ఆర్టీసీ డ్రైవర్లు, రైతులు, పారిశుధ్య కార్మికులను కలిసి విద్యార్థులు స్వయంగా తయారు చేసిన రాఖీలు కట్టి , గ్రీటింగ్ కార్డులను ఇచ్చి తమ కృతజ్ఞతను చాటుకున్నారు. 'మా రక్షకులకు సలాం', 'లైఫ్ గార్డియన్స్', 'శానిటేషన్ సోల్జర్స్' వంటి సందేశాలతో రూపొందించిన రాఖీలు, కృతజ్ఞతా సందేశ కార్డులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కరుణాకర్ రావు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే కృతజ్ఞత, సేవాభావం, మానవతా విలువలు, సామాజిక బాధ్యతను పెంపొందించడమే కార్యక్రమ లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జనగామ కార్తీక్ రావు, ప్రిన్సిపాల్ కృషిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు..



**పరకాల ఆగస్టు 27 ప్రజాజ్యోతి :** రక్షాబంధన్‌ను పురస్కరించుకుని ఎస్ఎఫ్ఐ పరకాల పట్టణ, మండల కమిటీల ఆధ్వర్యంలో ముందస్తు రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్, పట్టణ అధ్యక్షుడు బొజ్జ హేమంత్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎస్ఆర్ హైస్కూల్, శారద హైస్కూల్, సాహితి జూనియర్ కళాశాలలో విద్యార్థులతో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ.. రక్షాబంధన్ అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీక అని అన్నారు. ఆడపడుచుల దీవెనలు అన్నదమ్ములపై ఎల్లప్పుడూ ఉండాలని, అన్నదమ్ములు తమ ఆడపడుచులకు ఎల్లప్పుడూ తోడుగా, నీడగా నిలవాలని ఆకాంక్షించారు. "అన్నయ్య చెల్లెమ్మకు రక్ష.. చెల్లెమ్మ అన్నయ్యకు రక్ష.. వారిద్దరూ ఈ దేశానికి రక్ష" అని విద్యార్థులను ఉద్దేశించి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎం.డి. అఫ్రోజ్, మండల ఉపాధ్యక్షులు రాహుల్, యశ్వంత్, రామ్ చరణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## అంత్యక్రియల్లో పాల్గొన్న మల్లేశం గౌడ్..



**పరకాల ఆగస్టు 27 (ప్రజాజ్యోతి) :** పరకాల మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిలువేరు సాంబయ్య అనారోగ్యంతో మృతి చెందగా, విషయం తెలుసుకున్న పరకాల నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆముదాలపెల్లి మల్లేశం గౌడ్ ఈ సందర్భంగా సాంబయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. కుటుంబానికి తనవంతు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో దండ్రె శంకర్, మంగళపల్లి శంకర్, చిలువేరు నరేష్, చెల్పూర్ భాస్కర్, మంగళపల్లి సాంబయ్య, మంగళపల్లి రాజు, మంగళపల్లి కమలమ్మ, లచ్చుమ్మతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్

దేవరకొండ, ఆగస్టు 27,( ప్రజా జ్యోతి ) :
బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కడారి అంజయ్య యాదవ్ కుమారుడు సాయిరామ్ యాదవ్ – మౌనికల వివాహ వేడుక హైదరాబాద్‌లోని శ్రీ మంత్ర కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ శుభకార్యానికి దేవరకొండ మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ



నియోజకవర్గ ఇంచార్జి రమావత్ రవీంద్ర కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కళ్యాణ వేదికపై నూతన వధూవరులను రమావత్ రవీంద్ర కుమార్ దుశ్శాలువాతో సత్కరించి, పూలమాలలు వేసి ఆశీర్వదించారు. కొత్త దంపతులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో కలకాలం వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం కడారి అంజయ్య యాదవ్ కుటుంబ సభ్యులకు వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ వివాహ మహోత్సవంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి, తోటకూరి పరమేష్, సర్పంచులు రైనబోయిన శ్రీను, కావటి వెంకటేష్, పంది హరికృష్ణ, షేక్ ఇస్మాయిల్, శ్రీమర్ల శ్రీనులతో పాటు పలువురు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని వధూవరులను దీవించారు.

## గుడిపల్లిలో వనమహోత్సవం మొక్కలు నాటిన సర్పంచ్ కున్‌రెడ్డి రాజశేఖర్ రెడ్డి

దేవరకొండ, ఆగస్టు 27(ప్రజాజ్యోతి):
గుడిపల్లి మండల కేంద్రంలో వనమహోత్సవం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కున్‌రెడ్డి రాజశేఖర్ రెడ్డి స్వయంగా మొక్క నాటి ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో కాలుష్యాన్ని కట్టడి చేస్తూ మన గ్రామాన్ని హరితమయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు మొక్కలు నాటి భవిష్యత్తును కాపాడుదాం అనే నినాదంతో ప్రభుత్వం పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని సర్పంచ్ తెలిపారు.ప్రజల సహకారంతో



గ్రామంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం కోసం అటవీశాఖ, గ్రామ పంచాయతీ సిబ్బందితో పాటు గుడిపల్లి ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ అరవపల్లి శ్రీనయ్య, వార్డు సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్ భూతం అనిత, వి.బి.జి రాంజీ, ఉపాధి హామీ కూలీలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు.

## శ్యామ్ సుందర్ జన్మదినంన అన్నదానం

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 27 (ప్రజాజ్యోతి):
బీజేపీ యాదాద్రి భువనగిరి జిల్లా మాజీ అధ్యక్షుడు పి.వి శ్యామ్ సుందర్ జన్మదినం సందర్భంగా భూదాన్ పోచంపల్లి బిజెపి నాయకులు అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ఆలేటి



ఆశ్రమంలో మానసిక రోగులు, వికలాంగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ పెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహించి శ్యామ్ సుందర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.
సేవా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని ఆశ్రమ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు చింతల రామకృష్ణ, కేసారం కృష్ణారెడ్డి, మేకల చొక్కారెడ్డి, పల్లెక్కడి బస్వయ్య, సీత లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డీఓ ని కలిసిన బి ఎన్ తిమ్మాపురం సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి

భువనగిరి రూరల్ ఆగస్ట్ 27(ప్రజాజ్యోతి):
బి ఎన్ తిమ్మాపురం సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో భువనగిరి మండలం బిఎన్ తిమ్మాపూర్ గ్రామస్తులు ఆర్డీవో ని కలిసి ఇటీవలే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశంతో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో ప్రభుత్వం విడుదల చేసిన ఆర్ అండ్ ఆర్ నిధులు త్వరగా నిర్వాసి తుల ఖాతాలో జమ చేయాలని పలు సమస్యలపై కి వినతి పత్రాన్ని అందజే యడం జరిగింది మా గ్రామంలో ఉన్న నిర్వాసి తులందరూ,అన్ని రకాలుగా పూర్తిగా నష్టపోతున్నందున గ్రామంలోని 114 సర్వేలో సమస్యాత్మకంగా ఉన్న ఇండ్లు మరియు ఓపెన్ ప్లాట్లు అన్నింటికీ,నష్టపరిహారం చెల్లించాలని కోరడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో స్పందిస్తూ కలెక్టర్ తో చర్చించి ముంపు గ్రామంలో ఉన్న అన్ని ఇండ్ల నష్ట పరిహారాలను త్వరలో అందజేస్తామని హామీ ఇచ్చారని సర్పంచ్ తెలిపారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సింగిల్ విండో డైరెక్టర్ వార్డు సభ్యులు మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు మాజీ వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.




# గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

### పల్లెల్లో మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

### గుర్రం తండలో రూ.72 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

చివ్వెంల ఆగస్టు 27 (ప్రజాజ్యోతి):
గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఏఐసీసీ



సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు.పల్లెల్లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించి,గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.చివ్వెంల మండలం గుర్రం తండలో శుక్రవారం చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సర్వోత్తమ్ రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దారావత్ వీరన్న నాయక్,సర్పంచ్ ధరావత్ వినోద్ నాయక్తో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా రూ.20 లక్షల వ్యయంతో గ్రామపంచాయతీ భవనం,రూ.12 లక్షలతో అంగన్‌వాడీ కేంద్ర భవనం,రూ.30 లక్షలతో ఫుడ్ స్టోరేజ్ భవనం,రూ.10 లక్షలతో సంఘ భవనం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మొత్తం రూ.72 లక్షల విలువైన అభివృద్ధి పనులు గుర్రం తండలో చేపడుతున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ, దివంగత నాయకులు రాంరెడ్డి దామోదర్ రెడ్డి ఆశయాలు, అభివృద్ధి–సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు తాను ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు.స్వర్గీయ ఇందిరాగాంధీ నుంచి దామోదర్ రెడ్డి వరకు కాంగ్రెస్ పార్టీ గిరిజనులు,లంబాడీల అభివృద్ధికి ఎనలేని కృషి చేసిందని పేర్కొన్నారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తండాలు ఆశించిన స్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో సూర్యాపేట నియోజకవర్గంలోని ప్రతి తండాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.గత పాలకులు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలకు హామీలు ఇచ్చినా, పేదలకు ఆశించిన స్థాయిలో ఇళ్లు అందలేదని అన్నారు. దివంగత నాయకులు రాంరెడ్డి దామోదర్ రెడ్డి సహకారంతో తొలి విడతలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు



మంజూరు చేయించామని, ప్రస్తుతం అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం.కాంగ్రెస్ పార్టీ బడుగు,బలహీన వర్గాల పార్టీ గుర్రం తండ అంటేనే కాంగ్రెస్.కాంగ్రెస్ అంటేనే గుర్రం తండ" అని సర్వోత్తమ్ రెడ్డి అన్నారు.గ్రామపంచాయతీ భవనాలు కేవలం పరిపాలనా కేంద్రాలుగా కాకుండా గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభంగా అందించే కేంద్రాలుగా ఉండాలని ఆయన అన్నారు.గ్రామాల్లో రహదారులు,డ్రైనేజీ, తాగునీరు,విద్యుత్,పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల సంక్షేమం,అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని, ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.గ్రామం అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, పల్లెల్లో ప్రతి కుటుంబానికి మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు.గుర్రం తండలో చేపడుతున్న గ్రామపంచాయతీ భవనం,అంగన్‌వాడీ కేంద్రం,ఫుడ్ స్టోరేజ్ భవనం,సంఘ భవనం నిర్మాణాలు పూర్తయితే ప్రజలకు పరిపాలనా సేవలు మరింత చేరువ అవుతాయని, గ్రామ అభివృద్ధికి ఇవి కీలక ముందడుగులుగా నిలుస్తాయని సర్వోత్తమ్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి: దైద రవీందర్

నకిరేకల్: ఆగస్టు 27 ప్రజా జ్యోతి
నకిరేకల్ నియోజకవర్గం పరిధిలోని 225వ బూత్ లెవెల్ వార్డు సభలో కాంగ్రెస్ నాయకుడు దైద రవీందర్ పాల్గొని ఓటర్ లిస్ట్ డ్రాఫ్ట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్ల



జాబితాలోని వివరాలను పరిశీలించి, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. దైద రవీందర్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ ప్రసాదించిన అత్యంత శక్తివంతమైన ఆయుధం ఓటు హక్కు అని అన్నారు. "ఒక మనిషి–ఒక ఓటు–ఒకే విలువ" అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరికీ సమాన ఓటు హక్కు కల్పించారని తెలిపారు. ప్రజలు తమ ఓటు విలువను తెలుసుకుని, ఆ ఓటుతో తమ భవిష్యత్తును నిర్ణయించుకోవాలని సూచించారు.
ప్రతి ఒక్కరూ ఓటర్ జాబితాలో తమ పేరు, వివరాలను పరిశీలించుకోవాలని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు బూత్ స్థాయి నుంచే చురుకుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాజ్యాంగ విలువలను కాపాడుతూ ప్రజల అభివృద్ధికి కృషి చేసే నాయకులను ఎన్నుకోవాలని కోరారు.
ఈ కార్యక్రమంలో వార్డు బి ఎల్ ఓ వంటెపాక నాగరాజు, పన్నాల రాఘవరెడ్డి, లింగాల వెంకన్న, వంటెపాక అంబేద్కర్, ఏర్పుల తాజేశ్వర్, డి. పరమేశం, వంటెపాక రాములు, గింజల లక్షి తో పాటు వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వల్లాల మోడల్ స్కూల్‌లో ఎన్ఎంఎంఎస్ పుస్తకాల పంపిణీ

శాలిగౌరారం, ఆగస్టు 27: ప్రజా జ్యోతి
వల్లాల మోడల్ స్కూల్‌లో పాల్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. గత ఏడాది ఎన్ఎంఎంఎస్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, విశిష్ట అతిథిగా శాలిగౌరారం విద్యాధికారి సైదులు హాజరై విద్యార్థులకు పుస్తకాలు, బహుమతులు అందజేశారు. పాల్‌రెడ్డి ఫౌండేషన్ అధ్యక్షుడు పాల్‌రెడ్డి రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఎన్ఎంఎంఎస్ పరీక్షకు పుస్తకాలను సద్వినియోగం చేసుకుని ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలని తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ఫౌండేషన్ అందిస్తున్న సేవలను పాఠశాల యాజమాన్యం అభినందించింది.



కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కే. కృష్ణమోహన్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు

## 8 ఏండ్లు నిండిన వారు అవకాశం సద్వినియోగం చేసుకోవాలి-తహశీల్దార్ జంగాల కృష్ణయ్య

**-మండలంలో 'సర్' ప్రక్రియ పై గ్రామసభలు -పేరు, చిరునామా పరిశీలించే అవకాశం**

**-నోటీసులు, చర్యలపై ప్రజలకు అవగాహన కొత్త ఓటు నమోదుకు అవకాశం...**

నిడమనూరు, ఆగస్టు27(ప్రజాజ్యోతి):
18 ఏండ్లు నిండిన యువతీ యువకులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ జంగాల కృష్ణయ్య



అన్నారు.ఎస్ఐఆర్– 2026 ప్రక్రియలో భాగంగా తెలంగాణ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహణలో భాగంగా గురువారం నిడమనూరు మండలంలో గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించినట్లు తహశీల్దార్ జంగాల కృష్ణయ్య తెలిపారు. ఈసందర్భంగా నిడమనూరు గ్రామ సభల్లో తహశీల్దార్ జంగాల కృష్ణయ్య మాట్లాడుతూ డ్రాఫ్ట్ ఓటర్ జాబితాను ప్రజల సమక్షంలో చదివి వినిపించడంతో పాటు ఓటర్లు తమ పేరు, చిరునామా, ఇతర వివరాలను పరిశీలించుకునే అవకాశం కల్పించనున్నారు. జాబితాలో ఏమైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలని అధికారులు సూచించారు.2026 అక్టోబర్ 1 నాటికి 18 ఏండ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫారం -6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు ఈ గ్రామ సభల్లో సూచించనున్నారు. ఓటరు వివరాల్లో చిరునామా మార్పు, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మారడం, ఇతర సవరణలు అవసరమైతే ఫారం–8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఓటరు జాబితాలో పేరు తొలగింపు లేదా ఇతర అభ్యంతరాలు ఉన్న వారు ఫారం–7 ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని వెల్లడించారు. అవసరమైన పత్రాలు, ధ్రువీకరణ వివరాలు, నోటీసులకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపైనా గ్రామ సభల్లో ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ప్రతి ఓటరు గ్రామ సభకు హాజరై డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో తన వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవస రమైన సవరణలు, అభ్యంతరాలను నిర్ణీత ఫారాల ద్వారా సమర్పించాలని ఆఫీసర్లు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు ఎన్నికల ఇంచార్జీ డిప్యూటీ తహశీల్దార్ ప్రవీణ్ ,ఎంఆర్ ఐలు సైదులు , ఎన్ఆర్ఐ ఆఫీజ్, సూపర్ వైజర్లు బి ఆంజనేయులు,జే ఈశ్వర్,బి. సైదులు , మోహన్ కృష్ణ,బిఎల్వో లు బారెడ్డి అనుషా రెడ్డి , లింగం,ఝాన్సీ,బిఎల్వోలు ,ఓటర్లు,తదితరులు ,పాల్గొన్నారు.



## నేషనల్ హైవేపై బెల్ట్ షాపులకు చెక్

### ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు

### ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్

గరిడేపల్లి,ఆగస్టు 27(ప్రజా జ్యోతి):
నేషనల్ హైవే వెంట అక్రమంగా మద్యం విక్రయించే బెల్ట్ షాపులపై ప్రత్యేక నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామని గరిడేపల్లి ఎస్ఐ బి.శ్రీకాంత్ గౌడ్ హెచ్చరించారు.హైవే వెంట ఉన్న బెల్ట్ షాపులు,హోటళ్లు,కిరాణా దుకాణాల



యజమానులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రతి దుకాణంలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.హైవేపై వాహనాలను ఇష్టారాజ్యంగా నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని,రోడ్డుపై వాహనాలు నిలిపితే ప్రమాదాలకు అవకాశం ఉంటుందని హెచ్చరించారు. అక్రమ మద్యం విక్రయాలు,అనుమానా స్పద కార్యకలాపాలకు తావివ్వకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. హైవేపై ప్రజల భద్రత,ట్రాఫిక్ క్రమబద్ధీకర ణే లక్ష్యంగా నిఘా కొనసాగుతుందని ఎస్ఐ స్పష్టం చేశారు.

## సిద్ధార్థ్ యాదవ్-వైష్ణవి వివాహ వేడుకకు హాజరైన నలగాటి ప్రసన్న రాజ్


నల్గొండ: ఆగస్టు 27 ప్రజా జ్యోతి:
నల్గొండ పట్టణంలోని చిన వెంకట్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నకిరేకల్ పట్టణానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి కొమ్ము కోటేష్ యాదవ్



కుమారుడు సిద్ధార్థ్ యాదవ్, వైష్ణవిల వివాహ మహోత్సవానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నలగాటి ప్రసన్న రాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు యాతాకుల సోమయ్య, వంటెపాక సుందర్, చెరుకు వెంకటాద్రి, చెవుగోని శంకర్, యాతాకుల కిరణ్, చింతమళ్ల శ్రీను, కందాల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ బోనాల పండుగలో దైద రవీందర్

నకిరేకల్: ఆగస్టు 27 ప్రజా జ్యోతి :
నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలోని ఎస్సీ కాలనీలో శ్రీ ముత్యాలమ్మ బోనాల





పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పన్నాల రాఘవరెడ్డి, నకిరేకల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లింగాల వెంకన్న, నాయకులు వంటెపాక అంబేద్కర్, ఏర్పుల తాజేశ్వర్, వంటెపాక రాములు, తిరుమలేశ్, వంటెపాక నక్షత్, చెనగొని రాజశేఖర్తో పాటు యూత్ కాంగ్రెస్ నాయకులు, కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఎమ్మెల్యే భూపతి రెడ్డి భేటీ

◆ నియోజకవర్గ అభివృద్ధి పై చర్చ ◆ సీఎంను శాలువాతో సత్కరించిన ఎమ్మెల్యే



**నిజామాబాదు రూరల్ ( ప్రజా జ్యోతి )27** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డిని నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు డా. ఆర్. భూపతి రెడ్డి బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో



మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శాలువాతో సత్కరించారు. భేటీలో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ముఖ్యమంత్రితో ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి చర్చించారు. నియోజకవర్గంలో ప్రస్తుతం కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతి, వాటి అమలు తీరు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలు తదితర అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయడంతో పాటు ప్రజల అవసరాలకు అనుగుణంగా చేపట్టాల్సిన భవిష్యత్ అభివృద్ధి పనులపై కూడా ముఖ్యమంత్రితో చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

## భీంగల్ పట్టణ ప్రధాన కార్యదర్శిగా

# కాపు కుమ్మరి హరీష్ నియామకం

**బాల్కొండ ఆర్సి ప్రజా జ్యోతి ఆగస్టు 27** భీంగల్ మండలం భీంగల్ పట్టణ కాంగ్రెస్ నూతన ప్రధాన కార్యదర్శిగా కాపు కుమ్మరి హరీష్ ని నియమించడం జరిగింది.. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచిన పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌కి, డిసిసి అధ్యక్షులు నగేష్ రెడ్డి కి, బాల్కొండ ఇన్చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.. కాంగ్రెస్ పార్టీకి ఎల్లప్పుడూ వినయ విధేయతలతో ఉంటానని, నిరంతరామంగా పని చేస్తూ పార్టీ ఎదుగుదలకు కృషిచేస్తానని తెలిపారు, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారమే లక్ష్యం గా కష్టపడుతానని తెలిపారు.. పట్టణ ప్రధాన కార్యదర్శిగా భీంగల్ లో ఏ సమస్య తన దృష్టికి వచ్చిన పై అధికారులతో మాట్లాడి సమస్యను తొందరగా పరిష్కరిస్థానని హామీ ఇచ్చారు..నన్ను వెన్నంటి ప్రోత్సహించే భీమ్గల్ మండల అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్ కి, భీంగల్ పట్టణ అధ్యక్షుడు పర్సా అనంతరావుకి, భీంగల్ మున్సిపాలిటీ చైర్మన్ బోదిరే నాగమణి స్వామికి, కన్నె సురేందర్‌కి తనపై నమ్మకం ఉంచిన తోటి కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# గర్గుల్ గ్రామంలో బీఆర్ఎస్‌లో భారీ చేరికలు

**కామారెడ్డి టౌన్ ఆగస్టు 27 ప్రజా జ్యోతి** మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన కాంగ్రెస్ నాయకులు కామారెడ్డి మండలం, గర్గుల్: గర్గుల్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీలోకి భారీగా చేరికలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన గ్రామ ఉపసర్పంచ్ గుంటికాడి ప్రవీణ్ కుమార్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గంప గోవర్ధన్ వారికి బీఆర్ఎస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారిలో ఉపసర్పంచ్ గుంటికాడి ప్రవీణ్ కుమార్‌తో పాటు మనోజ్ కుమార్, మల్లేష్ యాదవ్, దుమల రవి, రజనీకాంత్, యేసు స్వామి, మధుసూదన్, సంజీవచారి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా కొత్తగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. గ్రామంలో పార్టీ కార్యకలాపాలను మరింత విస్తృతం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి



సముచిత గౌరవం కల్పిస్తామని, పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గర్గుల్ గ్రామంలో చోటుచేసుకున్న ఈ చేరికలతో బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. రానున్న రోజుల్లో మరింత మంది నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరే అవకాశం ఉందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ కార్యక్రమంలో గర్గుల్ గ్రామ బీఆర్ఎస్ నాయకులు కొట్టూరు జగదీశ్వర్, గడ్డం జీవన్ రెడ్డి, సాయికుమార్, నిమ్మ శంకర్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ హియరింగ్ కేంద్రాల తనిఖీ

◆ జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ప్రతిమా సింగ్

**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 27 (ప్రజా జ్యోతి)** నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్ణీతగడువులోగా ధృవపత్రాలుసమర్పించాలి.హియరింగ్ తేదీలపై గ్రామాల్లో దండోరా ద్వారా విస్తృత ప్రచారం చేయాలి. ఎల్లారెడ్డి మున్సిపాలిటీ 10వ వార్డు, గాంధారి మండలం చాద్మల్ గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) హియరింగ్ కేంద్రాలను జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ప్రతిమా సింగ్ గురువారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా హియరింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అందుతున్న సేవలు, నోటీసులు అందుకున్న వారి వివరాలు, ధృవపత్రాల సమర్పణ ప్రక్రియ, హియరింగ్ నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్ణీత గడువులోగా సంబంధిత ధృవపత్రాలను హియరింగ్ కేంద్రంలో తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. ఓటర్లు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తమ అభ్యంతరాలు, ఆధారాలను సమర్పించేలా అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.హియరింగ్ తేదీలపై ఓటర్లకు ముందస్తుగా సమాచారం అందేలా అన్ని మండలాల తహసీల్దార్లు సంబంధిత గ్రామాల్లో దండోరా వేయించి విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. హియరింగ్ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని అధికారులకు సూచించారు.ఈ తనిఖీలో ఎల్లారెడ్డి ఆర్డీవో రొడ్డ ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్, గాంధారి తహసీల్దార్, సంబంధిత సూపర్ వైజర్లు, బూత్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## అసంపూర్తిగా అంగన్వాడి భవనం

# నిర్మాణం పట్టించుకోని కాంట్రాక్టర్



**సిరికొండ ( ప్రజా జ్యోతి)27** సిరికొండ మండలంలోని గడ్కోల్ గ్రామంలో అంగన్వాడి భవనం అసంపూర్తిగా నిర్మించారు అంగన్వాడి భవనంలో టైల్స్ డోర్లు కిటికీలు బిగించకుండా పెయింటింగ్ వెయ్యకుండా వదిలేయడంతో ఒకే అంగన్వాడి భవనంలో రెండు అంగన్వాడి సెంటర్లు నడపడం అంగన్వాడి విద్యార్థులకు చాలా ఇబ్బంది జరుగుతుంది . కావున కాంట్రాక్టర్ తొందరగా స్పందించి అంగన్వాడి భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని అంగన్వాడి విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు కోరుతున్నారు.

# వైద్య ఆరోగ్య శిబిరం



**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 27 (ప్రజా జ్యోతి)** రామారెడ్డి మండల కేంద్రంలోని ఉప్పల్వాయి గ్రామంలో గల రెసిడెన్షియల్ పాఠశాలలో ఆరోగ్య శిబిరం నిర్వహణ రెసిడెన్షియల్ పాఠశాలలో గురువారం ప్రాథమిక ఆరోగ్య సెంటర్ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించినట్లు డా. ఎం. సురేష్, మెడికల్ ఆఫీసర్ తెలిపారు.ఈ ఆరోగ్య శిబిరంలో పాఠశాలలోని విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని సమగ్రంగా పరిశీలించారు. అనారోగ్యంతో ఉన్న 34 మంది విద్యార్థులను గుర్తించి, వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్స మరియు మందులు అందించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే వైద్య సిబ్బందికి సమాచారంఅందించాలని సూచించారు.అనంతరం పాఠశాల ప్రాంగణం, తరగతి గదులు మరియు హాస్టల్ పరిసరాలను పరిశీలించి, విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం, సురక్షితమైన తాగునీరు, వ్యక్తిగత పరిశుభ్రత మరియు పరిసరాల పారిశుద్ధ్యంపై సూచనలు చేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు పాఠశాల మరియు హాస్టల్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలనిసూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శివరామ్, డా. రమ్యశ్రీ, ఆశా కార్యకర్త అరుణ, హాస్టల్ హెల్త్ సూపర్‌వైజర్ సౌందర్య తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డు



**రాయికోడ్ ఆగస్టు 27 (ప్రజా జ్యోతి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 1.05 కోట్ల కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని హుల్గేరా గ్రామంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంజయ్య,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.కొత్త రేషన్ కార్డులతో అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు మరింత సులభంగా అందనున్నాయని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ డీసీఎంస్ చైర్మన్ సిద్దన్న పటేల్,బస్వరాజ్ పటేల్,మండల అధ్యక్షుడు బాలాజీ నర్సింలు,ఎమ్మార్వో ఆశాజ్యోతి,ఎంపీడీఓ షరీఫ్,స్థానిక సర్పంచ్ నర్సింలు యాదవ్, పలువురు సర్పంచులు,నాయకులు సతీష్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

◆ ఐఐటీ హైదరాబాద్ వద్ద లారీ ఢీకొని రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి దుర్మరణం

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :** సంగారెడ్డి జిల్లా కంది మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఐఐటీ హైదరాబాద్ ఎదురుగా వేగంగా వచ్చిన ఒక లారీ, ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళు న్న వ్యక్తి తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడిని పటాన్‌చెరుకు చెందిన సత్యనారాయణ గౌడ్‌గా పోలీసులు గుర్తించారు. ఆయన గతంలో సదాశివపేటలోని ఒక బ్యాంకులో ఉద్యోగం చేసి రిటైర్ అయినట్లు తెలుస్తోంది. ప్రమాదానికి గల



పూర్తి కారణాలు తెలియాల్సి ఉందాని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



# అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక.. రక్షాబంధన్

**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 27:** ప్రేమ, ఆప్యాయత, అనురాగం, ఆత్మీయతలకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగను అన్నాచెల్లెళ్లు ఆనందోత్సాహాలతో జరుపుకుంటారు. సోదరసోదరీమణుల మధ్య ఉన్న అనుబంధాన్ని మరింత బలోపేతం చేసే ఈ పండుగకు భారతీయ సంస్కృతిలో ఎంతో విశిష్టమైన స్థానం ఉంది. రాఖీ కట్టే చిన్న సంప్రదాయంలోనే జీవితాంతం ఒకరికొకరు అండగా నిలవాలనే ఆప్యాయత, నమ్మకం దాగి ఉంటుంది.

రక్షాబంధన్ రోజున సోదరీమణులు సోదరుల చేతికి రాఖీ కట్టి, వారి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలను కోరుకుంటారు. సోదరులు తమ సోదరీమణుల రక్షణకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని మాట ఇస్తూ కానుకలు అందజేస్తారు. చిన్ననాటి అల్లరి, ఆటపాటలు, కలిసి పెరిగిన మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ కుటుంబ






సభ్యులంతా ఆనందంగా గడుపుతారు.

**రాఖీలతో సందడిగా మార్కెట్లు**

పండుగ నేపథ్యంలో పట్టణంలోని మార్కెట్లు రంగురంగుల రాఖీలతో సందడిగా మారుతున్నాయి. చిన్నారులను ఆకట్టుకునే కార్టూన్ రాఖీల నుంచి ఆకర్షణీయమైన డిజైన్లు, పూసలు, ముత్యాలు, రాళ్లతో అలంకరించిన రాఖీల వరకు వివిధ రకాల నమూనాలు అందుబాటులోకి వచ్చాయి. సోదరుల అభిరుచులకు అనుగుణంగా ప్రత్యేకంగా తయారు చేసిన రాఖీలను కొనుగోలు చేసేందుకు మహిళలు, చిన్నారులు ఆసక్తి చూపుతున్నారు.

**దూరాలను చెరిపేసే అనుబంధం**

ఉద్యోగాలు, విద్య, వ్యాపారాల కారణంగా అన్నాచెల్లెళ్లు వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్నప్పటికీ రక్షాబంధన్



సందర్భంగా వీలైనంత వరకు ఒకచోట చేరేందుకు ప్రయత్నిస్తారు. దూరంగా ఉన్నవారికి రాఖీలు, బహుమతులను పోస్టు, కొరియర్ ద్వారా పంపిస్తూ తమ ప్రేమను చాటుకుంటున్నారు. మరికొందరు వీడియో కాల్స్ ద్వారా రాఖీ వేడుకలను పంచుకుంటూ ఆధునికతకు అనుగుణంగా పండుగను జరుపుకుంటున్నారు.

**రాఖీ వెనుక ఉన్న సందేశం**

రక్షాబంధన్ అంటే కేవలం రాఖీ కట్టడం, బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం మాత్రమే కాదు. కుటుంబ సభ్యుల మధ్య ప్రేమ, పరస్పర గౌరవం, బాధ్యత, ఆప్యాయతలను గుర్తుచేసే రోజు. కష్టసుఖాల్లో ఒకరికొకరు అండగా నిలవడం, కుటుంబ బంధాలను కాపాడుకోవడం వంటి విలువలను ఈ పండుగ గుర్తుచేస్తుంది. రాఖీ రూపంలో కట్టే దారం అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని మరింత బలపరుస్తూ 'మన బంధం ఎప్పటికీ ఇలాగే ఉండాలి' అనే మధుర సందేశాన్ని అందిస్తోంది.

# పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలు వెంటనే చెల్లించాలి

**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 27:** ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ నారాయణఖేడ్ డివిజన్ అధ్యక్షుడు ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి రాజు పటేల్ డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట టీజేఈజేఏసీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. అదే సమయంలో కలెక్టర్ నారాయణఖేడ్‌కు వస్తున్న నేపథ్యంలో ఉద్యోగ సంఘాల నాయకులు ఇక్కడ కూడా నిరసన చేపట్టి, సమస్యల పరిష్కారానికి వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించి, నారాయణఖేడ్ సబ్‌డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు





మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానం ఓపీఎస్ ను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ ట్రెస్మా బాధ్యులు, ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సోదర సోదరీమణుల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్

• చేగుంట, చందాయిపేట ప్రజలకు మాజీ సర్పంచ్ స్వర్ణలత భాగ్యరాజ్ శుభాకాంక్షలు



**తూప్రాన్ (ప్రజాజ్యోతి) ఆగస్టు 27:** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని చేగుంట మండలంతో పాటు చందాయిపేట గ్రామ ప్రజలకు మాజీ సర్పంచ్ బుడ్డ స్వర్ణలత భాగ్యరాజ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పండుగ కుటుంబ బంధాలకు ప్రత్యేకమైన గుర్తింపునిచ్చే పర్వదినమని వారు పేర్కొన్నారు. అక్కాచెల్లెళ్లకు అన్నాతమ్ముళ్లు రాఖీ కట్టి వారి పట్ల తమకున్న ప్రేమ, ఆప్యాయతను చాటుకోవడంతో పాటు జీవితాంతం అండగా ఉంటామనే భరోసాను కల్పించే గొప్ప సంప్రదాయం రక్షాబంధన్‌లో ఉందన్నారు. భారతీయ సంస్కృతిలో తరతరాలుగా కొనసాగుతున్న ఈ పండుగ మన కుటుంబ విలువలను, మానవ సంబంధాలను మరింత బలపరుస్తుందని తెలిపారు. నేటి సమాజంలో బంధాలు, అనుబంధాల విలువను ప్రతి ఒక్కరూ గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. రక్షాబంధన్ సందర్భంగా ప్రతి కుటుంబంలో సంతోషం, సౌభాగ్యం వెల్లివిరియాలని, అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమాభిమానాలు ఎల్లప్పుడూ కొనసాగాలని ఆమె ఆకాంక్షించారు. చేగుంట మండల, చందాయిపేట గ్రామ ప్రజలందరికీ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

### ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్

## వైశాల్యాన్ని పెంచాలి: సీపీఐ నేతలు డిమాండ్



**గజ్వేల్, ఆగస్టు 27 (ప్రజా జ్యోతి):** ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్ వైశాల్యాన్ని 750 చదరపు అడుగులకు తగ్గిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పునఃసమీక్షించి, గతంలో మంజూరై నిర్మాణం ప్రారంభించిన ఇళ్లకు పాత నిబంధనలనే కొనసాగించాలని సీపీఐ గజ్వేల్ నాయకులు డిమాండ్ చేశారు. గత సంవత్సరం ఇందిరమ్మ ఇళ్లకు 900 చదరపు అడుగుల వైశాల్యానికి అనుమతి ఇచ్చి, లబ్ధిదారులు పిల్లర్లు వేసి, గోడలు నిర్మించుకొని ఇప్పటికే రెండు విడతల బిల్లులు పొందారని తెలిపారు. ప్రస్తుతం స్లాబ్ వేసే దశలో 750 చదరపు అడుగులకు మించి ఉందనే కారణంతో తుది బిల్లు నిరాకరించడం సమంజసం కాదన్నారు. జూలై 26న ప్రభుత్వం జారీ చేసిన జీవోను నిర్మాణం ప్రారంభించని ఇళ్లకు మాత్రమే వర్తించేలా సవరించాలని కోరారు. గతంలో మంజూరై నిర్మాణం ప్రారంభించిన ఇళ్లకు ఈ నిబంధన వర్తింపజేస్తే పేద లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని పేర్కొన్నారు. ఇళ్లులేని నిరుపేదలకు సంబంధించిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే జీవోను పునఃసమీక్షించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఒకటి, రెండు విడతల బిల్లులు తీసుకున్న లబ్ధిదారులకు తుది బిల్లులు నిలిపివేసే ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా లబ్ధిదారులతో కలిసి వివిధ రూపాల్లో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పట్టుదయానంద రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి శివలింగ కృష్ణ, జగదేవ్‌పూర్ సీపీఐ మండల కార్యదర్శి టి. నరసింహారెడ్డి, గజ్వేల్ పట్టణ సీపీఐ కార్యదర్శి స్వర్గం రాజేశం పాల్గొన్నారు.

## మృతిని కుటుంబానికి ముదిరాజ్ సంఘం ఆర్థిక సాయం



**గజ్వేల్, ఆగస్టు 27 (ప్రజా జ్యోతి):** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ 18వ వార్డుకు చెందిన చింత భూమయ్య ఐదు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన విషయం విధితమే. విషయం తెలుసుకున్న గజ్వేల్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గుంటుకు శ్రీనివాస్, కొట్టాల శ్రీనివాస్, గుంటుకు యాదగిరి మృతిని కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మృతుని కుటుంబ సభ్యులు పరామర్శించి మనోధైర్యం కోల్పో వద్దన్నారు. ఇలాంటి సమయం లోనే ఆత్మస్థైర్యంతో ఉండాలన్నారు. మృతుడి కుటుంబానికిహొతమ వంతు సహాయంగా ఆర్థిక సాయం అందించామని, కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. వారితో చింత కుమార్, గుంటుకు సామి తదితరులతో కలిసి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

## ఈనెల 31న చలో సెక్రటేరియట్

• వాల్ పోస్టర్ ఆవిష్కరణ • రోస్టర్ విధానాన్ని సవరించాలి
• దుబ్బాక నియోజకవర్గం మాల మహానాడు ఇంచార్జ్ కాల్వ నరేష్



**దుబ్బాక ప్రతినిధి ఆగస్టు 27 (ప్రజా జ్యోతి)** రోస్టర్ విధానాన్ని రద్దుచేసి మాలలకు జరుగుతున్న అన్యాయంపై ఈనెల 31న చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దుబ్బాక నియోజకవర్గం మాల మహానాడు ఇంచార్జ్ కాల్వ నరేష్ అన్నారు. గురువారం రోజున చలో సెక్రటేరియట్ వాల్ పోస్టర్ ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆదేశాల మేరకు మాల విద్యార్థులు మాల నిరుద్యోగులు మాల ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని రాజ్యాంగబద్ధమైనటువంటి మన హక్కులను కాపాడుకోవాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దిగివచ్చి వర్గీకరణలో విధానాన్ని సవరించాలని లక్ష్యంతో చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని ఇట్టి కార్యక్రమానికి పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర పొలిట్ బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు , దుబ్బాక అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కాల్వ లింగం, మాజీ అధ్యక్షులు ఆసముత్యం , మాల మహానాడు నాయకులు ఆస బక్కయ్య , ఆస రాజేష్ , ఆస ప్రభాకర్ , బావాజీ రమేష్, గడ్డమీద ప్రభాకర్, ఆస బాలయ్య మాడుగుల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## ముసాయిదా ఓటర్ జాబితా పరిశీలన

• ప్రతి ఒక్కరు ఓటు హక్కును పరిశీలించుకోవాలి
• సర్ సమగ్ర సర్వేకు సహకరించాలి • మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీరాం సంగీత. రవీందర్



**దుబ్బాక , ఆగస్టు 27 (ప్రజా జ్యోతి)** సర్ ప్రక్రియ విజయవంతంగా కొనసాగిందని ఎవరైనా ఓటు హక్కు లేని వారు ముసాయిదా ఓటర్ జాబితాలో చూసుకోవాలని దుబ్బాక మున్సిపల్ చైర్పర్సన్ శ్రీరామ్ సంగీత- రవీందర్ అన్నారు. గురువారం రోజున దుబ్బాక పట్టణంలో నీలకంఠ భజన మండలి ఏర్పాటు చేసిన సర్ ప్రత్యేక సమగ్ర సవరణ సమావేశంలో తాహసిల్దార్ మోతి సిం తో హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... మున్సిపాలిటీలోని ప్రతి ఒక్కరు ముసాయిదా ఓటర్ జాబితాలో తమ పేరు నమోదయి ఉందో లేదో పరిశించుకోవాలని అలాగే పేరు వయసు చిరునామా తదితర వివరాల్లో ఏవైనా తప్పులు లేదా లోపాలు ఉంటే సరిచూసుకోవాలని సూచించారు. అదేవిధంగా కొత్తగా ఓటర్ నమోదు కావాల్సిన వారు ఓటర్ బదిలీ చేసుకోవాల్సిన వారు సంబంధిత ఫారాలను పూర్తి చేసి వారి వివరాలను సక్రమంగా నమోదు చేసుకుని అధికారులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆస సులోచన – స్వామి, కౌన్సిలర్ లు శ్రీరాం సరస్వతి నరేందర్, అనంతుల భాగ్యమ్మ శ్రీనివాస్, ఎండి చాందుమియా, దేవుని రాజు, తునికి సురేష్, ఐరేని అఖిల – సాయి తేజ గౌడ్, బి ఎల్ వో లు , బి ఎల్ ఏ లు ఆశా వర్కర్లు ఆయా పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





### బడుగు బలహీన వర్గాల

## అభివృద్ధిని కాంక్షించేది కాంగ్రెస్ పార్టీ ఒక్కటే

• మామిడియాల సర్పంచ్ ఎడ్ల పోచయ్య



**ములుగు, ఆగస్టు,27 (ప్రజాజ్యోతి)** బడుగు బలహీనవర్గాల అభివృద్ధిని కాంక్షించేది కాంగ్రెస్ పార్టీ ఒక్కటేనని మండల పరిధిలోని ఆర్ అండ్ ఆర్ కాలనీ మామిడియాల సర్పంచ్ ఎడ్ల పోచయ్య పేర్కొన్నారు. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సర్పంచ్ రెడ్ల పోచయ్య లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను అందజేశారు. నిరుపేదల సంక్షేమం కోసం పాటుపడేది ఒక్క కాంగ్రెస్ పార్టీ అని ఇప్పటివరకు ఏ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు అందించడానికి ముందుకు రాకపోగా ఎన్నో రేషన్ కార్డులను ప్రభుత్వం మంజూరు చేయగా వాటిని స్మార్ట్ కార్డులుగా మలిచి ప్రజలకు అందజేస్తున్నది ప్రజా ప్రభుత్వమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ కార్డు అద్భుతాయని ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపసర్పంచ్ కృష్ణ, వార్డు సభ్యులు అనిల్ చారి, ప్రదీప్ రెడ్డి, రంగయ్య పంచాయతి కార్యదర్శి రాజు, బిఎల్వోలు నాగరాణి, విజయ్, కుమారి, నాయకులు స్వామి, బాల్ నర్స్, రాజు, రాము, సత్తయ్య గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అన్నాచెల్లెళ్ల ఆత్మీయతకు ప్రతీకగా రక్షాబంధన్



**కొండపాక ఆగస్టు 27( ప్రజా జ్యోతి):-** అన్నాచెల్లెళ్ల ప్రేమానురాగాలకు ప్రతీకగా జరుపుకునే రక్షాబంధన్ పండుగను పురస్కరించుకుని కొండపాక మండలంలోని బందారం ప్రాథమికోన్నత పాఠశాల, కుకునూరుపల్లి మండల పరిధిలోని తిప్పారం ప్రాథమిక ఉన్నత పాఠశాల లో ముందస్తు రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఒకరికొకరు రాఖీలు కట్టుకొని రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధం, పరస్పర రక్షణ వంటి విలువలను విద్యార్థులకు తెలియజేస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందంతో పాటు విద్యార్థినీ, విద్యార్థులు ఆనందంగా పాల్గొన్నారు. వేడుకల సందర్భంగా పాఠశాలలో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన బందారం గ్రామ కుటుంబ సభ్యులకు పాఠశాల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## జీవో 97 రద్దు చేయాల్సిందే

• గేటు దూకి లోపలికి వెళ్లి కలెక్టర్ ఛాంబర్ ముందు ధర్నా
• కలెక్టర్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత



**సిద్దిపేట అర్బన్, ఆగస్టు 27 (ప్రజాజ్యోతి):-** పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును అగమ్య గోచరం చేసే జీవో నెంబర్ 97 ను రద్దు చేయాల్సిందే అని పాలిటెక్నిక్ విద్యార్థులు విద్యార్థ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ విద్యార్థులు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకున్న విద్యార్థి సంఘం నాయకులు పాలిటెక్నిక్ విద్యార్థులు నినాదాలతో నిరసన తెలిపారు. అనంతరం పోలీసులు ఏర్పాటు చేసిన భారీ కేడ్లు చేదిస్తూ కలెక్టర్ కార్యాలయం గేటు ఎక్కి లోపలికి వెళ్లడానికి ప్రయత్నించారు. విద్యార్థి సంఘం నాయకులు గేటు దూకి గేట్ లాక్ ఓపెన్ చేయడంతో ఒక్కసారిగా విద్యార్థులు లోపలికి చొచ్చుకుపోయారు. పోలీసులు ఆపే ప్రయత్నం చేసినప్పటికీ విద్యార్థులు ఒక్కసారిగా పరిగెత్తుకు వచ్చి కలెక్టర్ కార్యాలయం లోపలికి వెళ్లి కలెక్టర్ చాంబర్ వద్ద ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు మాట్లాడుతూ డిప్లమా చదివిన తర్వాత బీటెక్ లేదు అనే జీవో తీసుకువస్తే మూడు సంవత్సరాల చదువు వ్యర్థమైపోతుందని అన్నారు. కష్టపడి చదువుతుంటే ప్రభుత్వం కొత్త కొత్త ఆంక్షలు తీసుకువచ్చి విద్యార్థుల జీవితాలను ఆగం చేస్తుందని తమ చదువుల కోసం తమ భవిష్యత్తు కోసం ప్రశ్నిస్తే సమస్యలు వినాల్సింది పోయి అరెస్టులు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి విద్యాశాఖ మంత్రిగా ఉంటూ విద్య వ్యవస్థను తూతూ మంత్రంగా నిర్వహిస్తు కోటి ఆశలతో బీటెక్ చేయాలని పాలిటెక్నిక్ చేస్తున్న విద్యార్థుల భవిష్యత్తును అంధకారం చేస్తూ ఐటిఐ తో కలపడం సరైనది కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వీ విద్యార్థి సంఘం నాయకులు రెడ్డి యాదగిరి, పయ్యావుల శ్యామ్, రమేష్, మాధవ్, నాగరాజు, సోహెల్, ప్రశాంత్ పాలిటెక్నిక్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రేమానురాగాల పండుగ రక్షాబంధన్..

• జిల్లా ప్రజలకు హరీశ్ రావు శుభాకాంక్షలు



**సిద్ధిపేట, ఆగస్టు 27, (ప్రజాజ్యోతి):** అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధానికి ప్రతీకగా నిలిచే పవిత్రమైన రక్షాబంధన్ పర్వదినం సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు సిద్దిపేట జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. మానవ సంబంధాల్లోని పవిత్రమైన సహోదరభావాన్ని మరింత బలోపేతం చేసే పండుగ రక్షాబంధన్ అని అన్నారు. అన్నాతమ్ముళ్లు తమ అక్కాచెల్లెళ్లకు ఎల్లవేళలా అండగా నిలుస్తారనే భరోసా ఈ పండుగలో ఇమిడి ఉందన్నారు. ప్రేమానురాగాలు, సోదరభావానికి ప్రతీకగా ప్రతి ఏటా శ్రావణమాస పౌర్ణమి రోజున జరుపుకునే రాఖీ పండుగ భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో అనాదిగా కొనసాగుతున్న గొప్ప ఆచారమని తెలిపారు. రక్షాబంధన్ వేడుకల సందర్భంగా ప్రజల్లో సహోదరభావం మరింతగా పరిఢవిల్లాలని ఆకాంక్షించారు. రక్షాబంధన్ ప్రతి కుటుంబంలో సంతోషం, శాంతి, ఐశ్వర్యాలను నింపాలని, అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధం ఎల్లప్పుడూ చిరస్థాయిగా కొనసాగాలని కోరుకున్నారు.

## ప్రజా గొంతు నొక్కితే ఊరుకునేది లేదు

• హరీష్ రావు అరెస్ట్‌పై భగ్గుమన్న బీఆర్ఎస్



**సిద్ధిపేట, ఆగస్టు 27, (ప్రజాజ్యోతి):** వరంగల్‌లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే, ప్రతిపక్ష ఉపనేత తన్నీరు హరీష్ రావును పోలీసులు అరెస్ట్ చేసిన తీరుపై సిద్దిపేట బీఆర్ఎస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యోగుల సమస్యలపై నిరసన తెలిపేందుకు అనుమతి ఉన్నప్పటికీ అరెస్టులకు పాల్పడటం దుర్మార్గమని వారు విమర్శించారు. గురువారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్‌తో కలిసి సొసైటీ చైర్మన్ కోల రమేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, వాటిపై ప్రశ్నించే వారిని అణచివేసే విధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఉద్యోగులు, విద్యార్థులు, రైతులు, సామాన్య ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలను పరిష్కరించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగుల నిరసన కార్యక్రమానికి అనుమతి ఇచ్చి, అదే కార్యక్రమంలో అరెస్టులు చేయడం ఏ విధమైన ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధిగా, ప్రతిపక్ష ఉపనేతగా ఉన్న హరీష్ రావు పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్య విలువలను అవమానించేలా ఉందని కోల రమేష్ మండిపడ్డారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతులను అణచివేయడం కాకుండా, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆవేదనను ప్రభుత్వం పట్టించుకోకపోతే ఉద్యమాలు తప్పవని కోల రమేష్ హెచ్చరించారు. తెలంగాణ ప్రజల హక్కులు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం అవసరమైతే మరో తెలంగాణ ఉద్యమం తరహాలో పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైతే ప్రజలే తగిన సమాధానం చెబుతారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కోల రమేష్, జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, బెదురు తిరుపతి, రెడ్డి యాదగిరి, సాయి శరణ్, పడిగె ప్రశాంత్, శిలాపూర్ రాజు, రామంచ రమేష్, పిట్ల రాకేష్, బెజ్జంకి తిరుపతి, కూర్మ నరేశ్, అప్పల శేఖర్ తదితరులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఆత్మీయ బంధానికి

## రక్షణ కవచం రక్షాబంధన్

• అంతర్జాతీయ చిత్రకారులు రుస్తుం





**సిద్దిపేట అర్బన్, ఆగస్టు27(ప్రజాజ్యోతి):-** రాఖీ పౌర్ణమి అక్కాచెల్లి అన్నాతమ్ముళ్ల ఆత్మీయ బంధానికి రక్షణ కవచం రక్షాబంధన్ అని అంతర్జాతీయ చిత్రకారులు రుస్తుం అన్నారు. రాఖీ పౌర్ణమి ని పురస్కరించుకుని గురువారం రుస్తుం ఆర్ట్ గ్యాలరీలో "రాఖీ రక్షణ కవచం" రాఖీపున్నమి చిత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ రాఖీపౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. తరతరాలుగా భారతదేశ సంస్కృతులు ఉమ్మడి కుటుంబాల ఆత్మీయత, అన్నా చెల్లెల అనుబంధాలు, ప్రేమానురాగాలు వాత్సల్యానికి ఎల్లవేళలా విడిపోని బంధమై కళాత్మక జీవన సౌందర్యాన్ని బలోపేతం చేస్తూ నిలువెల్లా పరిమళిస్తుంటాయన్నారు. ప్రపంచ దేశాలకు అంతుపట్టని భారతజాతి సంస్కృతి సంప్రదాయం ఆచార వ్యవహారాలు ఉమ్మడి కుటుంభం భిన్నత్వంలో ఏకత్వం ఐక్యత వారిని మంత్ర ముగ్ధులను చేస్తున్నవని, మన సంస్కృతిని ఎల్లవేళలా కాపాడుకుంటూ రాఖీ పౌర్ణమి అందరి జీవితాల్లో సుఖ సంతోషాలు శాంతి భద్రతలు సౌభాగ్యాలు ఐకమత్యం, రక్షణ కవచంగా పెంపొందించాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలోఆర్ ఎ ఎఫ్ అధ్యక్షురాలు జులేఖరుస్తుం, నైరూప్య చిత్రకారుడు నహీంరుస్తుం, నేచర్ ఆర్టిస్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రుబినారుస్తుం, మహ్మద్ రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కృష్ణాష్టమి, వినాయక చవితి వేడుకల నిర్వహణపై 29న సమావేశం

**హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో హాజరై సూచనలు అందించాలని ఉత్సవ కమిటీ పిలుపు**

**పరిగి, ఆగస్టు 27 (ప్రజాజ్యోతి):** పరిగి పట్టణంలో నిర్వహించనున్న శ్రీ కృష్ణాష్టమి అలాగే వినాయక చవితి పండుగల సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించేందుకు ఈ నెల 29వ తేదీ శనివారం సాయంత్రం 5 గంటలకు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం (ధర్మశాల)లో సమావేశం నిర్వహించనున్నట్లు హిందూ ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

పండుగలను భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు, కార్యక్రమాల రూపకల్పన, భక్తుల భాగస్వామ్యం తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. పరిగి పట్టణంలోని హిందూ బంధువులందరూ సకాలంలో హాజరై తమ విలువైన సూచనలు, సలహాలు అందించి కార్యక్రమాల విజయవంతానికి సహకరించాలని హిందూ ఉత్సవ కమిటీ పరిగి మున్సిపాలిటీ అధ్యక్షులు సోమ రమేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి ముకుంద నాగేశ్వర్, కోశాధికారి మీదిగడ్డ శ్రీనివాస్ కోరారు.

# సెప్టెంబర్ 3న నగరంలో జీప్యాక్ట్స్-26 సదస్సు




**హైదరాబాద్, ఆగస్ట్ 27 (ప్రజా జ్యోతి) :** ఫార్మా రంగంలో ఏఐ, కంప్లయన్స్, సైబర్ భద్రత, డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ అంశాలపై జీప్యాక్ట్స్-2026 సదస్సు సెప్టెంబర్ 3న నోవాటెల్ హెచ్ఐసీసీలో నిర్వహించనున్నట్లు జీప్యాక్ట్స్ డైరెక్టర్లు షిప్రా సింగ్, రవీంద్ర వారంగ్ లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ ఏఐ, డేటా రక్షణ, సైబర్ భద్రత, ఎంఈఎస్, డిజిటల్ ట్విన్స్, నాణ్యతా వ్యవస్థలపై ఆచరణాత్మక చర్చలు సదస్సులో జరుగుతాయని తెలిపారు. హనీవెల్తో, థర్మో ఫిషర్ సైంటిఫిక్, రాక్వెల్ ఆటోమేషన్, నివిడస్ సాఫ్ట్వేర్ సహకారంతో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఆల్కెమ్ ల్యాబొరేటరీస్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్, వోక్హార్డ్, గ్రాన్యూల్స్ ఇండియా, బయోలాజికల్ ఇ సంస్థల ప్రతినిధుల తోపాటు 350 నుంచి 400 మంది ఫార్మా రంగ ప్రముఖులు హాజరుకానున్నట్లు చెప్పారు.

# కళ్లెం నవజీవన్ రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఉపేందర్ గౌడ్




**అబ్దుల్లాపూర్ మెట్టు ఆగస్టు 27(ప్రజాజ్యోతి) :** హయత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి 50వ జన్మదిన వేడుకలు ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హయత్ నగర్ వివిరా హాస్పటల్ చైర్మన్ ఉపేందర్ గౌడ్, ఎండి నాగబాబు కళ్యాణ్ నవజీవన్ రెడ్డి నివాసానికి వెళ్లి శాలువాతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులోనూ ప్రజా ప్రతినిధిగా ప్రజలకు తన వంతు సేవలు అందిస్తూ హయత్ నగర్ అభివృద్ధికి కృషి చేస్తూ హయత్ నగర్ ప్రజల మన్ననలు అందుకోవాలని అన్నారు.

# అర్హుల ఓట్ల తొలగింపుపై విచారణ జరపాలి

**కాంగ్రెస్ ఓబీసీ విభాగం రాష్ట్ర జాయింట్ కో-ఆర్డినేటర్ గొంటి విక్రమ్ యాదవ్**



**హైదరాబాద్, ఆగస్ట్ 27 (ప్రజా జ్యోతి) :** రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అర్హులైన ఓటర్ల పేర్లు ఓటరు జాబితా నుంచి తొలగిస్తున్నారనే ఫిర్యాదులపై ఎన్నికల సంఘం పారదర్శకంగా విచారణ జరిపి అనుమానాలను నివృత్తి చేయాలని కాంగ్రెస్ ఓబీసీ విభాగం రాష్ట్ర జాయింట్ కో-ఆర్డినేటర్, జీహెచ్ఎంసీ ఇన్చార్జ్ గొంటి విక్రమ్ యాదవ్ డిమాండ్ చేశారు. ముఖ్యంగా నిరక్షరాస్యులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల అర్హులైన ఓటర్ల పేర్ల తొలగింపుపై ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన విలువైన ప్రజాస్వామ్య హక్కు అని, సరైన కారణం లేకుండా ఏ అర్హుడి పేరునూ తొలగించరాదని అన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, చట్టబద్ధంగా జరిగేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని కోరారు. అర్హుల పేర్లు తొలగించబడితే వెంటనే పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ శ్రేణులు ప్రతి బూత్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాను పరిశీలించి, పేర్లు లేని అర్హులైన ఓటర్లకు ఎన్నికల సంఘం నిర్దేశించిన విధానంలో దరఖాస్తు చేయించి ఓటు హక్కును కాపాడాలని పిలుపునిచ్చారు.

# జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ఎల్బీనగర్ డివిజన్ బిజెపి కార్యదర్శి చంద్రశేఖర్



**అబ్దుల్లాపూర్ మెట్టు ఆగస్టు 27 (ప్రజాజ్యోతి) :** రంగారెడ్డి జిల్లా అర్బన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, హయత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి గురువారం జన్మదిన వేడుకల సందర్భంగా ఎల్బీనగర్ డివిజన్ బిజెపి పార్టీ కార్యదర్శి చంద్రశేఖర్ వారి నివాసానికి వెళ్లి శాలువాతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. బిజెపి పార్టీ నేతలుగా రాజకీయ రంగంలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన మనసారా ఆకాంక్షించారు. ప్రజాసేవ చేసే అదృష్టం అందరికీ దక్కదని, ఆ అదృష్టాన్ని అందుకున్న ఇరువురు నేతలు ధన్యజీవులన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మందుల విద్యాసాగర్ కురుమ, మామిడి శ్రీనివాస్ రెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు

# రేషన్ కార్డు ఉన్న అందరికీ బియ్యం అందాలి

**కరణ్ కోట్ రేషన్ దుకాణాన్ని తనిఖీ చేసిన ఆర్ఐ**



**తాండూరు ఆగస్టు 27 ప్రజా జ్యోతి :** తాండూరు మండలం కరణ్కోట్ గ్రామంలో కొనసాగుతున్న చౌక ధరల దుకాణాన్ని తాండూరు రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంకట రమణారెడ్డి గురువారం రోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డు ఉన్న ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం ద్వారా అందించే మూడు నెలల రేషన్ బియ్యాన్ని తప్పనిసరిగా అందించే విధంగా చూడాలని సంబంధిత రేషన్ దుకాణం నిర్వాహకుడిని ఆదేశించిన్నట్లు చెప్పారు.

ఈ గ్రామంలో రేషన్ కార్డుల సంఖ్య అధికంగా ఉండడంతో మరిన్ని చౌక ధరల దుకాణాల ఏర్పాటు కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు.

అదేవిధంగా నాసిరకమైన బియ్యం వచ్చినట్లు తన దృష్టికి రావడంతో చౌకధరల దుకాణాన్ని తనిఖీ చేసి నాసిరకమైన బియ్యం బస్తాలు వెంటనే గోదాంకు తరలించాలని సూచించడం జరిగిందని చెప్పారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు భరత్ కిషోర్ మాట్లాడుతూ ఇదివరకు రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు సక్రమంగా బియ్యం అందించలేదని పలువురు లబ్ధిదారులు ఆరోపించినట్లు గుర్తు చేశారు. ఇట్టి విషయంపై కూడా రెవెన్యూ ఇన్స్పెక్టర్ స్పందించి నిర్వాహకులను ఆదేశించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువకులు సునీల్, పలువురు లబ్ధిదారులు ఉన్నారు.

# వార్డు సభలో ఓటరు జాబితా పరిశీలన..

**నోటీసులు అందుకున్న వారు తప్పనిసరిగా స్పందించాలి: మున్సిపల్ కమిషనర్ మల్లేష్, కౌన్సిలర్ మీర్ సమీనా తాహేర్ అలీ**



**పరిగి, ఆగస్టు 27 (ప్రజాజ్యోతి):** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్-2026) కార్యక్రమంలో భాగంగా గురువారం పరిగి మున్సిపాలిటీ 13వ వార్డులో వార్డు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముసాయిదా ఓటరు జాబితాలోని పేర్లను పరిశీలించి, ఓటర్ల వివరాలను ధృవీకరించే ప్రక్రియ చేపట్టారు. సభలో మున్సిపల్ కమిషనర్ కె. మల్లేష్, 13వ వార్డు కౌన్సిలర్ మీర్ సమీనా తాహేర్ అలీ, బీఎల్ఓ నుస్రత్ ఫాతిమా పాల్గొని పిఎస్ 214, 215 కు సంబంధించిన ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు అలాగే ఇతర వివరాలను పరిశీలించారు. నోటీసులు అందుకున్న ఓటర్లకు వాటిని అందజేసి, అవసరమైన వివరాలను సమర్పించాలని సూచించారు.

అలాగే సభకు హాజరు కాని వారికి ఫోన్ ద్వారా సమాచారం అందించి, నోటీసులు స్వీకరించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటరు జాబితాలో పేరు లేని అర్హులైన వారు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, వివరాల్లో పొరపాట్లు ఉన్న వారు ఫారం-8 ద్వారా సవరణకు దరఖాస్తు చేసుకోవాలని, అనర్హులైన ఓటర్ల పేర్లపై ఫారం-7 ద్వారా అభ్యంతరాలు తెలియజేయవచ్చని అధికారులు వివరించారు.

ఈ కార్యక్రమంలో కైసర్ బేగ్, మాజీద్, సయ్యద్ చాంద్, యూసుఫుద్దీన్, అంజాద్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు. ప్రజలు గ్రామ సభలు, వార్డు సభలకు హాజరై తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# అంబేద్కర్ అభయహస్తం అమలు చేయాలి


- హామీలు అమలు చేయకుంటే.. గ్రామాల్లో తిరగనివ్వం
- కాంగ్రెస్ నేతలకు దళిత, గిరిజన, ఆదివాసీ జేఏసీ హెచ్చరిక
- కేవీఆర్ గ్రౌండ్లో 'చాయ్ పే చర్చ'




**చేవెళ్ల, ఆగస్టు 27(ప్రజా జ్యోతి) :** ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని దళిత, గిరిజన, ఆదివాసీ జేఏసీ నేతలు మండిపడ్డారు. 'అంబేద్కర్ అభయహస్తం' పథకాన్ని వెంటనే అమలు చేయాలని, లేకపోతే కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లో తిరగనివ్వబోమని బొంకూరి సురేందర్ సన్ని, భారత ఏరుకుల కులవృత్తుల అభివృద్ధి సేవా సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు కండేల వెంకటేశ్వర్లు హెచ్చరించారు. 2023 ఆగస్టు 26న చేవెళ్ల కేవీఆర్ గ్రౌండ్లో జరిగిన కాంగ్రెస్ బహిరంగ సభలో ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి రూ.12 లక్షలు అందిస్తామని, ఎస్సీ, ఎస్టీలకు చెరో మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని వారు గుర్తుచేశారు. ప్రభుత్వం ఏర్పడిన తొలి మంత్రివర్గ సమావేశంలోనే హామీలను అమలు చేస్తామని చెప్పినా.. మూడేళ్లు గడిచినా అమలు కాలేదని విమర్శించారు. హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు గురువారం అదే కేవీఆర్ గ్రౌండ్లో జేఏసీ ఆధ్వర్యంలో 'చాయ్ పే చర్చ' నిర్వహించారు. అంతకుముందు చేవెళ్ల చౌరస్తాలోని పూలే, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎరుకల నాంచారమ్మతో 'సోది' కార్యక్రమం నిర్వహించారు. దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాలు ఐక్యంగా పోరాడాలని ఆమె సూచించినట్లు నాయకులు తెలిపారు. హామీలను అమలు చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని కండేల వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బొంగు వెంకటేష్గౌడ్, కండేల పెద్ద వెంకటేష్, మద్దెల భవాని, కళ్లేపల్లి రవి, వనం గంగయ్య, మిట్టపెల్లి రాధిక, వనం పుల్లయ్య, మిక్కిలి సుంకయ్య, జగన్నాధం మహేష్, జగన్నాధం శేఖర్, మ్యారడి అంజయ్య, వనం కావేరి, వనం లలిత, వనం పద్మ, మద్దెల ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# అనధికార నిర్మాణాలపై ఎన్ఫోర్స్మెంట్ చర్యలు

**సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ జి సృజన**

**శేరిలింగంపల్లి,ఆగస్టు 27 (ప్రజాజ్యోతి):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలో అనధికార నిర్మాణంలో ఉన్న భవనాలపై కొనసాగుతున్న ఎన్ఫోర్స్మెంట్ డ్రైవ్లో భాగంగా, ఆగస్టు 27, 2026న మూడు జోన్లలో క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి అవసరమైన చర్యలు చేపట్టారు.నిర్వహించిన తనిఖీల్లో 54 అనధికార నిర్మాణాలను గుర్తించారు. వీటిలో 21 అనధికార నిర్మాణాలను కూల్చివేయగా, 14 నోటీసులు జారీ చేశారు ఒక అనధికార నిర్మాణాన్ని సీజ్ చేశారు.గుర్తించిన మిగిలిన 33 కేసులను తదుపరి కూల్చివేత మరియు ఇతర ఎన్ఫోర్స్మెంట్ చర్యల కోసం నిర్దేశిత విధానం మరియు వర్తించే నిబంధనల ప్రకారం తీసుకుంటున్నారు.జోన్ల వారీగా కూల్చివేతలు

**శేరిలింగంపల్లి జోన్: 9,కూకట్పల్లి జోన్: 6**

కుత్బుల్లాపూర్ జోన్: 6,అనధికార నిర్మాణాలపై ప్రతిరోజూ క్షేత్రస్థాయి తనిఖీలు మరియు కఠిన పర్యవేక్షణ కొనసాగించాలని సంబంధిత టౌన్ ప్లానింగ్ మరియు ఎన్ఫోర్స్మెంట్ బృందాలను కమిషనర్ ఆదేశించారు.భవన నిర్మాణ నిబంధనల అమలును నిర్ధారించేందుకు సీఎంసీ ఎన్ఫోర్స్మెంట్ చర్యలను కొనసాగిస్తుంది. గుర్తించిన అన్ని అనధికార నిర్మాణాలపై నిర్దేశిత విధానం మరియు వర్తించే నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు చేపట్టబడతాయి

# ఈదుల కుంట పోరాటంలో కీలక పరిణామం

**సిపిఐఎం నాయకులు సి శోభన్**



**శేరిలింగంపల్లి, ఆగస్టు 27 (ప్రజాజ్యోతి) :** శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామ పరిధిలోని ఈదుల కుంట పోరాటం లో కీలక మైన పరిణామం సంభవించింది . చెరువు పరిరక్షణ కోసం సిపిఎం పార్టీ మొదటి నుంచి పోరాడుతున్న విషయం తెలిసిందే.. పోరాటంలో భాగంగా ఎన్ జి టి (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్) లో పూర్తి ఆధారాలతో సహా ఫిర్యాదు చేసింది.ఎన్జీటీ పూర్తిస్థాయి రిపోర్టు సమర్పించవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.జిల్లా ఆర్డీవో పర్యావరణ ఇంజనీర్ సంయుక్తంగా ఫీల్డ్ లోకి వెళ్లి అలాగే రికార్డులను సైతం పరిశీలించి ఇది చెరువే అని నిర్ధారించి రిపోర్టును ఎన్ జి టి లో సమర్పించారు.అధికారుల రిపోర్ట్ పై సిపిఐ( ఎం) హర్షం..ఎన్ జి టి ఆదేశాల మేరకు అధికారులు చెరువు అని నిర్ధారిస్తూ రిపోర్టర్ సమర్పించడాని నీ సిపిఐఎం నాయకులు సి, శోభన్, వి, మాణిక్యం, కె కృష్ణ, ఎన్. శ్రీనివాసు లు హర్షం వ్యక్తం చేశారు... ఇప్పటికైనా చెరువు పరిరక్షణలో న్యాయం నెగ్గిందని అన్నారు... చెరువుని వరద నీటితో నింపి భూగర్భ జలాలు కాపాడాలని కోరారు.

# కలెక్టర్కు రాఖీ కట్టిన జిల్లా అధికారులు




**వికారాబాద్ ప్రతినిధి, ఆగస్టు 27(ప్రజా జ్యోతి):** రాఖీ పౌర్ణమి సందర్భంగా జిల్లా అధికారులు జిల్లా కలెక్టర్ తివారి ను మర్యాదపూర్వకంగా కలిసి రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. డీపీఓ జయసుధ, డీపీఆర్ఓ చెన్నమ్మ, వ్యవసాయ అధికారి కవిత తదితరులు కలెక్టర్ను కలిసి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులు, సిబ్బందికి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధానికి రాఖీ పౌర్ణమి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, సోదరభావంతో జీవించాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు కూడా కలెక్టర్ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ రామ మందిరం నిర్మాణంలో అందరూ భాగసములవ్వాలి

**- రూ 1లక్ష 11రూపాయల విరాళం అందజేసిన మున్సిపల్ చైర్ పర్సన్ దంపతులు**




**తాండూరు ఆగస్టు 27 ప్రజా జ్యోతి :** తాండూర్ పట్టణంలోనే అత్యంత ప్రఖ్యాతిగాంచిన శ్రీరామ మందిర నిర్మాణంలో భాగంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనుల కోసం తాండూర్ మున్సిపల్ చైర్పర్సన్ నీరజ బాల్ రెడ్డి దంపతులు తమ వంతు సహకారంగా రూ 1లక్ష 11 రూపాయల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానికుల సహకారంతో ప్రారంభమైన శ్రీ రామ మందిరం పునర్నిర్మాణంలో అందరూ భాగస్వాములై దేవాలయ ప్రాంగణంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యే విధంగా సహకరించాలని కోరారు. నిర్మాణం పనుల కోసం కమిటీ సభ్యులు చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. శ్రీరాముడి ఆశీస్సులతో దేవాలయంలో చేపట్టాల్సిన అన్ని అభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేసేలా ఆయన ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ప్రజాప్రతినిధులు స్థానికులు ఉన్నారు.

# విద్యార్థులు చిన్ననాటి నుండే సోదర భావంతో మెలగాలి

- గాజిపూర్ పాఠశాలలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు
- విద్యార్థులకు రాఖీలు కట్టిన గ్రామ సర్పంచ్ హేమలత




**తాండూరు ఆగస్టు 27 ప్రజా జ్యోతి :** విద్యార్థులు చిన్ననాటి నుండే అందరు కూడ సోదర భావంతో మెలగాలని పెద్దేముల్ మండలం గాజీపూర్ గ్రామ సర్పంచ్ పట్లోళ్ల హేమలత లాల్ రెడ్డి సూచించారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని అన్నా చెల్లెలు అక్క తమ్ముడి ఆత్మీయ అనురాగాలకు ప్రతికగా నిలిచే రాఖీ పౌర్ణమి వేడుకలు స్థానిక పాఠశాలలో ఉపాధ్యాయుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఏటా జరుపుకునే రక్షాబంధన్ తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయానికి నిలువెత్తు నిదర్శనం అన్నారు. సుదూర ప్రాంతాల నుండి పుట్టింటికి వచ్చే ఆడపడుచులతో ఆ ఇంటిలిపాది జరుపుకునే సందడి పండుగ అని గుర్తు చేశారు. విద్యార్థులు కూడా చిన్ననాటి నుండే ఒకరినొకరు సోదర భావంతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమం లో స్థానిక ఉపాధ్యాయులు విద్యార్థులు ప్రజాప్రతినిధులు పాల్గొని రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు చెప్పారు.

# ప్రభుత్వ భూమి సర్వే నెం.151 సర్కారీ చెరువు శిఖంలో 2023లో ఇచ్చిన అనుమతిని రద్దు

**జనం కోసం అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి**



**శేరిలింగంపల్లి, ఆగస్టు 27 (ప్రజాజ్యోతి) :**

2023 లో అప్పటి అధికారులు అవినీతికి పాల్పడి స. నెం.151, దీప్తిశ్రీనగర్, హఫీజ్ పేట్ సర్కారీ శిఖం భూమిలో స. నెం.150 పట్టా భూమిగా చూపిస్తూ అనుమతులు ఇవ్వడాన్ని వెంటనే రద్దు చేయాలని నారాయణ్ అమిత్, జోనల్ కమీషనర్, శేరిలింగంపల్లి ని కలిసి, డిప్యూటీ కలెక్టర్ కం తహసీల్దార్ శేరిలింగంపల్లి రాసిన లేఖను స్వయంగా ఈయడం జరిగింది. ప్రభుత్వ భూమిని కాపాడడానికి సత్వర చర్యలు అవసరమని ఈ సందర్భంగా జోనల్ కమీషనర్ దృష్టికి తేగా, ఆయన పూర్తి సమాచారం డిప్యూటీ కమీషనర్, సర్కిల్ 48, నుండి తెప్పించుకొని రద్దు చేస్తామని హామీ ఇచ్చారు.పర్మీషన్ ఇచ్చిన అధికారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి - జనం కోసం రెవెన్యూ డిపార్ట్మెంట్ నుండి సరయిన నిరభ్యంతరపత్రం లేకుండా ప్రభుత్వ భూమిలో అనుమతులు ఇచ్చిన సంబంధిత అధికారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని జనం కోసం అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కరరెడ్డి డిమాండ్ చేశారు. అవినీతికి పాల్పడి అనుమతులు ఈయడం క్షమించరాని నేరమని ఆయన అన్నారు. అనేకసార్లు జోనల్ కార్యాలయంపై ఏసీబీ దాడులు చేసి పట్టుకున్నా అధికారులలో భయం లేకపోవడం వారి భరితెగింపుకు నిదర్శనమని ఆయన అంటూ... అధికారంలో ఉన్నవారు వ్యవస్థలను సర్వనాశనం చేశారని అన్నారు.

# సామాజిక న్యాయమే లక్ష్యం ,

## ఎమ్మార్పీఎస్ ఎండపల్లి మండల అధ్యక్షుడు కుమారస్వామి,

ఎండపల్లి, ఆగస్ట్ 26 ప్రజా జ్యోతి,
ఎమ్మార్పీఎస్ ఎండపల్లి మండల అధ్యక్షుడిగా కొండాపూర్ గ్రామానికి చెందిన చెన్న కుమారస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం నాగవల్లి లక్ష్మీనృసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో జిల్లా ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి రేణుకుంట సాగర్ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు,



కార్యకర్తలు కుమారస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ధర్మపురి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు చిలుముల లక్ష్మణ్ హాజరయ్యారు. మండల అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలకు చెన్న కుమారస్వామి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మార్పీఎస్‌ను మరింత బలోపేతం చేయడంతోపాటు సామాజిక న్యాయమే లక్ష్యంగా,అణగారిన వర్గాల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు దుమల గంగారాం, పోడేటి సునీల్, వెల్గటూర్ ఇన్‌చార్జి మోకేనపెల్లి సతీష్, సీనియర్ నాయకులు మంతెన లక్ష్మణ్, గ్రామ శాఖ అధ్యక్షుడు చిలుముల మొండయ్య, ఓరుగంటి నాగేష్, చొప్పదండి భూమయ్య, అర్రికిల్ల ప్రశాంత్, గజ్జెల మల్లయ్య, సూరమళ్ల ప్రభంజన్ తదితరులు పాల్గొన్నారు.

# మానవతా మూర్తి స్ఫూర్తితో ఆశా వర్కర్లకు ఘన సన్మానం

రాయికల్,ఆగస్టు 26 (ప్రజా జ్యోతి)
మానవతా మూర్తి మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ రాయికల్ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లను ఘనంగా సన్మానించారు. సమాజ సేవకు జీవితాన్ని అంకితం




చేసిన మదర్ థెరిస్సా ఆశయాలను స్మరించుకుంటూ,ప్రజారోగ్య పరిరక్షణలో నిరంతరం సేవలందిస్తున్న ఆశా వర్కర్ల సేవలను ఈ సందర్భంగా కొనియాడారు.లయన్స్ క్లబ్ అధ్యక్షులు వాసం ప్రసాద్ మాట్లాడుతూ,మదర్ థెరిస్సా అనాధలు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు, నిరాశ్రయులు, కుష్టు రోగుల సేవకే తన జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. కులమత భేదాలకు అతీతంగా ప్రతి మనిషిలో మానవత్వాన్ని చూసి సేవ చేసిన మహనీయురాలని పేర్కొన్నారు.అదే సేవా స్ఫూర్తితో ఆశా వర్కర్లు పట్టణాలు, గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలను చేరువ చేస్తున్నారని తెలిపారు. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు, పేదలకు ఆరోగ్య అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో వారు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారని ప్రశంసించారు.కార్యక్రమంలో చార్టర్డ్ ప్రెసిడెంట్, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు,సెక్రటరీ కనపర్తి శ్రీనివాస్, ట్రెజరర్ సుధవేని మురళీగౌడ్, మ్యాకల రమేష్,మచ్చ శేఖర్, ఆడెపురం ప్రసాద్, దాసరి గంగాధర్, సంకోజు అశోక్, పులి రమేష్, కౌన్సిలర్ పల్లికొండ గంగాధర్, సామల సత్యనారాయణ, బుర్ల మహేష్,ఎద్దండి దివాకర్, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# పేదింట సొంతింటి కల సాకారం,

## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న సర్పంచ్ ఆవుల మమత తిరుపతి,

ఎండపల్లి, ఆగస్టు 26, ప్రజా జ్యోతి,
మండలంలోని ఉండేడ గ్రామానికి చెందిన కటుకూరి బాలమ్మ, వెంకటి దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంట్లో బుధవారం గృహప్రవేశం నిర్వహించారు. ఈ కార్యక్ర



మానికి ముఖ్యఅతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ ఆవుల మమత తిరుపతి దంపతులకు శాలువా కప్పి ఆహ్వానించారు ,ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల సొంతింటి కలను నెరవేర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం అలాగే సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక చొరవతో ,నియోజకవర్గంలో మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పోతు రవి, వార్డు సభ్యులు గుండా మనోజ్, బొమ్మగాని శశిధర్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశాలు.. ఎమ్మెల్యే సంజయ్ శుభాకాంక్షలు

రాయికల్,ఆగస్టు 26 (ప్రజా జ్యోతి)
రాయికల్ మండలం బోర్నపల్లి గ్రామానికి చెందిన మోడీ వనిత–శంకర్ దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమానికి జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ హాజరయ్యారు. నూతన గృహంలోకి అడుగుపెట్టిన కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి చీరను కానుకగా అందజేశారు.
అనంతరం వడ్డెర కాలనీకి చెందిన బోదాసు విజయకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని ఆమెకు కూడా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చీరను కానుకగా అందజేశారు. కార్యక్రమాల్లో రాయికల్ మండల గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# కోడెల సంరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం జరగకుండా చర్యలు

- కోడెల మృతిపై విచారణకు ఆదేశం
- నూతన గోశాల నిర్మాణానికి 40 ఎకరాల స్థలం
- రాష్ట ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- గోశాలను సందర్శించిన విప్ పాల్గొన్న ఆలయ ఈఓ, మున్సిపల్ చైర్మన్ అధికారులు

వేములవాడ,ఆగస్ట్,26:ప్రజాజ్యోతి.
వేములవాడ రాజన్న ఆలయానికి భక్తులు సమర్పిస్తున్న కోడెలు, ఆవుల సంరక్షణ కోసం గోశాలను మరింత పటిష్టం చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గోశాలను సందర్శించారు... ఇటీవల ఐదు కోడెలు మృతి చెందిన ఘటనపై, గోశాల నిర్వాహకులు, దేవాదాయ శాఖ అధికారులు, సంబంధిత పశువైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.
వారు మాట్లాడుతూ చిన్న వయసు కోడెలను దూర ప్రాంతాల నుంచి తీసుకురావడం, వాతావరణ మార్పులు, వ్యాధులు తదితర కారణాల వల్ల ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. భక్తులు రాజన్నకు మొక్కు చెల్లించే ఉద్దేశంతో పాలు మరవని చిన్న కోడెలను సమర్పించకుండా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కనీసం ఏడాది వయసు వచ్చిన తర్వాత కోడెలను సమర్పిస్తే అవి వాతావరణానికి అలవాటు పడి అనారోగ్యానికి గురికాకుండా ఉండే అవకాశం ఉంటుందని సూచించారు. గోశాలకు కొత్తగా వచ్చే కోడెలను 15 రోజుల పాటు క్వారంటైన్‌లో ఉంచి, వయసు ఆధారంగా గ్రేడింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. చిన్న కోడెలు, పెద్ద కోడెలను వేర్వేరుగా ఉంచేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఒకదానిపై మరొకటి ఎగబడటం, పొడుచుకోవడం వంటి ఘటనలతో గాయాలు కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సేకరించి, క్యాబినెట్ ఆమోదం కూడా పొందినట్లు తెలిపారు. త్వరలోనే నిర్మాణానికి సంబంధించిన చర్యలు చేపట్టి వీలైనంత త్వరగా నూతన గోశాలను అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామని చెప్పారు.
ప్రస్తుతం ఉన్న గోశాల సామర్థ్యాన్ని కూడా పెంచుతున్నామని, భక్తులు సమర్పించే



వర్షాకాలం నేపథ్యంలో గోశాలలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గోశాలలో పచ్చిగడ్డి, దాతలు అందించే పశుగ్రాసంతో పాటు అవసరమైన దాణాను నాణ్యతలో రాజీ లేకుండా అందిస్తున్నామని తెలిపారు. ఇటీవల జరిగిన కోడెల మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపిస్తామని స్పష్టం చేశారు. మానవ తప్పిదం లేదా అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఘటన జరిగిందని తేలితే ప్రభుత్వ పరంగా తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.. వేములవాడలో ఆధునిక పద్ధతుల్లో నూతన గోశాల నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు 40 ఎకరాల స్థలాన్ని కోడెలను సక్రమంగా సంరక్షించి, అవసరమైన సమయంలో భక్తులకు అందించే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పాలు ఇవ్వలేని పరిస్థితికి చేరుకున్న ఆవులను కూడా కొందరు భక్తులు ఆలయానికి తీసుకొచ్చి వదిలేస్తున్నారని, వాటి సంరక్షణకు కూడా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.
భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని రాజన్న ఆలయానికి సమర్పించే కోడెల సంరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం జరగకుండా ప్రభుత్వం, దేవాదాయ శాఖ, పశుసంవర్ధక శాఖ సమన్వయంతో పనిచేస్తామని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# చిన్న కోతతో భుజం, మోకాలి కి ఆర్థ్రోస్కోపీ సేవలు

- త్వరగా కోలుకోవడం, తక్కువ నొప్పి ప్రధాన ప్రయోజనాలు:
- డాక్టర్ సుకేష్ రావు యశోద హాస్పిటల్

కరీంనగర్ టౌన్ ఆగస్టు 26(ప్రజా జ్యోతి) అధునాతన వైద్య సాంకేతికతతో భుజం, మోకాలి సమస్యలకు చిన్న కోతతో కూడిన ఆర్థ్రోస్కోపీ చికిత్సలను విస్తరించినట్లు యశోద హాస్పిటల్స్ సికింద్రాబాద్‌కు చెందిన ఆర్థోపెడిక్ నిపుణుడు డాక్టర్ సుకేష్ రావు సంకినేని తెలిపారు. భుజం ఆర్థ్రోస్కోపీ, మోకాలుకి ఆర్థ్రోస్కోపీ ద్వారా వివిధ కీళ్ల సమస్యలను ఖచ్చితంగా గుర్తించి, తక్కువ కోతతో చికిత్స అందించవచ్చని పేర్కొన్నారు. ఆర్థ్రోస్కోపీ విధానంలో పెన్సిల్ పరిమాణంలో ఉండే ఆర్థ్రోస్కోప్‌కు అమర్చిన హై–డెఫినిషన్ కెమెరా, ఫైబర్–ఆప్టిక్ లైటింగ్ సహాయంతో కీళ్ల లోపలి భాగాలను స్పష్టంగా పరిశీలిస్తారు. చిన్న రంధ్రాల ద్వారా చికిత్స చేయడం వల్ల చుట్టుపక్కల ఆరోగ్యకరమైన కణజాలానికి నష్టం తక్కువగా ఉంటుందని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ సుకేష్ రావు సంకినేని మాట్లాడుతూ, సంప్రదాయ శస్త్రచికిత్సలతో పోలిస్తే ఆర్థ్రోస్కోపిక్ విధానంలో కోత చాలా చిన్నగా ఉండటంతో కండరాలు, చుట్టుపక్కల కణజాలాలకు తక్కువ నష్టం జరుగుతుందని చెప్పారు. దీంతో శస్త్రచికిత్స




అనంతరం నొప్పి తగ్గడంతో పాటు, రికవరీ వేగంగా ఉండే అవకాశం ఉంటుందని తెలిపారు. రోగి పరిస్థితి, శస్త్రచికిత్స రకం ఆధారంగా చికిత్స అనంతరం అదే రోజు ఇంటికి వెళ్లే అవకాశం కూడా ఉంటుందని పేర్కొన్నారు.షోల్డర్ ఆర్థ్రోస్కోపీ ద్వారా రోటేటర్ కఫ్ టియర్స్, ల్యాబ్రల్ టియర్స్, షోల్డర్ ఇంపింజ్‌మెంట్, పదేపదే భుజం జారిపోవడం వంటి సమస్యలకు చికిత్స అందించవచ్చు. అలాగే ఎంపిక చేసిన కేసుల్లో ఫ్రోజెన్ షోల్డర్‌కు సంబంధించిన చికిత్సలు కూడా అందుబాటులో ఉంటాయి. మోకాలి ఆర్థ్రోస్కోపీ ద్వారా మెనిస్కస్ టియర్స్, ఏ సి ఎల్ /పి సిఎల్ పునర్నిర్మాణ శస్త్రచికిత్స, కార్టిలేజ్ లేదా చిన్న ఎముక ముక్కలను తొలగించడం, ప్రారంభ దశలోని కొన్ని కీళ్ల సమస్యలకు అవసరమైన డీబ్రైడ్‌మెంట్ వంటి చికిత్సలు నిర్వహించవచ్చు. యశోద హాస్పిటల్స్ సికింద్రాబాద్‌లో ఆధునిక ఆర్థ్రోస్కోపీ పరికరాలు, ఫ్లూయిడ్ ప్రెజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, మైక్రో ఇన్‌స్ట్రుమెంట్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణులు, ఫిజియోథెరపిస్టుల బృందం రోగుల నిర్ధారణ నుంచి శస్త్రచికిత్స అనంతర పునరావాసం వరకు సమగ్ర వైద్య సేవలు అందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ సిబ్బంది శ్రీకాంత్, మహేందర్ పాల్గొన్నారు.

# ఘనంగా మిలాద్ ఉన్ నబి వేడుకలు

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఆగస్టు 26( ప్రజా జ్యోతి)
ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జన్మదినాన్ని పురస్కరించుకుని సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బుధవారం గుండా కొనసాగింది. పెద్ద సంఖ్యలో యువత ర్యాలీలో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టి, ప్రధాన ప్రాంతాల్లో పంపిణీ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలు శాంతి, సోదరభావం, దయ, మానవత్వం, సేవాభావం వంటి విలువలను చాటుతూ





మీలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో పలు కార్యక్రమాలు చేపట్టారు.
జామే మజీద్ నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అంబేడ్కర్ చౌరస్తా మీదుగా పట్టణంలోని ప్రధాన వీధుల బందోబస్తు ఏర్పాటు చేశారు. సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేసి సేవాభావాన్ని చాటుకున్నారు. అనంతరం జామే మజీద్ నుంచి దర్గా వరకు ముస్లిం సోదరులు పాదయాత్ర నిర్వహించారు.ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్ వద్ద నిర్వహించిన ఖీర్ ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ సమీ, మాజీ అధ్యక్షులు, యూసుఫ్, ముస్తఫా, సత్తార్, సయ్యద్ సమద్, రఫిక్, మునీర్, సయ్యద్ సోహెల్, సయ్యద్ అక్రమ్, రైస్, మహమూద్, షాదాబ్, అంజద్, చాంద్, మత పెద్దలు పాల్గొన్నారు.

# మామిడిపెల్లిలో ఇల్లు కూలి మహిళా మృతి

కొనరావుపేట,ఆగస్టు.26(ప్రజాజ్యోతి)
కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో శిథిలవస్తలో ఉన్న ఇల్లు కూలిపోవడంతో ఇంట్లో నిద్రిస్తున్న గుమ్మడి లక్ష్మి , (40) అక్కడికక్కడే మృతి చెందింది. పాత ఇల్లు కావడంతో గోడలు పైకప్పు కూలినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆమె నిరుపేద కుటుంబానికి చెందిన వారని ఆమె మృతితో కుటుంబంలో తీవ్ర విషాదంలో మునిగిపోయిందని పేర్కొన్నారు. ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ మృతురాలి కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్థిక సహాయం చేయాలని కోరారు.



# అంగన్‌వాడీ పోస్టులకు 53 మంది దరఖాస్తు

మేడిపల్లి: ఆగస్ట్ 2026 ప్రజా జ్యోతి
ఉమ్మడి మేడిపల్లి మండల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు 53 మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. తొంబరావుపేటకు 23, మేడిపల్లి 1, 2 కేంద్రాలకు 9, గోవిందారానికి 11, పసునూరు తండాకు 10 మంది దరఖాస్తు చేసినట్లు అధికారులు తెలిపారు.
27 నుంచి ధ్రువపత్రాల పరిశీలన దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ 5 వరకు జగిత్యాల ఐసీడీఎస్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సీడీపీఓ జయప్రద తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన ధ్రువపత్రాల ఒరిజినల్స్‌తో పాటు గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన జిరాక్స్ ప్రతులను తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. నిర్ణీత తేదీల్లో హాజరై పరిశీలన ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు.

# బక్కూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్లేట్లెట్స్ దానం చేసిన యువకుడు

భీమారం, ఆగస్టు 26:
ప్రజాజ్యోతి భీమారం మండలం మోత్కరావుపేట గ్రామానికి చెందిన ఎగుర్ల రాధ జ్వరంతో బాధపడుతూ జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమెకు అత్యవసరంగా ప్లేట్లెట్స్ అవసరమని వైద్యులు సూచించడంతో కుటుంబ సభ్యులు బక్కూరి ఫౌండేషన్ చైర్మన్ నరేష్‌ను సంప్రదించారు. వెంటనే స్పందించిన నరేష్ సూచన మేరకు పసునూర్ గ్రామానికి చెందిన ఈర్నాల తిరుపతి ఆస్పత్రికి వెళ్లి ప్లేట్లెట్స్ దానం చేశారు. ఆపద సమయంలో స్పందించి ప్లేట్లెట్స్ దానం చేసిన తిరుపతిని బక్కూరి ఫౌండేషన్ చైర్మన్ నరేష్, ఆస్పత్రి సిబ్బంది, రోగి బంధువులు, గ్రామస్థులు అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం, ప్లేట్లెట్స్ దానం చేయడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని వారు పేర్కొన్నారు.



# ఆగస్టు 31న మాలల చలో సెక్రటేరియట్ ముట్టడి

గంభీరావుపేట ఆగస్టు 26(ప్రజా జ్యోతి);
ఎస్సీ వర్గీకరణ అనంతరం మాలలు మాల అనుబంధ కులాలకు విద్య ఉద్యోగాలు పదోన్నతుల్లో అన్యాయం జరిగిందని నిరసిస్తూ బుధవారం ఎస్సీ రోస్టర్ విధానాన్ని తక్షణమే సవరించకపోతే, ఆగస్టు



31న మాలల ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని సెక్రటేరియట్ను ముట్టడిస్తామని పిలుపునిస్తూ గంభీరావుపేట మండలంలోని అన్ని గ్రామాల మాలలు మరియు మాల ఉప కులాలు విద్యార్థులు యువతి యువకులు అన్ని గ్రామాల నుండి తరలిరావాలని సెక్రటేటివ్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా మాలల ఐక్యవేదిక జిల్లా నాయకులు ఎగదండి స్వామి బండ రమేష్ రెడ్డి మల్ల రాజనర్సు ఎడబోయిన రాజు మల్యాల రాజ్ మీరు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ యువజన సంఘం మండల కన్వీనర్ గా మురళి



చొప్పదండి, ఆగస్టు 26 (ప్రజాజ్యోతి): తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం చొప్పదండి మండల కన్వీనర్ గా కోనేరుపల్లికి చెందిన గజ్జల మురళిని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ తెలిపారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గజ్జలకాంతం ఆదేశాల మేరకు ఈ నియామకం చేసినట్లు పేర్కొన్నారు. మురళీ గత కొంతకాలంగా సంఘంలో క్రియాశీల కార్యకర్తగా పనిచేస్తూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలను, సిద్ధాంతాలను గ్రామ గ్రామాన విస్తరింప చేయడంలో అహర్నిశలు కృషి చేస్తున్నారని అభినందించారు. తన సేవలను గుర్తించి ఈ అవకాశం కల్పించినట్లు చెప్పారు.

# యువత స్వయం ఉపాధితో ముందుకు రావాలి

## -ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ,ఆగస్ట్,26:ప్రజాజ్యోతి.
యువత స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు..బుధవారం వేములవాడ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆసుపత్రితో పాటు అడ్వాన్ మెన్స్ వేర్ను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతలో ప్రతిభ, నైపుణ్యాలు పుష్కలంగా ఉన్నాయని, వాటిని సరైన దిశలో వినియోగించుకుని స్వయం ఉపాధి రంగంలో రాణించాలని సూచించారు.ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ, ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకుని యువత ఉపాధి అవకాశాలు కల్పించుకోవాలని అన్నారు. వేములవాడ పట్టణంలో నూతనంగా ఆసుపత్రి,వస్త్ర దుకాణం ఏర్పాటు చేయడం అభినందనీయమని, స్థానికులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు మరికొందరికి ఉపాధి అవకాశాలు కల్పించేలా వ్యాపారాలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు...



# సమస్యలు సాధించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తాము

- జిల్లా కేంద్రంలో జరిగిన ధర్నలో గళమెత్తిన సత్తుపల్లి విశ్రాంత ఉద్యోగులు



**సత్తుపల్లి ఆగస్టు27(ప్రజా జ్యోతి)** సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు సాధించడం కోసం జిల్లా కేంద్రం ఖమ్మంలో గురువారం జేఏసి ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం సత్తుపల్లి యూనిట్ నాయకులు పాల్గొని తమ గళం వినిపించారు. పెండింగ్‌లో ఉన్న ఉన్న సమస్యలు పరిష్కారం చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీన వైఖరి అవలంబించడం పట్ల సంఘ నాయకులు తమ నిరసన వ్యక్తం చేశారు. ఆరు డిఏలు పెండింగ్‌లో ఉన్నాయి. పీఆర్సీ నివేదిక తయారయి మూడు సంవత్సరాలు గడచినా ఇంకా నివేదికను కమిటీ ప్రభుత్వానికి అందచేయలేదు. హెల్త్ కార్డుల విషయంలో నిబంధనలు మారుస్తూ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులను ఆందోళనకు గురిచేస్తున్నారు. విశ్రాంత ఉద్యోగులు తమపై ఆధారపడిన తల్లిదండ్రులకు వైద్య సదుపాయం నిరాకరించడం దారుణం అని,సమస్యల పరిష్కారం కోసం మూడేళ్ళ వేచి చూసాము. ఇక ఆగే ప్రసక్తి లేదనీ, దశల వారి ఉద్యమానికి సిద్దంగా ఉన్నామని సత్తుపల్లి యూనిట్ నాయకులు తమ నిర్ణయాన్ని స్పష్టం చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సత్తుపల్లి యూనిట్ నాయకులు కేశవరెడ్డి, ఏ.యస్.ప్రకాశరావు, డి.కృష్ణయ్య, సాంబశివరెడ్డి, సుందరరావు, యోగానంద్, ప్రభుదాసు,జి.కృష్ణయ్య, బూరుగు దాసు, రత్తయ్య, బాలశౌరి, సత్యనారాయణ రెడ్డి, గౌడెల్లి వెంకటేశ్వర రావు, లక్ష్మీనారాయణ, మధుసూదన రాజు, ప్రసాద్, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# పలువురును పరామర్శించిన మంత్రి శ్రీనివాసరెడ్డి

**నేలకొండపల్లి, ఆగస్టు 27 ప్రజా జ్యోతి:** రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం మండలంలో పర్యటించారు. నేలకొండపల్లి లో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న లక్కం శ్రీను, లక్కం సంతోష్ లను పరామర్శించారు. ఆరోగ్య యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా







కోలుకోవాలని ఆకాంక్షించారు. అదే విధంగా నేలకొండపల్లి, నాచేపల్లి, లో జరిగిన పలు వివాహ వేడుకలలో పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించారు. ఆయన ను కలిసిన పలువురు ను ఆప్యాయంగా పలకరించారు. ఆయన వెంట మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి బచ్చలకూరి ' నాగరాజు, నెల్లూరి భద్రయ్య, బోయిన వేణు, రాయపూడి వేణు, మామిడి వెంకన్న, పాకనాటి కన్నారెడ్డి. చెరుకుపల్లి రాజేష్, కడియాల నరేష్, లక్కం ఏడుకొండలు. ఇరగదిండ్ల నాగరాజు, ముండ్రా నాగప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో
# ఘనంగా ఖేలో ఇండియా సంవాద్ నిర్వహణ

- విద్యార్థులు చదువుతోపాటు, క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి
- కళాశాల ప్రిన్సిపల్ పద్మ

**కొత్తగూడెం కలెక్టరేట్,ఆగస్టు 27,(ప్రజా జ్యోతి)** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖేలో ఇండియా సంవాద్ -- మై భారత్,నేషనల్ స్పోర్ట్స్ డే--2026 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతినుద్దేశించి చేసిన ప్రసంగాన్ని విద్యార్థులు, అధ్యాపకులు ఆన్‌లైన్ ద్వారా వీక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పోలారపు పద్మ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి ఎం.పరంధామరెడ్డి, ఎన్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్ డా.వేముల కామేశ్వరరావు,ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జ్ పొట్లపూవు శ్రీనివాసరావు,





అధ్యాపకులు, సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు. క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులు వి.వంశీ, ఎం.విక్రాంత్‌తో పాటు ఖేలో ఇండియా ఆర్చరీ కోచ్ టి.కళ్యాణ్‌ను ప్రిన్సిపాల్, కళాశాల సిబ్బంది శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పోలారపు పద్మ మాట్లాడుతూ యువత క్రీడల్లో మరింతగా రాణించి, భారతదేశం ఒలింపిక్స్‌తో పాటు అంతర్జాతీయ పోటీల్లో మరిన్ని పతకాలు సాధించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం'నషా ముక్త్ యువ--వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్'ప్రతిజ్ఞను డా.వేముల కామేశ్వరరావు చేయించారు.

# వృక్ష రక్షా బంధన్ నిర్వహించిన ఎర్రగుంట పాఠశాల విద్యార్థులు

- చెట్లకు రాఖీలు కట్టి పర్యావరణ పరిరక్షణపై అవగాహన
- చెట్లను సోదరులుగా భావించి రక్షణకు ప్రతిజ్ఞ



**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 27 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం ఉపాధ్యాయులతో కలిసి వృక్ష రక్షా బంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఎకో క్లబ్, నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలోని రావి చెట్టుకు ఆకులు, పువ్వులతో తయారు చేసిన రాఖీని కట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ రాఖీ పండుగ సోదర, సోదరీమణుల మధ్య ప్రేమానుబంధానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. అదే స్ఫూర్తితో చెట్లను కూడా సోదరులుగా భావించి వాటి రక్షణ బాధ్యతను గుర్తు చేసేందుకు ప్రతి సంవత్సరం పాఠశాలలో వృక్ష రక్షా బంధన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చెట్లు కలకాలం పచ్చగా ఉండి మానవాళికి స్వచ్ఛమైన గాలి, నీడతో పాటు అనేక విధాలుగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి సునంద రెడ్డి, ఎకో క్లబ్ ఇన్‌చార్జి మోత్కూరి పద్మ, ఉపాధ్యాయులు బాబురావు, వెంకటేశ్వరరావు, వసంత, మోతిలాల్, జయరాం, ప్రసాద్, పాఠశాల కార్యాలయ సిబ్బంది నాగేశ్వరరావు, శిరీష, ఖాసీం, ఎకో క్లబ్ విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద్ కుమార్ అన్నపురెడ్డిపల్లి మండల ప్రజలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# వైరా మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపర్చాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- రోడ్లు, విద్యుత్ దీపాలు,త్రాగునీరు, పారిశుద్ధ్యం, పౌర సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- పన్నుల వసూళ్లు 100%శాతం పూర్తి చేయాలి
- పురపాలకం లో స్వంత ఆదాయం పై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- వైరా పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్యం, పురపాలక ఆర్థిక స్థితిగతులపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్





**వైరా ప్రజా జ్యోతి** వైరా మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం, రోడ్లు,విద్యుత్,త్రాగునీరు, పౌర సేవల మెరుగుదలకు ప్రత్యేక చొరవ చూపాలని, పట్టణంలో ప్రజలకు మౌళిక వసతులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.గురువారం జిల్లా కలెక్టర్, వైరా పురపాలక కార్యాలయంలో పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్యం, పురపాలక ఆర్థిక స్థితిగతులపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. శ్రీజ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు.వైరా మున్సిపాలిటీ కి మంజూరు చేసిన అభివృద్ధి పనులు, పురోగతి, డంపింగ్ యాడ్, రోజు వారి తడి, పొడి చెత్త సేకరణ,పన్నుల వసూళ్ల వివరాలు,జరుగుతున్న అభివృద్ధి పనులు, ఆర్థిక సంఘం నిధులు, డిఎంఎఫ్టీ నిధులు, నియోజకవర్గ అభివృద్ధి నిధులు, ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా చేపట్టిన పనుల వివరాలు, వాటి స్థితిగతులను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ,వైరా పురపాలకంలో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. పట్టణంలో నూతనంగా చేపడుతున్న సిసి రోడ్లు, బీటీ రోడ్లు, స్టోర్మ్ వాటర్ డ్రైయిన్స్ సంపూర్ణ వివరాలతో కూడిన నివేదిక సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.పట్టణంలో ప్రాధాన్యత క్రమంలో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు.చిన్న మున్సిపాలిటీలకు ప్రారంభ దశలో కొన్ని సమస్యలు సహజంగానే ఉంటాయని, ముఖ్యంగా డంపింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని సూచించారు. మున్సిపాలిటీ స్థిరమైన అభివృద్ధి దిశగా పయనించేందుకు కొంత సమయం పడుతుందని, సొంత ఆదాయం కోసం ఇంటి పన్నులు,బకాయి పన్నులను లక్ష్యం మేరకు 100% శాతం పూర్తి స్థాయిలో వసూలు చేయాలన్నారు. రానున్న సంవత్సరాల్లో ప్రణాళికాబద్ధంగా నిధులు సమకూర్చుకుని పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉంటుందని తెలిపారు.మున్సిపాలిటీ పరిధిలో కనీసం రూ.150 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టేలా ప్రణాళిక రూపొందించు కోవాలని సూచించారు. ప్రభుత్వం నుంచి ఎక్కువ మొత్తంలో నిధులు మంజూరయ్యే అవకాశం ఉన్నప్పటికీ, ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడే పనులకు ప్రాధాన్యతనిస్తూ నిధులను సమర్థవంతంగా వినియోగించాలని అన్నారు. ప్రజలకు స్పష్టంగా కనిపించే అభివృద్ధి పనులను చేపట్టడం ద్వారా పట్టణ రూపురేఖలు మారడంతో పాటు, ప్రజల్లో మున్సిపాలిటీపై విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టే అభివృద్ధి పనులతో పోలిస్తే మున్సిపాలిటీ పరిధిలో చేపట్టే పనులు ప్రజలకు త్వరగా కనిపిస్తాయని, పాలకవర్గం, అధికారులు సమన్వయంతో పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.వైరా పట్టణంలో వాణిజ్య కార్యకలాపాలకు మంచి అవకాశాలు ఉన్నందున, షాపింగ్ కాంప్లెక్స్‌లు, వాణిజ్య సముదాయాలు తదితర ఆదాయ వనరులను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. వాణిజ్య ఆస్తులను సక్రమంగా నిర్వహిస్తూ, వాటికి తగిన అద్దె రేట్లను నిర్ణయించి, క్రమం తప్పకుండా అద్దెలు వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.మున్సిపాలిటీకి సొంత ఆదాయ వనరులు పెంచుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆ ఆదాయాన్ని తిరిగి పట్టణ అభివృద్ధికి వినియోగించేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. మున్సిపాలిటీ ఆదాయం పెరిగితే ప్రజలకు మరిన్ని మౌళిక వసతులు, పౌర సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి వాటికి ప్రాధాన్యత ఇవ్వడం, మంజూరైన నిధులను సమర్థవంతంగా వినియోగించడం, చేపట్టిన పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయడం ద్వారా వైరా మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చెందిన పట్టణంగా తీర్చిదిద్దాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.వైరా పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణను ప్రణాళిక ప్రకారం మెరుగుపర్చాలని అన్నారు. ప్రతి రోజూ ఉదయం వార్డ్ అధికారులు, శానిటేషన్ సూపర్ వైజర్ లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పారిశుద్ధ్య నిర్వహణను పర్యవేక్షించాలని,ప్రతి రోజూ రోడ్లను పూర్తి స్థాయిలో శుభ్రం చేయాలని,డ్రైనేజీలను క్లీన్ చేయాలని,రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.అనంతరం వైరా రిజర్వాయర్ ఆనకట్ట సమీపంలోని డంపింగ్ యార్డ్ స్థలాన్ని, నిరుపయోగంగా ఉన్న మత్స్యశాఖ భవనాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పరిశీలించారు.ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, వైరా మున్సిపల్ కమీషనర్ రామచంద్ర రావు, తహసీల్దారు సురేష్, మున్సిపల్ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్య, వైద్య రంగాల బలోపేతానికి పెద్ద పీట

- స్కిల్, టెక్నికల్ ఎడ్యుకేషన్ తో మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- గోపాలపురంలో రూ.30 లక్షలతో నిర్మించే పాఠశాల భవన పనులకు శంకుస్థాపన
- మహిళలందరికీ ముందస్తుగా రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి





**తిరుమలాయపాలెం ప్రజా జ్యోతి ఆగస్టు 27:** ప్రభుత్వ విద్య, వైద్య రంగాల బలోపేతానికి, మెరుగైన సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం ఎర్రగడ్డ గ్రామపంచాయతీ పరిధిలోని గోపాలపురం గ్రామంలో రూ. 30 లక్షల నిధులతో చేపట్టిన ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ దివాకర. టీఎస్ తో కలిసి ప్రసంగించారు.

**గత పాలకులు విస్మరించారు.. మేం చిత్తశుద్ధితో చేస్తున్నాం..**

గతంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని.. ప్రజల దీవెనలతో వచ్చిన ఈ ప్రజా ప్రభుత్వం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గడిచిన రెండున్నర ఏళ్లలో ఎంతో చిత్తశుద్ధితో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళుతున్నామన్నారు. పాలేరు నియోజకవర్గమే కాదు, రాష్ట్రవ్యాప్తంగా మన ప్రభుత్వం గత పాలకుల కంటే విద్య, వైద్య రంగాలకు రెండు మూడు రెట్లు అధికంగా నిధులు వెచ్చించిందని చెప్పారు. పేదవాడి పై ఆర్థిక భారం పడకుండా నూతనంగా ప్రభుత్వ హాస్పిటల్లు నిర్మిస్తూ, వైద్యులు, వైద్య సిబ్బందిని నియమిస్తూ అవసరమైన అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుతున్నామన్నారు.

**స్కిల్ యూనివర్సిటీ తో మెరుగైన ఉద్యోగ అవకాశాలు**

సాంకేతిక విద్య బలోపేతానికి స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ ని ఏర్పాటు చేసి దాని ద్వారా టెక్నికల్ ఎడ్యుకేషన్ అంశాలపై శిక్షణ కార్యక్రమాలతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంపొందిస్తామని ప్రకటించారు.

**ఆడబిడ్డలకు 63 వేల కోట్ల వడ్డీ లేని రుణాలిచ్చాం..**

వడ్డీ లేని రుణాలిచ్చి..క్షేత్ర స్థాయిలో మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గడిచిన రెండున్నరేళ్లలో రూ. 63 వేలకోట్ల రుణాలు ఇప్పించినట్లు వివరించారు. అలాగే..రైతుల విషయంలో ఈ ప్రభుత్వం తొలినుంచీ రైతు పక్షపాత ప్రభుత్వమని ప్రకటించారు.


**నాలుగో విడత కూడా ఇందిరమ్మ ఇల్లిస్తాం.. అర్హులంతా పింఛన్లకు అప్లై చేసుకోండి**

ఇచ్చిన మాట ప్రకారం సన్నబియ్యం ఇచ్చామని, రేషన్ కార్డులు మంజూరు చేశామని, ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడత కూడా ఇచ్చామని, పేదవాడికి సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో మూడో, నాలుగో విడత కూడా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ప్రకటించారు. అర్హులంతా 31వ తేదీ నాటికి పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని, త్వరలోనే కొత్త పింఛన్లు ఇవ్వబోతున్నామని అన్నారు. పేదవారికి మౌలికంగా ఏమవసరమో వాటన్నింటినీ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో వడివడిగా వారి గుమ్మం ముందుకే చేరవేస్తున్నామని అని చెప్పేందుకు సంతోషిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా.. కార్యక్రమానికి హాజరైన మహిళలకు, పాలేరు నియోజకవర్గ, రాష్ట్ర ఆడబిడ్డలందరికీ ముందస్తుగా రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. లి కార్యక్రమంలో.పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఎంపీడీవో సిలార్ సాహెబ్, తహశీల్దార్ విల్సన్, ఎంఈఓ నుకారపు బాబు కాంప్లెక్స్ హెచ్ఎం విజయ కుమారి పాఠశాల హెచ్ఎం ఇందిరా ఎర్రగడ్డ గ్రామ పంచాయతీ సర్పంచ్ నల్లమల్ల కీర్తి నీరజ్ కుమార్, పాలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ మండల కాంగ్రెస్ అధ్యక్షులు మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్ కోక్కిరేణి సర్పంచ్ కర్నాటి రాజేంద్రప్రసాద్ మాజీ సర్పంచ్ గడ్డి కొప్పుల రాజు బోడ మంగీలాల్ మాజీ జడ్పిటిసి బెల్లం శ్రీనివాస్ మద్దులపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నల్లమల్ల ప్రతాప్ జడల నగేష్ గౌడ్ రేపాకుల శివలింగం దుబాకుల పిచ్చయ్య గద్దల సుధాకర్ గద్దల నరసింహారావు బానోత్ సిమ్లా నాయక్ భానోత్ అనిల్ నల్లబెల్లి లింగన్న ఉన్నం రామయ్య ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు. పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలి


- ధర్నా చౌక్‌లో 'టీజీఈజేఏసీ' మహాధర్నా
- జిల్లా కలెక్టర్ ద్వారా ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేసిన జేఏసీ నాయకులు

**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 27,(ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, కార్మికులు , పెన్షనర్ల దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గవర్నమెంట్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ కొత్తగూడెం జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక ధర్నా చౌక్ వద్ద సోమవారం "మహాధర్నా" నిర్వహించారు ,ఈ కార్యక్రమానికి వేలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తమ విధులకు సెలవు పెట్టి స్వచ్ఛందంగా పాల్గొన్నారు, మహాధర్నాను ఉద్దేశించి టి జి ఈ జేఏసీ జిల్లా చైర్మన్ అమరనేని రామారావు ,కన్వీనర్ సంగం వెంకట పుల్లయ్య లు మాట్లాడుతూ నేడు జరుగుతున్న ధర్నాకు హాజరైన ఉద్యోగ ప్రభంజనాన్ని చూస్తుంటే ప్రభుత్వంపై ఉద్యోగుల తిరుగుబాటు స్పష్టంగా





కనిపిస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ వర్గాలు నిరంతరం అంకితభావంతో పనిచేస్తున్నాయని, కానీ వారి ఆర్థిక, సేవా, ఆరోగ్య భద్రతను నిర్లక్ష్యం చేయడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు టీజీఈ జేఏసీ తరపున ప్రభుత్వం ముందు ఉంచిన ప్రధాన డిమాండ్లను తెలియజేస్తూ మొదటిగా2వ వేతన సవరణ కమిషన్ నుండి నివేదికను తెప్పించుకొని తక్షణమే అమలు చేయాలన్నారు, ఉద్యోగులు, పెన్షనర్లకు రావలసిన 6 డిఎ(కరువుభత్యాలను) వెంటనే విడుదల చేయాలన్నారు, నెలకు 2,000 కోట్ల చొప్పున పేరుకుపోయిన సుమారు 10,000 కోట్ల ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు/బిల్లులను తక్షణమే మంజూరు చేయాలని, అదేవిధంగాకాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ను పూర్తిగా రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనీ, నూతన ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను నగదు రహిత ప్రాతిపదికన సక్రమంగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు, అనంతరం, ధర్నా చౌక్ నుండి భారీ నిరసన ర్యాలీగా వెళ్ళి, తమ న్యాయమైన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి కి, తెలంగాణ ప్రభుత్వానికి అందజేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్కు జేఏసీ నాయకులు వినతి పత్రం అందజేశారు, ఈ కార్యక్రమంలో టి జి ఈ (జెఏసి) జిల్లా నాయకులు, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, గెజిటెడ్ అధికారుల సంఘాల ప్రతినిధులు, పెన్షనర్లు కార్మికుల తో పాటు టి జి ఈ జెఏసి భార్గవ్ చైతన్య,పి నర్సయ్య, ఎం వెంకటేశ్వర్లు, వెంకటరమణ,బి రవి,భగవాన్ రెడ్డి,ఎం. ఈ జి ఆర్ ప్రసాద్,టి.సుశీలా,హరిలాల్,రాములు,లక్ష్మణ్ నాయక్,వి శ్రీనివాస్, దుర్గయ్య,టి శ్రీనివాస రెడ్డి,జమలా రెడ్డి,బందు వెంకటేశ్వరావు,సతీష్ కుమార్,అజ్మీరా రామ్ రవి,అశోక్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.



## టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద భారీ ధర్నా

హైదరాబాద్, ఆగస్టు 27 (ప్రజాజ్యోతి): టీజీఈజేఏసీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ఇందిరా పార్క్ వద్ద జరిగిన భారీ ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మారం జగదీశ్వర్, చైర్మన్, ఎలూరి శ్రీనివాస్ రావు, జనరల్ సెక్రటరీ, డా. ఎస్.ఎం. హుస్సేనీ (ముజీబ్), టీఎన్జీవోస్ జనరల్ సెక్రటరీ బి శ్యామ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మారం జగదీశ్వర్ మాట్లాడుతూ, తమ ఉద్యోగులు, పెన్షనర్ల దీర్ఘకాలిక న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఇప్పటికే ఎన్నోసార్లు



ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని, కానీ ప్రభుత్వం తాత్సారం చేస్తుందని అన్నారు. తమ ప్రధాన డిమాండ్ల గురించి ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా ఎన్నోసార్లు మెమోరండం సమర్పించామని తెలిపారు. తెలంగాణ ఉద్యోగులు అందరూ భారీ సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతున్నామని అన్నారు.

ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, అవుట్సోర్సింగ్ ఉద్యోగులు, పెన్షనర్లు దాదాపు పది వేల మంది హాజరయ్యారు. ఉద్యోగుల సమస్యలు, డిమాండ్లపై టీజీఈ జేఏసీ హైదరా బాద్ సిటీ చైర్మన్ కట్కూరి శ్రీకాంత్, హైదరాబాద్ జిల్లా చైర్మన్, విక్రమ్, రంగారెడ్డి జిల్లా చైర్మన్ పూటు యశ్వంత్ నాయకత్వం వహించారు. హైదరాబాద్ సిటీ కన్వీనర్ గండూరి వెంకటేష్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ కృష్ణ యాదవ్, రంగారెడ్డి జిల్లా కన్వీనర్ శ్రీ రామారావ కార్యక్రమ నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా టీజీఈజేఏసీ నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు ఎంతోకా లంగా ఎదురు చూస్తు న్న 2వ పీఆర్సీని ఎటువంటి జాప్యం లేకుండా వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను కూడా వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న సంఘాల నాయకుల కస్తూరి వెంకటేశ్వర్లు. సత్యనారాయణ గౌడ్ సహదేవ్ డాక్టర్ హరికృష్ణ శ్రీరామ్ రెడ్డి వెంకటరమణ ఏమే ఖాదర్ మంజులా రెడ్డి శైలజ ఉమా రెడ్డి వరలక్ష్మి స్వరూప లక్ష్మి. అపరంజిత. అమరేందర్. నరసింహ స్వామి. రాజు అవినాష్ విజయ్ మహేష్ గౌడ్. రాజ్ కుమార్ కుతాడి శ్రీనివాస్. డి నరేందర్. కొండల్ రెడ్డి. బాల్రాజ్ రాజు. ఆశన్న మల్లికార్జున్ రెడ్డి. పూనం పేరయ్య గౌస్ డాక్టర్ జోషి. సత్యనారాయణ దేవేంద రవికుమార్. ముఖ్య నాయకులు పాల్గొన్నారు

మన ప్రధాన డిమాండ్లు:

1. కొత్త పీఆర్సీ అమలు
2. పెండింగ్‌లో ఉన్న 6 డీఏల విడుదల
3. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరణ
4. ఉద్యోగ ఆరోగ్య కార్డుల పూర్తి స్థాయి అమలు
5. ఉద్యోగుల పెండింగ్ బిల్లుల క్లియరెన్స్
6. జీవో నెం. 25 సవరణ, జీవో నెం. 190 అమలు

తక్షణమే చర్యలు తీసుకొని పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.

## హన్మకొండలో బిఆర్ఎస్ ధర్న

వరంగల్,ఆగస్ట్27(ప్రజాజ్యోతి): బీఆర్ఎస్ ఎల్పీఉప నేత తన్నీరు హరీష్ రావును హనుమకొండ సుబేదారి లో పోలీసులు అరెస్ట్ చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ ఉద్యోగులకు హరీష్ రావు మద్దతు తెలిపారు. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం సమీపం లోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ఆందోళనకు వెళు తున్నారనే సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఉద్యోగుల ధర్నాకు సంఘీభావం తెలిపిన తర్వాత హరీష్ రావును అరెస్ట్ చేసే



ప్రయత్నం చేయగా, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు అడ్డుకోవడంతో ఉద్రిక్త త వాతావరణం నెలకొంది. హరీష్ రావును సమీపంలోని సుబేదారి పోలీసు స్టేషన్ కు కాలినడకన తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు సుబేదారి పీఎస్ కు తరలివచ్చి స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా చేశారు. అలాగే జిల్లాలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. జిల్లాలో జీవో 97 రద్దు చేయాలని నిరసనలు తెలుపుతున్న పాలిటెక్నిక్ విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు మాజీ మంత్రి హరీశ్ రావు వస్తున్న నేపథ్యంలో వరంగల్ పాలిటెక్నిక్ కళాశాల దగ్గర పోలీసులు భారీగా మోహరించారు. కళాశాలకు వచ్చే విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి పంపించారు. అలాగే వరంగల్, హనుమకొండలో విద్యార్థి నాయకులను అరెస్టు చేశారు. ఇప్పటికే ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్‌ను హౌస్ అరెస్ట్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలకు వచ్చిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డిని అడ్డుకుని అక్కడి నుంచి పంపించారు.

## నేడు ఎథిక్స్ కమిటీ సమావేశం

### కడియంపై వ్యాఖ్యలపై కౌశిక్ రెడ్డికి నోటీసులు
### కౌశిక్‌ను దోషిగా నిలబెట్టే ప్రయత్నంపై వేముల ఆగ్రహం

హైదరాబాద్,ఆగస్ట్27(ప్రజాజ్యోతి): హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి ఎథిక్స్ కమిటీ నోటీసులు జారీ చేసింది. స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై చేసిన వ్యాఖ్యలపై ఆగస్ట్ 29న అసెంబ్లీ కమిటీ హాల్1లో ఉదయం 11 గంటలకు ఎథిక్స్ కమిటీ భేటీ కానున్నది. కౌశిక్ రెడ్డిపై వచ్చిన ఫిర్యాదుపై కమిటీ విచారించనున్నది. కాగా, 'ఎథిక్స్ కమిటీ పేరిట కాంగ్రెస్ సర్కార్ ప్రతిపక్షంపై కక్ష సాధింపునకు పాల్పడుతున్నదని, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని బలిచేసేందుకు కుట్రలు చేస్తున్నదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. నిండు శాసనసభలో బడివే, పండబెట్టి తొక్కుతా, బట్టలూడదీసి కొడుతా, మా దగ్గర కండలు తిరిగినోళు న్నరు.. బొర్ల వేసి కొడ్తం.. అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, 'అరేయ్ తోలుతీస్తా, బయట తిరుగనివ్వను' అని దానం నాగేందర్, 'పదికత్తులు లేస్తే మీ తలలు తెగుతయ్.. కత్తులతో కోలాటమాడుతా' అని మందుల సామేల్ బెదిరింపులు, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మంత్రి పొన్నం ప్రభాకర్ అసభ్య సైగలు ఎథిక్స్ కమిటీ కిందికి రావా? అని సూటిగా ప్రశ్నించారు. వారు మాట్లాడిన మాటలు, చేసిన చేష్టల వీడియోలు చూపుతూ ధ్వజమెత్తారు. కౌశిక్‌రెడ్డి ప్రవర్తనపై చర్చించి చర్యల సిఫార్సుకు ఈ నెల 29న ఎథిక్స్ కమిటీ మీటింగ్ ఏర్పాటుచేసినట్టు నోటీసు వచ్చిందని, అయితే కౌశిక్ వ్యవహారాన్ని సిఫార్సు చేసిన సమయంలో ఎథిక్స్ కమిటీ మనుగడలో లేదని తెలిపారు. అసలు కమిటీ లేనప్పుడు ఆ వ్యవహారాన్ని ఎలా రెఫర్ చేస్తారని ప్రశ్నించారు. దీనిని బట్టి కక్ష సాధింపు చర్యగా అర్థమవుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన కడియం శ్రీహరి అదే ప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని కౌశిక్ ఆక్షేపించారని తెలిపారు.

# రాఖీ పౌర్ణమి వేళ ఆధ్యాత్మిక శోభ



**నేడే రాఖీ పౌర్ణమి ,యజ్ఞోపవీత ధారణ ,హయగ్రీవ జయంతి**

**అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీ..**

**జ్ఞానప్రదాత హయగ్రీవుని ఆరాధన. పవిత్ర యజ్ఞోపవీత ధారణతో వేద సంప్రదాయానికి పునరంకితం**

నిర్మల్ జిల్లా ప్రతినిధి ,ఆగష్టు 28 ,( ప్రజాజ్యోతి ): రాఖీ.. రక్తసంబంధానికి మించిన ఆత్మీయతకు ప్రతీక:

రాఖీ కేవలం ఒక దారం కాదు.. ప్రేమ, విశ్వాసం, బాధ్యత, రక్షణకు ప్రతీక. సోదరి సోదరుడి మణికట్టుకు రాఖీ కడుతూ అతని క్షేమాన్ని కోరుతుంది. సోదరుడు ఆమెకు జీవితాంతం అండగా ఉంటానని భరోసా ఇస్తాడు. కాలానుగుణంగా రాఖీ పండుగ పరిధి విస్తరించి కుటుంబ సభ్యులు, గురువులు, ఆత్మీయులు పరస్పరం రక్షాసూత్రాలు కట్టుకునే సంప్రదాయం కూడా కొనసాగుతోంది. రాఖీ పండుగ కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు పరస్పర గౌరవం, ప్రేమ, బాధ్యతలను గుర్తుచేస్తుంది.

**జ్ఞానానికి ప్రతిరూపం.. శ్రీ హయగ్రీవ స్వామి :**

శ్రావణ పౌర్ణమికి ఆధ్యాత్మికంగా మరో విశిష్టత శ్రీ హయగ్రీవ జయంతి. శ్రీమహావిష్ణువు అవతారమైన హయగ్రీవ స్వామి జ్ఞానం, విద్య, వేదవిద్యకు అధిదేవతగా ఆరాధించబడతారు. గుర్రం ముఖం, మానవ శరీరంతో దర్శనమిచ్చే హయగ్రీవ స్వామి వేదాలను తిరిగి బ్రహ్మదేవునికి అందించిన అవతారంగా పురాణ సంప్రదాయం వివరిస్తుంది. అందువల్ల హయగ్రీవుని ఆరాధనకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, వేదాధ్యయనులు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తారు. జ్ఞాపకశక్తి, మేధాశక్తి, విద్యాభివృద్ధి, వివేకం కలగాలని భక్తులు స్వామివారిని ప్రార్థిస్తారు.

**యజ్ఞోపవీత ధారణ వేదాధ్యయనానికి పునఃసంకల్పం :**

శ్రావణ పౌర్ణమి సందర్భంగా వైదిక సంప్రదాయాన్ని అనుసరించే వారిలో ఉపాకర్మ, యజ్ఞోపవీత ధారణకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో దీనిని సాధారణంగా జంధ్యాల పౌర్ణమి అని కూడా



వ్యవహరిస్తారు. యజుర్వేదాన్ని అనుసరించే సంప్రదాయాల్లో శ్రావణ పౌర్ణమి నాడు ఉపాకర్మ నిర్వహించడం ఆనవాయితీగా ఉంది. ఈ సందర్భంగా పాత యజ్ఞోపవీతాన్ని విసర్జించి, శాస్త్రోక్తంగా నూతన యజ్ఞోపవీతాన్ని ధరించడం జరుగుతుంది.

యజ్ఞోపవీత ధారణ కేవలం ఆచారం మాత్రమే కాకుండా వేదాధ్యయనం, నిత్యకర్మలు, ధర్మాచరణ పట్ల వ్యక్తి తన బాధ్యతను పునరుద్ఘాటించుకునే పవిత్ర సంకల్పంగా భావిస్తారు. ఉపాకర్మలో ఋషులకు కృతజ్ఞతలు సమర్పిస్తూ, వేదమంత్రాల అధ్యయనాన్ని కొనసాగించేందుకు సంకల్పం చేస్తారు. తదుపరి రోజున గాయత్రీ జపానికి కూడా ప్రాధాన్యం ఉంటుంది.

**ఒకే పౌర్ణమికి మూడు విశిష్ట ఆధ్యాత్మిక సందేశాలు :**

రాఖీ పౌర్ణమి బంధాలను బలోపేతం చేసే ప్రేమకు, హయగ్రీవ జయంతి జ్ఞానం–విద్యలకు, యజ్ఞోపవీత ధారణ ధర్మం–వేదాధ్యయనం–బాధ్యతకు ప్రతీకలుగా నిలుస్తాయి. అందుకే శ్రావణ పౌర్ణమి భారతీయ ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాల్లో విశిష్టమైన స్థానాన్ని పొందింది.

ఈ పవిత్ర పర్వదినం సందర్భంగా ప్రతి ఒక్కరూ కుటుంబ బంధాలను గౌరవిస్తూ, జ్ఞానాన్ని పెంపొందించుకుంటూ, ధర్మమార్గంలో నడవాలని పెద్దలు సూచిస్తున్నారు.

రాఖీ బంధం ప్రేమను పెంచగా హయగ్రీవుని ఆరాధన జ్ఞానజ్యోతిని వెలిగిస్తూ యజ్ఞోపవీత ధారణ వేదసంప్రదాయాన్ని తరతరాలకు కొనసాగించే పవిత్ర సంకల్పంగా నిలుస్తోంది.

**రాఖీ పౌర్ణమి భారతీయ సంస్కృతిలో సోదరసోదరీమ ణుల మధ్య ప్రేమానురాగాలు, ఆత్మీయత, పరస్పర రక్షణకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన పర్వదినం. శ్రావణ మాస పౌర్ణమి రోజున దేశవ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో రక్షాబంధన్‌ను జరుపుకుంటారు. సోదరీమ ణులు తమ సోదరులకు రాఖీ కట్టి, వారు ఆయురారోగ్యా లతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని భగవంతుడిని ప్రార్థిస్తారు. సోదరులు తమ సోదరీమణులకు అండగా నిలిచి, వారి రక్షణకు కట్టుబడి ఉంటామని హామీ ఇవ్వడం ఈ పర్వదినం యొక్క ప్రధాన సందేశం.**

## పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

### ఆటోను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు
### ఏడుగురు మృతి...కొందరికి తీవ్ర గాయాలు
### దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సిఎం చంద్రబాబు, మంత్రులు

పల్నాడు,ఆగస్ట్27 : పల్నాడు జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చిలకలూరిపేట అడ్డరోడ్డు సెంటర్ వద్ద ఆటోను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. దీంతో వారిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మృతులను బొంతా బాబు, బొంతా మణెమ్మ, సంపూర్ణమ్మ, లక్ష్మమ్మ, గంగమ్మ, మరియమ్మ, చౌటుపల్లి సువార్తగా గుర్తించారు. కాగా, బాధితులంతా చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామస్థులుగా పోలీసులు తెలిపారు. వీరంతా ప్రకాశం జిల్లా కొండమంజులూరులో జరిగిన పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలు, బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. రోడ్డు ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, సత్య కుమార్ స్పందించారు. రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడం, పలువురు గాయపడటంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు పల్నాడు జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. విజయవాడ నుంచి తిరుపతి వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు.. ఆటోను ఢీకొని ఏడుగురు మృతి చెందడం, పలువురు తీవ్రంగా గాయపడటంపై సీఎం విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు అధికారులకు ఫోన్ చేసి ప్రమాదం గురించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మృతి చెందిన వారు చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామస్థులుగా అధికారులు వివరించారు. తీవ్రంగా గాయపడిన వారిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. 'పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాం÷–రతికి గురి చేసింది. ఒకే ఊరికి చెందిన వారు పుట్టినరోజు వేడుకలకు వెళ్లొస్తూ ప్రాణాలు కోల్పోవడం కలచివేసింది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించాం. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది. మృతుల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అని లోకేశ్ పేర్కొన్నారు. చిలకలూరిపేట రోడ్డు ప్రమాదంపై హోంమంత్రి వంగలపూడి అనిత దిగ్భ్రాంరతి వ్యక్తం చేశారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే పల్నాడు జిల్లా అదనపు ఎస్పీకి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, బస్సు వేగం, డ్రైవింగ్ నిర్లక్ష్యం సహా అన్ని కోణాల్లో విచారణ చేయాలన్నారు. బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రైవేటు ట్రావెల్స్ వాహనాల రోడ్డు భద్రతా నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు హోంమంత్రి అనిత ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటనపై వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కూడా స్పందించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. రోడ్డు ప్రమాదంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడంపై ఉప ముఖ్యమంత్రి దిగ్భ్రాంతి చెందారు. అధికారుల నుంచి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. మృతుల కుటుంబాలను కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ప్రైవేట్ బస్సులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రైవేట్ బస్సుల తనిఖీలు ముమ్మరం చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు. ప్రమాదంపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తీవ్ర దిగ్భ్రాం÷–రతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొంటూ.. మృతుల కుటుంబాలకు పల్లా ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి ఎలాంటి జాప్యం లేకుండా మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రైవేటు బస్సుల ఫిట్‌నెస్, ప్రయాణికుల భద్రతా ప్రమాణాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదంలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని పల్లా శ్రీనివాసరావు ఆకాంక్షించారు. చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో రోడ్డు ప్రమాద మృతదేహాలను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సందర్శించారు. ప్రమాద ఘటనపై పోలీసులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.




**ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం TGEJAC ఆధ్వర్యంలో గురువారం రాష్ట్రవ్యాప్తంగా మహాధర్నా నిర్వహించారు.**

## జన్‌ధన్ డిపాజిట్లు రూ.3.17లక్షల కోట్లు

### 59 కోట్లకు పైగా బ్యాంకు ఖాతాలను తెరిచిన ప్రజలు
### వివరాలను వెల్లడించిన కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ,ఆగస్ట్27(ప్రజాజ్యోతి): దేశవ్యాప్తంగా జన్‌ధన్ ఖాతాల్లో మొత్తం డిపాజిట్లు రూ.3.17లక్షల కోట్లకు చేరాయి. 59 కోట్లకు పైగా బ్యాంకు ఖాతాలను ప్రజలు తెరిచారు. ప్రధాన్ మంత్రి జన్ ధన్ యోజన 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ వివరాలను




వెల్లడించింది. ఇది బ్యాంకింగ్, ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి నిదర్శనం అని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరీ పేర్కొన్నారు. మొత్తం ఖాతాల్లో 78 శాతం గ్రామీణ, నగర ప్రాంతాల్లో ఉండగా.. అందులో 56 శాతం ఖాతాలు మహిళల పేరిటే ఉండటం విశేషం. ఖాతాదారులకు ఇప్పటివరకూ 41.29 కోట్లకు పైగా రూపే డెబిట్ కార్డులు జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఖాతాల ద్వారా ఉచిత ప్రమాదబీమా, పెన్షన్ సదుపాయం కల్పిస్తున్నారు. కనీస మొత్తం లేకుండానే రూ.10 వేల వరకు ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యం, ముద్రా రుణాలు అందిస్తున్నారు. జన్ ధన్–ఆధార్–మొబైల్ అనుసంధానం ద్వారా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నేరుగా లబ్దిదారుల ఖాతాల్లోకే జమ అవుతున్నాయి. 2014 ఆగస్టు 28న ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుపేద భారతీయులకు సైతం బ్యాంకు ఖాతా సౌకర్యం కల్పించడానికి ప్రధానమంత్రి జన్‌ధన్ పథకాన్ని ప్రారంభించారు. దేశంలో ప్రతి కుటుంబానికి ఒక్క బ్యాంకు ఖాతా అయినా ఉండేటట్లు చూడడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. ఈ ఖాతాల వల్ల ప్రజలు భద్రంగా డబ్బు పొదుపు చేసుకోవడం, బ్యాంకు రుణాలు పొందడం సులువు అవుతుంది. జన్‌ధన్ ఖాతాలను కనీస నిల్వ లేకుండానే నిర్వహించుకోవచ్చు.. కానీ చెక్కు సౌకర్యం కావాలంటే మాత్రం ఖాతాలో కనీస బ్యాలన్స్ తప్పనిసరి నిబంధన విధించారు.


Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967